



పూర్వకాలమందు కుండలినీద్వీప రాజ్యానికి చిత్రసేనుడు ప్రభువుగా ఉండేవాడు. మన కథ నడిచేనాటికి, చిత్రసేనుడు రాజ్యానికి వచ్చి రెండేళ్ళు అయింది. ఐతేయేం?– తన పరిపాలనలో ప్రజ సమస్త సౌఖ్యాలూ అనుభవించాలెననీ, తన రాజ్యం రామరాజ్యం అనిపించుకోవాలనీ ఆయనకు కుతూహలం. ఈ అభిలాషతో చిత్రసేన మహారాజు ప్రజలపై పన్నులన్నీ సగానికి సగం తగ్గించి వేశాడు.

రాజు ధర్మగుణానికి ప్రజ ఎంతగానో సంతోషించారు. పన్నుల భారం తగ్గటంతో ప్రజకు సుఖంగానే వుంది. రాజ్యంలో ఎక్కడ చూచినా చిత్రసేనుని గురించిన గాథలే! ఏమూల విన్నా ప్రభువును కీర్తించే పాటలే!! ఈ విధంగా చిత్రసేన మహారాజు ఖ్యాతి మోగిపోయింది.

బాగానే వుంది. రాజుపేరు దశదిశలా మోగిపోవడం సంతోషింపతగిందే. కాని, అటు పేరు మోగుతున్నకొద్దీ ఇటు ఖజానాలో ద్రవ్యం తరుగుతూవచ్చింది. అదే పనిగా కర్చుపెడుతూవుంటే ఎక్కడి ధనం ఆగుతుంది? ధనం లేకపోవటంచేత పరిపాలన తారుమారు కాజొచ్చింది.

మంత్రి బుద్ధిసూక్ష్మత కలవాడు. రాజు సంకల్పం గమనించేవున్నాడు. అందువల్ల రాగల ఫలితాలుకూడా ఆయనకు మొదటనే తెలుసు. అందుకనే, అవకాశం దొరికినప్పుడెల్లా రాజుతో మంచిచెడ్డలు చెబుతూనే వచ్చాడు. కాని, చూడబోతే 'నా తరంలో



నా ప్రజకు శాశ్వతమైన మేలుచేసి తీరాలి' అని దీక్షపట్టిన చిత్రసేనుడికి మంత్రిమాటలు చెవికెక్కలేదు. ఎన్ని విధాల చెప్పిచూచినా రాజు వినిపించుకొనక పోయేసరికి మంత్రి విసిగి వేసారిపోయాడు.

ఖజానా ఖాళీ ఐంది. పైసాఐనా నిలవ లేకపోయె. ఊరుకొంటే ముప్పు కలుగుతుందని తెలుసుకొన్నాడు మంత్రి.

ఏమైతేకానీ అని, చొరవతో ఒకనాడు ప్రభువును దర్శించి, "మహారాజా!— ఏలిక చేసిన శాసనం ప్రజకు సౌఖ్యంగానే వున్నది. ఐతే, మన ధనాగారం ఒకవంక వట్టిపోతున్నది. ధనం లేకుంటే ఏ పని సాగుతుంది? మాట తక్కని మంత్రిపదవినే నెలా నిర్వహించేది? కనుక, నాకి బాధ్యత తప్పించవలసిందని దేవరను కోరుతున్నాను" అన్నాడు.


"అంత విషమించిందా పరిస్థితి?" అని ప్రశ్నించాడు రాజు.

"ఏమని మనవిచేసేది ప్రభూ!-అపతల ఉద్యోగులకూ ఇపతల సైనికులకూ నెల జీతా లివ్వాలి. ఇంకొక్క వారమే వ్యవధి ఉన్నది. ఖజానాలో ఉండే సొమ్ముతో సిల్లు మోసే తోటమాలీల భత్యాలైనా సరిపెట్టలేమని తోస్తుంది." అని మనవిచేశాడు

ఇందుకు రాజు "సరే. రేపటి రోజున దర్బారు ఏర్పాటు చేయించుమంత్రీ!-మన మంత్రులే కాదు, రాజ్యంలో పెద్దమనుషులనూ సభకు రప్పించు" అని చెప్పాడు.

మంత్రి వెళ్ళిపోయాడే కాని, రాజు మనస్సులో ఉద్దేశం ఏమిటో అర్థంకాలేదు. ధనాగారంలో డబ్బు లేకపోతే కొత్త పన్నులు విధించాలి. ఇలా దర్బారులు ఏర్పాటుచేసి అందరనూ రప్పించినంత మాత్రాన కాబోయేదేమిటి? అనుకొన్నాడు. ఏమైతేనేం, రాజాజ్ఞ! నెరవేర్చితీరాలి.

రాజ్యంలో దండోరా వేయించారు. చాటింపు విన్న ప్రజకు సంగతి సందర్భమూ



తెలియదాయె. అందుచేత, నలుగురూ నాలుగువిధాల అనుకొన్నారు. ఇంతకూ, రాజు దయామయుడని అందరకూ వెల్లడి అయేవున్నది. దీనినిబట్టి కొంతమంది 'అసలు పన్నులు మొత్తంగానే తీసివేస్తా డయ్యా, ధర్మప్రభువు!' అంటూ వదంతులు వ్యాప్తిచేయజొచ్చారు.

మేకలవంటి ప్రజ ఈ మాటలు, నిజమే నని నమ్మారు.


అనుకున్నప్రకారం మరునాడు దర్బారు ఏర్పాటయింది. మంత్రిపుంగవులూ, ముఖ్యోద్యోగులూ, రాజ్యంలో పేరుమోసిన పెద్దమనుష్యులూ వచ్చేశారు. సభ కిటకిట లాడుతూవుంది. చిత్రసేన మహారాజులుంగారుదర్బారుకు విచ్చేసి,సింహాసనం అధిష్ఠించారు. రాజుగారి ఆజ్ఞను శిరసావహించి ముఖ్యమంత్రి సభవారికి ఇలా చెప్పాడు:

"మన ప్రభువుల వంశం దయాధర్మాలకు కీర్తిగాంచింది. ప్రజను కన్నబిడ్డలలాగా చూచుకోవడం వారి వంశాచారమైవున్నది. అసలు మన రాజ్యంలో పూర్వం విధింపబడి అమలులో వుంటున్న పన్నులే నామమాత్రమైనవి. అటువంటిది, ఇప్పుడు కరుణాసింధువులని బిరుదువహించిన మన చిత్రసేనమహారాజులుంగారి హయాముల్లో ఆ పన్నులు సగానికి సగం తగ్గిపోయిన సంగతి అందరికీ తెలిసిందేకద! ఈ నామమాత్రపు పన్నులతో రాజ్యపాలన సాగేది ఎలా అనేది ఇప్పుడొక సమస్య ఐకూర్చుంది" అని చెబుతూవుండగా—

సభలోనుండి ఒకడు లేచి, "ప్రజల మీద పన్నులు వేయకుంటే పరిపాలన సాగనేసాగదా?" అని ప్రశ్నించాడు.

ఈ ప్రశ్నకు అక్కడ దర్బారులో అంతా విస్తుపోయారు. ముఖ్యమంత్రికి మతిపోయినంత పనిఅయింది.

అయినా, గుండె దిటవుచేసుకొని మంత్రి మళ్ళీ ఇలా ఉపన్యసించాడు: "మీరే ఆలో



చించండి—మన రాజ్యంలో జనాభా ఎంత ? అంతమందీ చల్లగా ఉండాలంటే ఎన్నెన్ని సౌకర్యాలు ఉండాలి ? ఆరోగ్యం కాపాడుకునేటందుకు మందు మాకులూ వద్దా ? పెరిగి పెద్ద కావలసిన బిడ్డలకు చదువు సంధ్య లక్కరలేదా ?—ఇంతకూ, పరరాజులు ఏ క్షణాన్నయినా మనమీదికి దాడి చేయవచ్చు. ఈ భయం లేకుండా రాజ్యం రక్షించుకునేటందుకు సైన్యం ముఖ్యం కదా ?—పన్నులు వేయక వీటన్నింటికీ ధనం ఎలా వస్తుంది? ఎక్కడినించి ఏ విధంగా డబ్బు తెచ్చి ప్రజకు సౌఖ్యాలు చేకూర్చటం? కనుక పన్నులంటే ఏమిటో, వీటిని ఎందుకు విధించాలో తెలుసుకోవటం ప్రతి పౌరునికీ విధి..." అని చెబుతూ వుండగా, ఇంతవరకూ వింటూ కూర్చున్న చిత్రసేనుడు—

"మన మంత్రి చెప్పిన మాటలన్నీ చక్కగానే వున్నాయి. అయితే, ఒకసారి తగ్గించిన పన్నులను తిరుగా విధించినట్టయితే, మునుపటి పద్ధతిలో వసూలుచేయగలమా అనేది ప్రశ్న" అన్నాడు సంశయంతో.

సభలో గుసగుసలు బయలుదేరినై. దర్బారులో ఒకడు నిర్భయంగా లేచి—

"మహారాజా! తగ్గించిన పన్నులు తిరుగా పెంచడమనేది చాలా ఆలోచించవలసిన సమస్య. ఇప్పటికి ఇంకా, దేశదేశాల వ్యాపిస్తున్నటువంటి ప్రభువుల కీర్తి కాస్తా హారతికర్పూరంలాగా హరించిపోతుంది. మహీపతులు మాటతప్పడమనేది సామాన్య విషయం కాదు. ఆలోచించండి ప్రభూ! బాగా ఆలోచించండి!!" అన్నాడు.

ఈ మాటలలో రాజుకు గొప్ప యదార్థం గోచరించింది. తను గద్దె ఎక్కినప్పటి నుంచీ ఇప్పటివరకూ ఆర్జించుకువస్తున్న యశస్సు క్షణంలో మాయమైపోతుందే! కనుక, తగ్గించిన పన్నులు పెంచటానికి ఎంతమాత్రం వీలులేదు. వేరు మార్గాలు

వెతకవలసిందే అని నిశ్చయించుకొన్నాడు రాజు. "ఒకసారి చేసిన నిర్ణయాన్ని మేము మార్చబోము. తగ్గించిన పన్నులను పెంచేది లేదు. కొత్త పన్నులను విధించడమనేది లేదు. మా నిర్ణయం తెలిసిందికద? పైగా, పరిస్థితులన్నీ వెల్లడించేవున్నాడుకద మంత్రి?—ఇప్పుడు చెప్పండి ఏదైనా ఉపాయం" అన్నాడు రాజు.

దర్బారంతా నిశ్శబ్దమైపోయింది! ఒకరి ముఖం ఒకరు చూచుకొనటమే కాని, ఏం జవాబు చెప్పాల్లో ఒకళ్లకూ ఏమీ తోచిందికాదు. ఈ సమయంలో, సేనాధిపతి ఇన సమరసేనుడు లేచి—

"మహాప్రభూ!—ధనాగారం నింపడమనేది అదేకి పెద్ద సమస్య కానేకాదు. ఆ మార్గాంతరం నే చెప్పగలను. ఐతే—అది చాలా గుప్తవిషయం. అందుచేత, రహస్యంగా మనవిచేసుకొంటా" అన్నాడు.

సరే. రాత్రి పదిగంటలప్పుడు ఏకాంతంగా ఉద్యానవనంలో, మహారాజును సేనాధిపతి దర్శించాలెనని ఏర్పాటు జరిగింది.

సేనాధిపతి నోటినుండి వెలువడ్డ మాటలు చెవినిపడగానే, దర్బారులో ప్రతిఒక్కరూ జిజ్ఞాసలో పడ్డారు—ఏమైవుంటుందా ఈ దేవరహస్యం అని. ఐనా, రేపు ఈపాటికి



అంతా వెల్లడిఅవుతుందికదా అనే తృప్తితో వారు సరిపెట్టుకొన్నారు.

అన్నట్టుగానే—రాత్రి సరిగా పదిగంటలకు సమరసేనుడు వెళ్ళి ఉద్యానవనంలో మహారాజును దర్శించాడు.

"ప్రభూ!—మన ధనాగారం నిండాలంటే ఇంత యోచన ఎందుకు? మన రాజ్యంలో ఒక్క పైసా ఐనా అదనంగా వసూలయే దారి లేదు. ధనసంపాదన ఎలాగ? ప్రజను సుఖపెట్టి మనరాజ్యం రామరాజ్యం అనే ఖ్యాతి నిలబెట్టుకోవటం ఎలాగ?—ఇదికద సమస్య? ఇందుకు ఒక్కటేఒక్క మార్గం కనబడుతున్నది.



"పరరాజ్యాలమీద దాడిచేసి వాళ్ళ ధనాగారాలను కొల్లగొడితే సరి! ఇది రాజధర్మం కదా మహాప్రభూ! — ఇందుకోసమేకద, సైన్యాలూ సేనాధిపతులున్నూ పోషింపబడేది?" అని విన్నవించుకున్నాడు.

"సమరసేనా!—బాగానే వుంది నువు చెప్పిన వుపాయం. అసలు మన రాజ్యమే ఒక ద్వీపమయిందే! మనకు అన్నివైపులా సముద్రాలేకద! ఈ సముద్రాలన్నీ దాటుకొని, పొరుగురాజ్యాలమీద దాడిచేయాలంటే మనకు యెంత నౌకాబలం, యెంత సైనికబలం కావలసివుంటుంది?—ఆలోచించావా?" అని ప్రశ్నించాడు రాజు.

"ఈ రెండు విషయాలూ నాకు వదలింది దేవరా!" అన్నాడు సేనాని.

"సరే. ఈ బాధ్యతఅంతా నీదే. సైన్యాన్ని సమకూర్చాలంటే నీమాట ప్రభుత్వాజ్ఞగా పాలించాలికద, ప్రజ. అందుకోసం ఇదుగో ఈ రాజముద్రిక ఉపయోగించుకో" అంటూ తన వేలి ఉంగరం తీసియిచ్చాడు రాజు.


సెలవు తీసుకొని వెళ్ళాడు సేనాని. సైనికులలో ముఖ్యులను సమావేశపరిచి, జరిగిన సంగతిఅంతా వివరిస్తూ, సంప్రదించాడు. ఇది చూచి, సైనికులు ప్రశ్నించారు.

అందుకు సేనాధిపతి "మరేమీ లేదు. సముద్రాలు దాటిపోయి, తక్కిన ద్వీపాల మీద మనం దాడిచేసేది కేవలమూ వాళ్ళ ధనాగారాలను కొల్లగొట్టుకు రావటానికేగాని, వాటిని ఆక్రమించుకొని పరిపాలించేందుకు కాదుకదా! ఈమాత్రం పనికి యిప్పుడున్న మన సైన్యాలు చాలవా? అని. మరొక విషయం యేమిటంటే—మనం సైన్యాలను తరలించుకొని ఈ కుండలినీ ద్వీపాన్ని వదలిపోగానే, అదును చూచి, ఒక వేళ ప్రజ తిరుగుబాటు చేస్తారేమో! అప్పుడు రాజునూ రాజబంధువులనూ రక్షించేది ఎవరు?" అన్నాడు. వెంటనే సభనుండి లేచి, 'ఇది గడ్డుసమస్యే' అన్నాడు ఒకడు.

'సైన్యం లేని రాజుకు భయం తప్పదు' అన్నాడు మరిఒకడు.

ఇంకొక సైనికుడు — వయసు మీరిన వాడు—"సేనానీ! కుండలినీదేవి కరుణవల్ల ఒక చక్కటి ఉపాయం తట్టింది" అన్నాడు. గిరుక్కుమని అంతా అతనికేసి చూడగా, ఆ సైనికుడు,

"చూడండి—దేశంలో విప్లవం లేవదీయాలంటే యువకులే కావాలి. కనుక, ప్రతి యువకుణ్ణీ యేదోవిధంగా ఆకర్షించి సైన్యంలో చేర్చుకుందాం" అని చెప్పి, వూరుకున్నారు.




అందరకూ ఈ ఉపాయం నచ్చింది. అప్పటికప్పుడే రాజ్యంలో-పదిహేను, నలభై ఏళ్ల మధ్య వయసువాళ్ళంతా సైన్యంలో చేరవలసిందని ప్రకటిస్తూ, అందుకు అవసరమైన ఆజ్ఞాపత్రాలు రాజ ముద్రికతో సహా తయారుచేసి వుంచారు.

మరునాటినుంచి; సైనికులు పత్రాలు చేతపుచ్చుకొని పోయి, ప్రతి గ్రామంలోనూ వయసులో వున్న ప్రతిపురుషుణ్ణీ సైన్యంలో చేర్పసాగారు. ఐతే, చేరటానికి కొంతమంది ఇష్టపడలేదు. 'కావాలంటే మీరు కోరుకొన్న పన్నులు ఇచ్చుకొంటాంగాని, బలవంతాన మమ్మలిని సైన్యంలో చేర్చవద్దు. మమ్మల్ని తలిదండ్రులనుండీ, ఆలుబిడ్డలనుండీ, ఎడబాపులు కానీయవద్దు..." అంటూ ఏమేమో గోలచేయసాగారు. కాని వినేనాథుడెవరు?

ఇష్టపడి సైన్యంలో చేరినవాళ్లు మర్యాదగా వెంటవెళ్ళారు. లేనివాళ్లను కాళ్ళూ చేతులూ కట్టి, డోలీలలో పడవేసి మోసుకపోయారు సైనికులు.

ఈ స్థితిలో ప్రజలంతా రాజువద్దకు పోయి మొరపెట్టుకొన్నారు.

ఇందుకు రాజు—'నా ఘనకీర్తిని వేనోళ్ల చాటురూ మీలో కొందరు నాపైన కథలు రాసి కావ్యాలు అల్లివున్నారు కదా! ఇప్పుడు

మళ్ళీ పన్నులు పెంచినట్టయితే, తిరుగా మీరు నాపైన తిట్టుకవిత్వాలు కట్టటానికి అవకాశమున్నది. కనుక, చేయగలిగింది ఏమీ లేదు. ఆడితప్పటం మాకు వంశాచారంకాదు" అని చెప్పాడు.

సైన్యసమీకరణ పూర్తిఅయింది. ఒక శుభముహూర్తాన కుండలినీ సైన్యాలు ఓడలెక్కినయి.

తీరా, 'బయలుదేరవచ్చు!' అని మహారాజు అనుజ్ఞ ఇచ్చేసరికి, ఆకాశం మీద దక్షిణదిశను, మహావేగంతో కదులుతూ ప్రకాశిస్తూవున్న ఒక తోకచుక్కకంటబడింది. అదిచూచి అందరూ భయంతో కంపించి పోయారు. 'అశుభం! అశుభం!!' అన్న మాటలు ప్రతిఒక్కరి నోటనుండీ అప్రయత్నంగా వెలువడినై.


'విపరీతంగా వుంది. మరొకసుముహూర్తం ఏర్పరుద్దాం. ఇప్పటికి ప్రయాణం నిలుపు చేయించండి!' అన్నాడు ఆస్థాన దైవజ్ఞుడు. ఈ సలహాకు సేనాధిపతి మండిపడ్డాడు.

"ఎవరైనా నవ్విపోతారు, ఇటువంటి అర్థంలేని పిచ్చినమ్మకాలు వింటే!– మన సైనికులా చండప్రచండులు! వారిని ఏమి చేయగలదు తోకచుక్క!" అని వ్యధికరించాడు.

చాలాదూరం చెప్పి చూచాడు దైవజ్ఞుడు. లాభం లేకపోయింది. చిత్రసేన మహారాజు కూడా సేనానివైపే మొగ్గ చూపాడు. చేసేదిలేక ఆస్థానదైవజ్ఞుడు పక్కకు తప్పుకొన్నాడు. సైనికులలో బయలుదేరిన కలకలం ఎవరూ గుర్తించలేదు. చివరకు సేనాధిపతి ఆజ్ఞప్రకారం తెరచాపలు ఎత్తారు. దక్షిణదిశను వెలిసిన తోకచుక్క వైపు చూచుకొంటూ, ఓడలన్నీ ఆ దిక్కుకే గబగబ సాగిపోయినై.

—[ ఇంకా వుంది ]






## 2

[కుండలినీద్వీపరాజైన చిత్రసేనుడు కీర్తికాంక్షతో ప్రజలపై పన్నులు సగానికిసగం తగ్గించివేశాడు. ఫలితంగా ధనాగారం వట్టిపోయింది. సేనాని పలహాపైన ధనం దోచుకువచ్చేందుకు కుండలిని సైన్యాలు ఓడలలో బయలుదేరినై. అదే సమయంలో దక్షిణదిశను తోకచుక్క కనబడింది.]

ఏమయితేనేమి, కుండలినీ రాజ్య సైనికులతో బయలుదేరిన ఓడలు తీరం వదిలి సముద్రంలోపలకు పోసాగినై. అప్పుడు సముద్రం ప్రశాంతంగానూ, గాలి ఎంతో అనుకూలంగానూ ఉన్నయి.

సైనికులందరూ ఆనందంగానే వున్నారు. కాని, సేనాధిపతియైన సమరసేనుడుమాత్రం తన ఓడపైన ఒక మూలగా ఆసనం ఏర్పరుచుకొని, దక్షిణ దిక్కున మెరిసే ఆ తోకచుక్కవైపే చూడసాగాడు. ఇంతకుముందు ఆస్థానదైవజ్ఞుడు 'బయలుదేరవద్దు. అశుభం! అశుభం!!' అని స్పష్టంగా చెబితే, ఆ మాట చెవికెక్కలేదు. ఇప్పుడు తోకచుక్కను చూడగా చూడగా సమరసేనుడికి తీరని భయం పట్టుకొన్నది.

కలవరపాటుతో అలా చూస్తూన్నంతలో అల్లంత ఎత్తున కారుమేఘాలు గబగబ వచ్చి, తోకచుక్కను కమ్మివేసినై. కటిక చీకటి అలముకొన్నది. సముద్రుడు గర్జింపసాగాడు. సైనికులు భయకంపితులయ్యారు.

సమరసేనుడు కూర్చుని అలా చూస్తూనే వున్నాడు. అంతలో నౌకాధిపతి వచ్చి—



"మహాసేనానీ! మన సైనికులలో కోలాహలం బయలుదేరింది. ఒక్కొక్కరూ తిరుగుబాటు స్వభావాన్ని కనబరుస్తున్నారు" అని చెప్పాడు.

కూర్చున్న చోటునుంచి లేచాడు సమరసేనుడు. ఒకమారు ఆకాశంకేసి, ఒకమారు సముద్రంకేసీ చూచాడు.

'కుండలినీదేవి కరుణిస్తే, త్వరలోనే అంతా అనుకూలమవుతుంది. సమరసేనుడి నాయకత్వంకింద సైనికులకు, ఎన్నటికీ చెరుపు లేదని చెప్పండి!' అన్నాడు.

నౌకాధిపతి పోయి, సమరసేనుడు చెప్పిన మాటలను అందరకూ వినికిడి చేశాడు. అందరూ కూడా—తమ సేనానాయకునిమీదా, ఇలువేల్పు ఐనటువంటి కుండలినీదేవిపైనా పరిపూర్ణ నమ్మకమున్నదన్నట్టుగా తలలు వూపారు.

ఐతే, కొత్తమార్పు ఏమీ లేదు. ఇంకా సముద్రం అల్లకల్లోలంగానేవుంది. ఆకాశమంతా కారుమేఘాలతో నిండింది. భయంకరమైన పెనుగాలికూడా ప్రారంభమైంది.


ఇది చూచి సైనికులకు గుండెనిబ్బరం సడలింది. ప్రతి ఒక్కరికీ వళ్ళు కంపించసాగింది. ఆ వాయువేగానికి ఓడలు, ఒక దారీతెన్నూ లేకండా, తలకొక దిశకూ చెదరిపోయినై. ఈ స్థితిలో ఎవడికి వాడు, ఏ ఆసరా దొరికితే అది చేతపట్టుకొని, ప్రాణరక్షణకోసం పెనగులాడజొచ్చాడు.

రాత్రి అవుతున్నకొద్దీ గాలి తీవ్రతరమవుతూవుంది. నావికుల స్వాధీనం తప్పిన ఆ ఓడలు ఒకదానికొకటి ఢీకొని ఛిన్నాభిన్నం కాసాగినై. తక్కిన ఓడలన్నీ దెబ్బతిన్నాయి కాని, సమరసేనుడు ఎక్కివున్న ఓడమట్టుకు పటిష్ఠంగా నిర్మింపబడిందికావటంచేత, అలలమీద తేలిపోతూనేవుందికాని, శిథిలంకాలేదు.

సూర్యోదయం ఐతేగాని, ఎన్ని ఓడలు మునిగినవో, ఎంతమంది చచ్చిపోయారో

లెక్క దొరకదు. సమరసేనుడుమాత్రం ఏం చెయ్యగలడు? తన ఓడలో ఉండే కుండలినీదేవి విగ్రహంముందు మోకరిల్లి, భక్తితో ప్రార్థిస్తున్నాడు.

చిత్రమేమిటో కాని, ఆకస్మికంగా బయలుదేరిన గాలీ మబ్బులూ, వచ్చినవి వచ్చినట్టుగానే మాయమైపోయినై. దేవి విగ్రహంముందు తపోనిష్ఠలో కూర్చొనివున్న సమరసేనుణ్ణి సైనికులు ఆత్రంతో పిలిచారు: 'అలజడి తగ్గింది. సూర్యోదయమయింది. ఒక్కసారి వచ్చి దర్శనమిప్పించండి' అంటూ.




బ్రహ్మాండమైన బరువు దించుకున్నట్టయింది సమరసేనుడికి. ఒక్కసారి పెద్దగా నిట్టూర్చి, పైకి వచ్చాడు. తన ఓడలలో సగానికి సగం సముద్రంలో కలిసిపోయినై, మిగినవయినా ఒకచోట లేవు. రెండుమూడు మైళ్ళ కైవారంలో నడిసముద్రమందు అవన్నీ తేలి ఆడుతున్నయి.

చచ్చినవాళ్లు చావగా, మునిగిన ఓడలు మునిగిపోగా, ఉన్నవాటినైనా ఒక్కచోట చేర్చటమే కర్తవ్యమని నిశ్చయించాడు. వెంటనే తన ఓడకు లంగరు వేయించాడు. ఓడలమీద మనుషులను పంపి, దూరాన వుండే అందరనూ రప్పించాడు.

కబురు వెళ్ళి వెళ్ళటంతోనే చెదరిపోయిన ఓడలన్నీ ఒక్క చిటికసేపటిలో వచ్చేసి, సేనానివుండే పెద్దఓడ చుట్టూ చేరుకొన్నయి. సైనికులందరూ ఓడలపైకి వచ్చి నిలబడి, సేనానికి తలలువంచారు.

ఆ నిలబడినవారిలో ప్రతిఒక్కడూ, రాత్రి తుపానుదెబ్బకు నానా యాతనలూ పడి, అదృష్టవశాన బతికి బయటపడ్డవాడే! ఇంకా యేమి కీడు మూడబోతుందోనని గుండెబెదురుతో భయపడుతూనేవున్నారు.

పరిస్థితి అంతా ఇట్టే పసికట్టాడు సమరసేనుడు. రాత్రికలిగిన ఉదుటుకు, సముద్రమంటే సైనికులందరూ హడలిపోతున్నారు.




అందుచేత, ఇంకా సముద్రంమీదనే కాలం గడపడమనేది కానిపని. చూడగా తామిప్పుడు ఎక్కడవున్నదీ, జాడ తెలియటమే లేదు. వెంటనే ఒకరిని తెరచాపకొయ్య శిఖరానికంటా ఎక్కి చూడమన్నాడు సమరసేనుడు.

సేనాని ఆజ్ఞప్రకారం ఒకడు శిఖరం ఎక్కాడు. తక్కిన అందరి దృష్టీ అతని మీదనే లగ్నమైవుంది. ఆ యెక్కినవాడు కొంతసేపు చుట్టూ పరికించి, "దగ్గరలో ఎక్కడా భూప్రదేశం కనపడటంలేదు. కాని...తూర్పుదిక్కున చాలా దూరంలో పక్షులు ఎగురుతున్నట్టుగా నా దృష్టికి గోచరిస్తున్నది," అన్నాడు.

ఈ మాట చెవినిపడగానే సమరసేనుడు "జై—కుండలినీ మహాదేవికీ జై" అంటూ ఉత్సాహంతో కేకలుపెట్టాడు. అతనితోపాటు సైనికులందరూ 'కుండలినీమహాదేవికీ జై!' అని పెద్దగా విజయధ్వానాలు చేశారు.

పక్షులెగురుతున్నవని వినగానే, రక్షణ దొరికినట్టే సంతోషించాడు సమరసేనుడు. సమరసేనుడితోపాటు సైనికులు కూడా సంతోషించారు.

సేనాని ఆజ్ఞప్రకారం ఓడలన్నీ ఆ పక్షులు ఎగురుతున్న దిక్కుకే పోసాగినై.



తెరచాప కొయ్యపైకి ఎక్కిన సైనికుడు అక్కడనే వుండి, ఓడలన్నిటికి దారి చూపుతున్నాడు. ఎంతకూ భూమి ఆనవాలు దొరకనందున సైనికులలో మళ్ళీ నిరాశ అలముకొన్నది. సూర్యాస్తమయం కాబోతున్నదనే సరికి, 'అయ్యో!—ఇంకాస్సేపటిలో చీకటి పడిపోతుందే!—ఈ మహాసాగరంలో నడుమధ్యని దారి తెన్నూ కానక తపించాలి కదా!—' అని భీతి చెందసాగారు.

అటువంటి సమయంలో శిఖరంమీద ఉన్న సైనికుడు "అదిగో!—అదిగో!—భూప్రదేశం! దగ్గరలోనే వుంది," అని ఎలుగెత్తి అరిచాడు. అందరూ సంతోషించారు.

ఓడలన్నీ అదే దిశకు సాగిపోతున్నవి. అంతలోనే సూర్యాస్తమయమయింది. అయ్యేసరికే ఓడలన్నీ ఒకానొక భూప్రదేశానికి చేరుకున్నాయి. అది ఒక ద్వీపమని తెలిసింది. భూమిమీద అడుగుపెట్టాలని ప్రతిసైనికుడి మనసూ ఉరకలు వేస్తున్నది. కాని, 'ఒకళ్ళూ ఓడ దిగవద్దు' అని ఆజ్ఞ ఇచ్చాడు సమరసేనుడు.

ఇప్పుడు వారు చేరుకున్నది ఒక ద్వీపం. భయంకరమైన ఒక మహాద్వీపం. సముద్రం లోపలికంటా ఒరుసుకువచ్చిన పర్వతపంక్తులు. వాటిపైన ఇచ్చవచ్చినట్టు పెరిగిన మహావృక్షాలు. పైగా—వింతవింతల వన్యమృగాలు—ఇటువంటివాటితో కూడుకొన్న ఆ కొత్తప్రదేశం ఎలాటిదో తెలుసుకోకుండా సైనికులు దిగటం ప్రమాదం కదా!—అందుకనే ఒక్కళ్ళనూ ఓడ దిగవద్దన్నాడు సమరసేనుడు.

ఐతే, తన సైన్యాన్ని రెండుపాయలుగా విడదీశాడు. అందులో కొంతమందిని చిన్న చిన్న పడవలలో ఆ ద్వీపంయొక్క తీరానికి పంపడం మంచిదని తలిచాడు. వీరు పోయి, మంచిచెడ్డలు తెలుసుకువచ్చాక, తక్కిన వాళ్ళు పోయి రావచ్చునని అతని వుద్దేశం. ఐతే—ముందుగా ఆ ప్రదేశానికి పోయి



రావటానికి సమర్థత గల ఆ సైనికు లెవరు? అటువంటి కొత్త ప్రదేశానికి పోయి సంగతి సందర్భాలు తెలుసుకోవాలంటే ధైర్యమూ సాహసమూ మాత్రమే చాలదు; సమయోచితమైన యోచనా, యుక్తీ కావాలి.

ఇంతగా ఆలోచించిన తరవాత, స్వయంగా తను వెళ్ళిరావటమే అన్నివిధాలా శ్రేయస్కరమని తోచింది సమరసేనుడికి. ఎంతటివాడికైనా ఒంటరిగా వెళ్ళటం ప్రమాదకరమే. అందుకని, ఆరితేరి అనుభవం గడించిన ఆరుగురు సైనికులను ఎంచి, వెంటతీసుకొని ఆ కొత్తద్వీపానికి బయలుదేరాడు. సమరసేనుడూ, ఆరుగురు యోధులూ చిన్న పడవలెక్కి, కొంచెం సేపటిలో తీరం చేరుకొన్నారు.

తీరప్రాంతమంతా నిర్జనంగా వుంది. ఎక్కడా మానవుడు మసిలిన అలికిడే లేదు. అంతమాత్రాన సమరసేనుడు ఏమరిపాటు చెందలేదు. ఆయుధహస్తుడై సిద్ధంగానే వున్నాడు. 'ఏ చెట్టు చాటునించో, హఠాత్తుగా ఒక బాణం రావచ్చుకదా...' అని అనుమానం కలిగింది సమరసేనుడికి.


అనుమానిస్తూ ముందుకు కదులుతూ వున్న ఆతనికి భయంకర గర్జన వినబడింది!

'సేనానీ! ఈ గర్జన సామాన్యమయింది కాదు. ఇటువంటి వికృతమైన, భీతావహమయిన గర్జన మా జీవితంలోనే విని ఉండలేదు' అన్నారు యోధు లారుగురూ, కంపించిపోతూ.

ఈ మాట నిజమని తోచింది సేనానికి.

ముందుకు నడిచాడు సమరసేనుడు. ఆయుధహస్తులైన యోధులారుగురూ అతని వెంబడే నడవసాగారు. కాస్సేపటిలో చెట్ల మధ్యకు చేరుకొన్నారు. వారిముందున్న పెద్ద కొలనుకేసి చూచారు.

అక్కడిదృశ్యానికి వారు నిశ్చేష్టులయారు. ఏమి ?—అనుకొన్నట్టుగానే, అది ఒక భయంకొలిపే వింతజంతువుల పోరాటం!—


CHITRA

విచిత్ర రూపాలతో మరి ఎన్నెన్నో మృగాలు చుట్టుపక్కలనుండి ఆ పోరాటాన్ని తిలకిస్తున్నాయి. దరిదాపుల చెట్ల కొమ్మలపైన మనుష్యాకారంలో వుండే, పెద్ద పెద్ద నరవానరాలు రణరంగాన్ని చూస్తూ, వాటిలో అవి మాటాడుకొంటున్నయి. శిలలతో తయారైన ఆయుధాలను అవి చేతులలో ధరించివున్నాయి.


సమరసేనుడు, తోడి యోధులతో ఇలా అన్నాడు. 'నిజంగా ఇవన్నీ వింతజంతువులే. ఆ చెట్లపైనున్నది నరులూ కాదు, వానరాలూ కాదు. రాతియుగంలో నివసించిన మానవులను మనం చూస్తున్నామన్నమాట. ఇప్పుడి జంతువులు ఎన్నో లక్షల సంవత్సరాలకు పూర్వపువి.' ఏమి చెప్పటానికీ సైనికులకు తోచలేదు. ఇంతటి భయంకరమైన ద్వీపంనుండి దోచుకుపోదామంటే వాళ్ళకు ధనరాసులేం దొరుకుతై?

సరిగా ఇదే ఆలోచన, సమరసేనుడికి కలిగింది. కుండలినీరాజ్యపు ధనాగారాన్ని నింపటానికిగాను పరరాజ్యాలు కొల్లగొట్టే వుద్దేశంతో బయలుదేరాడాయె తను. అందుకు బదులు ఇప్పుడీ భయంకరమైన ద్వీపం తగిలింది. ఏమిటి కర్తవ్యం?

ఇలా అతని ఆలోచన సాగిపోతూ వుండగా ఆ వింత జంతువుల పోరాటం భయంకరం కాజొచ్చింది. చుట్టూ వున్న చెట్ల చాటునుంచి ఏనుగులు ఘీంకరిస్తూ దూరంగా పారిపోసాగినై. వాట్లలోనుంచి ఒక ఐరావతంలాంటి ఏనుగు వేరుపడి సమరసేనుడు దాగివున్న వైపుకే గబగబ పరుగెత్తి రాజొచ్చింది.

సైనికులను హెచ్చరించి సమరసేనుడు చెట్టుపైకి ఎగబాకాడు. అదే సమయంలో గర్జిస్తూ రెండు సింహాలు ఆ ఏనుగుమీదికి ఎగసివచ్చినై.

—[ఇంకా వుంది]






## 3

[కుండలినీ సైన్యాలతోవున్న ఓడలు తుపానుగాలిలో చిక్కి, చెల్లాచెదురయినై. సమరసేనుడు కొంతమంది సైనికులతో ఒక భయంకర ద్వీపం చేరుకొన్నాడు. అక్కడ వింతజంతువుల పోరాటంచూచి హడలిపోయి అంతా చెట్లెక్కారు—తరువాత]

సమరసేనుడూ, అతని సైనికులూ చెట్ల కొమ్మలలో దాగి, ఆ వింతజంతువుల భయంకర పోరాటాన్ని తిలకిస్తూవున్నారు. ఆ సింహాల పాలబడిన ఏనుగు వాటి బారి నుండి యెలాగ తప్పుకొనిపోవటమా అని ఆరాటపడుతున్నది.

అప్పుడు ఒక సైనికుడు ముందుకు వచ్చి "సేనానీ!—తీరని చిక్కులో పడ్డాము. భయం కొలిపే ఈ ద్వీపాన్నుంచి మనం దోచుకుపోగలిగిన ధనరాసులేమున్నయి?" అని అడిగాడు సమరసేనుణ్ణి.

మరొక సైనికుడు అందిపుచ్చుకొని, 'ప్రాణాలతో ఇక్కడినుండి బయటపడితే అదే పదివేలు' అని జవాబిచ్చాడు.

ఆలోచనలో పడ్డాడు సమరసేనుడు. 'లోకమంతటా ప్రజలు నాగరికులై, చక్కటి జీవితాలు గడుపుతున్న ఈనాడుకూడా, ఈ ద్వీపవాసులింకా రాతియుగంనాటి దశలోనే వున్నారని స్పష్టపడుతున్నది. ఇక్కడ ఒక రాజు అనీ, పరిపాలన అనీ ఉన్నాయో, లేనే లేవే! అటువంటప్పుడు యిక్కడ ధనం లభించేదేమిటి?' అని అనుకొన్నాడు.




ఇలా సమరసేనుడు ఆలోచించేటంతలోనే ఆ అరణ్యమంతా ప్రతిధ్వనించేటటువంటి ఒక కంఠస్వరం వినబడింది;

"హేయ్, కాలభుజంగా! కంకాళా! రండి, రండి! ఆ చతుర్నేత్రుణ్ణి వెతికిపట్టి హతమార్చండి!!" అనే ప్రళయ భీకర నాదం దశదిశలా వ్యాపించింది.

ఇది విని సమరసేనుడి గుండె ఆగినంత పని అయింది. చెట్టుకొమ్మలలో దాగివున్న అతను గజగజలాడిపోయాడు. ఆ భీకర నాదం వింటూనే, దిగువ కొలను సమీపంలో వున్న జంతువులూ, చెట్లపైనున్న నర వానరాలూ చెల్లాచెదరై పారిపోయినై.

అంతలో ఆ కొలను గట్టున—

తాటిచెట్టంత పొడవాటి వ్యక్తి; అతనిది ఒంటికంటి చూపు! అతని రెండు కాళ్ళను చుట్టేసి, కోరలు చాపి, ముందుకు ఉరుకుతున్న కాలసర్పం. వెనకవైపున వాని తలకు మరింత ఎత్తులో కదులాడుతూవున్న ఒక మనిషిపుర్రె! ఆ పొడవాటి ఒంటికంటి వాడు కొలనుగట్టునే నిలబడి, చుట్టూ పరికించి తలపంకిస్తూ—

"హాఁ!—మంత్రాలదీవి - జల్లేళ్ళదిబ్బ - పల్లెపకొండ - కొండకొసని బండ! ఆ బండ మీద నించుని చూస్తే ఏమిటి కనపడుతుంది

కంకాళా?" అని హుంకరించాడు. అందుకు జవాబుగా, ఆ మనిషిపుర్రె వికటాట్టహాసంతో నవ్వుతూ—

"నట్టనడిసముద్రాన నాట్యమాడే నావ. నావలోపల ధనరాసులు. నావకు బయట కాపలా కాసే నాగకన్య. నాగకన్యను హతమారిస్తే సరి—నావనిండుగా వుండే ఆ ధనరాసులన్నీ మనవే!" అని చెప్పింది.

"అవును! ఇంత సాధించగలిగితే ధనమంతా మనదే. కాని, చూడూ,–ఆ చతుర్నేత్రుడు...హేఁ!!" అంటూ మళ్లీ హుంకరించాడు ఒంటికంటివాడు.





చెట్టుపైనే కూర్చుని, ఈ సంభాషణ అంతా వింటున్న సమరసేనుడికి ఒకవంక భయమూ, మరొకవంక ఆశ్చర్యమూ ఒక్కసారిగా కలిగినై. ఇప్పుడు తను ఉన్నది మంత్రాలదీవి అనీ, ఆ దీవిలో ఒకానొక కొండకొసని గల బండపైన నిలబడి చూస్తే సముద్రంలో ధనరాసులతో నిండివున్న నావ కనబడుతుందనీ అతను గ్రహించాడు.

ఐతే—ఆ చతుర్నేత్రు డెవడు? భయంకరాకారుడైన ఈ ఒంటికంటి మంత్రవేదికీ అతనికీ మధ్యని శత్రుత్వం ఎందుకు వచ్చింది? ఆ శత్రుత్వానికి నావలోని ధనరాసులే కారణమా, మరేదైనానా?

సమరసేనుడు ఇలా ఆలోచిస్తూవున్నంతలో, భయంకరాకారుడైన ఆ మంత్రవేది కొలనుగట్టు దిగి అడవిలోకి వెళ్లిపోయాడు. అతని వెంబడే కాలసర్పమూ, ఆ వెనకనే మనిషిపుర్రెకూడా వెళ్ళినై.

ఇంతవరకూ గజగజ వణికిపోతూవున్న సైనికులు ఆ ఏకాకి వెళ్లిపోగానే కాస్త తెప్పరిల్లారు. అందరూ సమరసేనుడికేసి చూచారు. అందరి ముఖాలలోనూ భయచిహ్నాలు కనిపిస్తూనే వున్నాయి.

సైనికులలో ఒకడు తడబడుతూ, 'ఈ ఏకాకి గొప్ప మంత్రవేత్తలా ఉన్నాడు. వానిని వెంబడించే కాలసర్పమూ, మనిషి



పుర్రె ఎంతటి ధైర్యశాలికైనా భీతి కలిగించే తీరుతై. ఇటువంటి ద్వీపాన్ని ఎంత త్వరగా వదిలితే అంత మేలు' అన్నాడు.

ఇందుకు సమరసేనుడు ఏమని సమాధానం చెబుతాడోనని సైనికులందరూ చెవులు రిక్కించి నిశ్శబ్దంగా కూర్చున్నారు. కాని, సమరసేనుడు కాస్సేపు ఆగి—

" ఇంతటి భయంకర దీవిలోనూ మనకు ధనం లభించే అవకాశాలు కనబడుతున్నాయి. పోతే, కావలసిందల్లా కష్టాలను సహించే శక్తీ, గుండెనిబ్బరమూ" అన్నాడు.

ఇలా అంటూనే, సమరసేనుడు చెట్టు మీదినించి కిందికి దిగాడు. సైనికులూ దిగి వచ్చారు. 'ఇక, ముందుకథ యేమిటి?' అనే ప్రశ్న ప్రతి సైనికుణ్ణీ కలవరపెట్టింది. నిర్ణయం సమరసేనుడిదే కనుక, అందరూ అతనివైపే చూడసాగారు.

"విన్నారుకదా, '...పల్లేరుకొండ, కొండ కొనని బండ...' అని ఆ ఒంటికంటి మాంత్రికుడు చెప్పిన మాటలు? ఆ కొండ, కొండ కొనని బండ ఎక్కడ వున్నదీ కనిపెట్ట గలిగితే, మనం వచ్చిన పని చాలవరకు నెరవేరినట్టే!" అన్నాడు సమరసేనుడు.

ఈ మాటకు సైనికులలో ఒకడు సందేహిస్తూ "ఆ మాంత్రిక ఏకాక్షి చెప్పిన మాటలలో వాస్తవం ఉన్నదంటారా?" అన్నాడు.

ఇందుకు వెంటనే సమరసేనుడు ఇలా బదులుచెప్పాడు.

"మాంత్రికుడు అడిగిన ప్రశ్నలోనూ, బదులుగా ఆ మనిషిపుర్రె చెప్పిన జవాబులోనూ అబద్ధం ఏమీలేదు. పోతే—ధనంతో నిండిన నావను ఒకానొక నాగకన్య రక్షిస్తున్నదని వాళ్ళ సంభాషణబట్టి తెలుస్తుంది. అదిగాక—'చతుర్నేత్రు' డనే మరిఒక మంత్రవేత్త వాళ్ళకు బద్ధశత్రువై ఉన్నట్టు కూడా మనం నమ్మవచ్చు. ఐతే, ఇన్ని ప్రతిబంధకాలనూ దాటుకొనిపోయి, ధనరాసులతో నిండివున్న ఆ నావను మనం

పట్టటం ఎలాగా అనేదే ఇప్పుడు మనకు పట్టుకొన్న సమస్య!"


ఈ సమస్యకు జవాబివ్వటానికి సైనికులలో ఒక్కడికి గుండెధైర్యం చాలింది కాదు. ప్రయాణానికి బయల్దేరినప్పుడు బెదరిపోయిన సైనికులందరకూ, ఇప్పుడు సమరసేనుడు చెప్పిన మాటలు మరింత బెదరు పుట్టించినై.

ఉన్నచోటునించి ఒక్కమారు చుట్టూతా కలయజూచాడు సమరసేనుడు. మెల్లకు వతే, జాగ్రత్తగా ముందుకు నడవసాగాడు. అతనిని అనుసరించారు సైనికులు.

అలా వృక్షాలు దాటుకొని కొంచెందూరం పోయేసరికి, గూబలు బద్దలుగొట్టేటటువంటి ఒక అరుపు చెవినిపడింది.

ఇదేమిటా అని సమరసేనుడు అనుకొంటూవుండగానే, బ్రహ్మాండమైన ఒక కారు నల్లటి గుడ్లగూబ వారి తలపైనుంచే ఎగిరిపోసాగింది. ఆ గూబ మానవస్వరంలో కఠోరంగా—

"చతుర్నేత్రా! చతుర్నేత్రా!!—నరమానవులు—నరాధములు! నరమానవులు—నరాధములు!! బహుపరాక్!!" అని అదేపనిగా హెచ్చరిస్తూ, యెగుస్తున్నది. ఆ భీకరరూపంలో వున్న గూబనూ,






మానవస్వరంలో పలికే దాని హెచ్చరికనూ విని, సమరసేనుడూ సైనికులూ నివ్వెర పోయారు. 'పక్షులచేత మానవభాష మాటాడింపగల మాంత్రికుడు మరి ఏ కార్యం మటుకు సాధించలేడు?'—ఇలా అనిపించింది వాళ్ళందరికీ.

దీనికే నివ్వెరపాటు చెందిన మన సమరసేనుడికీ సైనికులకూ దిగ్భ్రమ కొలిపే మరి వక వింతవృశ్యం కంటబడింది—అది ఒక వానరం. కాదు, సగభాగం నరుని ఆకృతి గల ఒక 'నరవానరం.' అది గభీమని చెట్టుపైనుండి దిగింది. అంతవరకూ ఆకాశాన ఎగురుతూ హెచ్చరికలు పలుకుతున్న నల్లగూబ ఆ నరవానరం బుజంమీద వాలి, దాని చెవిలో ఏదో రహస్యం చెప్పింది!


ఆ నరవానరం ఒక్కమారు వెనక్కు తిరిగింది. సమరసేనుణ్ణీ సైనికులనూ చూచింది. చెట్లకు వేలాడే తీగల ఆధారంతో, ఒక చెట్టుపైనుంచి మరొక చెట్టుపైకి దూకుతూ, క్షణంలో అదృశ్యమయింది!

"సేనానీ!—ఇక మనం వెనుదిరగటమే మంచిది. ఈ మంత్రాలదీవిలో మనం సాధించగలిగింది యేమీ లేదు. పక్షులనూ జంతువులనూ వేగులుగా ఉపయోగించుకో గలిగిన మాంత్రికుల శక్తిముందు మన కత్తులూ బాణాలు ఏం వుపయోగిస్తాయి? చాలు. వెనక్కు తిరగండి!" అని ఒక సైనికుడు సమరసేనుణ్ణి వేడుకొన్నాడు.

వినీ విననట్టు ఊరకొన్నాడు సమరసేనుడు. ఎదట, చెట్టుమీది ఆ గుడ్లగూబ, చింతనిప్పులవంటి దాని గుడ్లు అటూ ఇటూ తిప్పుతూ, అంతా పరికిస్తూనేవుంది.

ఉన్నట్టేవుండి, ఏదో హఠాత్తుగా ఉపాయం తట్టినవాడిలాగా సమరసేనుడు, పక్కనున్న సైనికునివద్ద విల్లంబు అందుకొని, బాణం ఎక్కుపెట్టాడు.

వెంటనే ఒక సైనికుడు "సేనానీ!—ఆ మంత్రశక్తి గల పక్షిపైన మన బాణాలు



పనిచెయ్యవు. పైగా మన మీద మాంత్రికుడికి కోపం వస్తుంది. ఆలోచించండి!" అని తన అభిప్రాయం చెప్పాడు.

సమరసేనుడు చిరునవ్వు నవ్వుతూ— "అదీ తేలుద్దాం. ఇంత దూరం వచ్చిన తరువాత ఆగటమేమిటి? మన బాణం సత్తువ ఎంతటిదో పరీక్షిద్దాం...!" అన్నాడు.

ఇలా అంటూనే సమరసేనుడు గురి చూచి బాణాన్ని ఆ చెట్టుమీది గుడ్లగూబ మీదికి వదిలాడు. బాణం రివ్వుమని పోయి సూటిగా గూబను తాకింది. అయితే— దెబ్బతో అది గిలగిల తన్నుకు కిందపడు తుందని అనుకొంటూవున్న సమరసేనుడికి మాత్రం చెప్పలేని ఆశాభంగం కలిగింది.

రెక్కలో గుచ్చుకొన్న బాణాన్ని తన ముక్కుతో అవలీలగా లాగిపారేసింది ఆ గూబ. పారవేసి ఇలా పలికింది కఠోరంగా:

"నరాధములు! — మీరా నన్ను చంపటం? ఘనమైన మాంత్రికుణ్ణి అను కొని గర్వపడే ఆ ఏకాకికే నేను దుర్లభమై పోయాను. అటువంటిది మీరెంత? మీ బాణాలెంత?— ఉండండి, ఉండండి. నిదా నించండి కొంచెం! మా చతుర్నేత్రుడు వచ్చి మీ నెత్తురు కళ్ళజూచే శుభసమయం దగ్గర పడుతున్నది..." అంటూ, మళ్లీ మానవభాషలో ఉగ్రాన్ని వెలిబుచ్చింది.

అప్పుడు ఈ గూబమాటలతో సమరసేనుడికి —తనూ, తన సైనికులూ ఎంతటి ప్రమాద పరిస్థితులలో చిక్కుకొన్నదీ అర్థమైంది. తక్షణమే సైనికులను హెచ్చరించాడు. హెచ్చరించి తను పరుగుచ్చుకొన్నాడు.

కాని, పైన చెట్లమీదనుంచి అంచెలపై ఎగురుతూ, ఆ భయంకరమైన నల్ల గుడ్ల గూబ అతనిని వెంబడిస్తూనేవుంది. ఎలా అయినా సముద్రతీరం చేరుకొని, పడవ ఎక్కి పారిపోవాలని సమరసేనుని ఆరాటం. ఆ ఆరాటంలో, దోవతప్పి అల్లాడసాగాడు. బాగా ఒక గంటసేపు అలా దారీ తెన్నూ

తెలియకుండా కొట్టుమిట్టాడిన తరువాత గాని, తను దారి తప్పినట్టు సమరసేనుడికి అర్థంకానేలేదు. అలా అని, ఒకచోట స్థిరంగా నించుని ముందుసంగతి ఆలోచించుదామా అంటే, అందుకూ వీలులేదు. గడ్లగూబ ఒకవంక వానినీ సైనికులనూ వెన్నాడుతూనేవుంది.

ఆలోచనకు ఏమీతోచక, సమరసేనుడు అక్కడ ఒక చెట్టుకు ఆనుకొని నిలబడి పోయాడు. తలలువాల్చిన సైనికులు చుట్టూ మూగారు. వారిలో ఒక్కళ్లకూ ఏమీ పాలుపోలేదు.

"మనం దారితప్పాం. అందుకు తోడు, ఈ దీవిలో ఉండే ఒకానొక మాంత్రికునికి కూడా విరోధులమయ్యాం. ఇప్పుడు చేయగలిగింది ఒక్కటే. మన కుండలినీదేవిని ప్రార్థించటం!" అన్నాడు సమరసేనుడు.

"ముందుగా ఆ నల్లగూబ సంగతి చూడండి. దాని దృష్టినుంచి తప్పుకొని పోయామంటే మనకు అన్నివిధాలా క్షేమమే!" అన్నాడు ఒక సైనికుడు.

సరిగా అదే సమయానికి మళ్ళీ, అరణ్యమంతా ప్రతిధ్వనించేటటువంటి ఒక కంఠస్వరం వినవచ్చింది. ఈ స్వరం మాంత్రికుడైన ఏకాకిది—

"కాలభుజంగా! కంకాళా!!..."

ఈ పిలుపు వినబడటమే తడవుగా, చతుర్నేత్రుని 'వేగు' అయిన నల్లగూబ చెట్టుపైనుంచి అరుస్తూ ఎగిరిపోయింది. 'గూబ పీడ పోయింది. బయటపడ్డాం...' అనుకొని సంతోషిస్తూవున్న సమరసేనుణ్ణీ, సైనికులనూ మరొకవైపునుంచి ఏకాకి కంఠస్వరం భయకంపితులను చేసింది. క్షణమైనా ఆగక, ఆ చెట్లమాటునుండి వారు కాలికొద్దీ పరుగెత్తసాగారు.

—(ఇంకా వుంది)







## 4

[కుండలిని రాజ్య సైన్యాలు, ధనాగారం నింపేటందుకు పరరాజ్యాలమీదికి దాడి బయలుదేరినై. అశుభసూచకంగా తోకచుక్క కనబడింది. తుపానులోచిక్కి ఓడలు మునిగిపోయినై. కొందరు సైనికులు ఒక ద్వీపం చేరారు. అక్కడ క్రూరమృగాల నుంచీ, ఏకాక్షిమంత్రవేదినుంచీ తప్పించుకొని పారిపోసాగారు. తరువాత—]

సమరసేనుడూ సైనికులూ అలా కొంత దూరం పరుగెత్తిపోయి ఒక కొండప్రాంతం చేరుకొన్నారు. ఆ ఏకాక్షి మాంత్రికుని భయంకరమైన కంఠస్వరం ఇప్పుడు వారికింక వినిపించటంలేదు. ‘బతికాము రా బాబూ!” అనుకొన్నారు వాళ్లు. పైగా, చతుర్నేత్రుడి వేగులు ఐన నల్లగూబా, సరవానరమూ ఏమయినవో కాని, తమను మాత్రం వెంబడించటంలేదని వాళ్లు గ్రహించారు. అప్పటికి కొంచెం స్తిమితం చిక్కింది కదా అని సంతోషించారు.

అయితే, ఇక చేయవలసిందేమిటి?— మళ్ళీ మరిఒక ప్రమాదంలో చిక్కుకోక ముందే ఈ మంత్రాలదీవినుండి తప్పించుకొని బయటపడాలి. కాని, ఈ దీవి వదలిపోవటం ఎలా? తాము విడిచివచ్చిన ఓడలు సముద్రంలో ఏ దిక్కున ఉన్నవి? ఓడలలో ఉంచిన సైనికులు బాగా ఉన్నారా? అసలింతకూ తాము దీవికి ఏవైపున ఉన్నట్టు?

ఈ దీవిని ఆవరించుకొనివున్న మహారణ్యం మధ్యని దిక్కులు తెలిసేది ఎలా? ఆ ప్రాంతమంతటా ఎక్కడ చూచినా



కొండలు! ఆకాశాన్ని అంటే మహావృక్షాలు!! ఆ వృక్షాలను అల్లుకొనివున్న తీపర పాపర తీగలు!!! ఇటువంటి భయంకర ప్రదేశంలో దిక్కులేం తెలుస్తయి? దిక్కులు తెలిస్తే కద, తాము ఎక్కడున్నదీ కనుక్కోవటం?

ఈ చిక్కు ప్రశ్నలతో సమరసేనుడు సతమతమవుతూ వుండగా, ఆకాశంలో అకస్మికంగా మబ్బులు విచ్చి, సూర్యుని దర్శనమైంది. సూర్యుని గమనాన్నిబట్టి చూడగా, తామిప్పుడు దీవికి ఏ దిక్కున వున్నదీ సమరసేనుడికి అర్థమైపోయింది.

'ఈ మంత్రాలదీవికి మనం ఇప్పుడు పడమటి దిక్కున ఉన్నాము. మన ఓడలు అటు తూర్పుతీరంలో ఉన్నవి. ఇది మన పరిస్థితి!' అన్నాడు సమరసేనుడు.

'అయితే, మనం ఎలాఐనా శ్రమపడి, తూర్పుతీరం చేరుకోవటం మేలుకద!' అని సైనికులలో ఒకడు తన వుద్దేశం చెప్పాడు.

'మంచిదే. కాని...అక్కడికి చేరుకోవటం అంత తేలిక కాదు. ఎన్నెన్ని ఆటంకాలు! పోనీ, ముక్కుకు సూటిగా పోదామా అంటే వీలులేదాయె. కొండలు- అడవులు- వీటన్నిటినీ మించి, భయంకరమైన క్రూర మృగాలు!—వాటి బారినుండి తప్పించుకొని బయటపడితేకద, మనం ఆ తీరం చేరుకోవటం!' అంటూ పెద్దగా నిట్టూర్చాడు సమరసేనుడు.


నాయకుడైన సమరసేనుడే ఈ విధంగా నిట్టూర్చేటప్పటికి సైనికులంతా వెలవెలబోయారు. అది చూచిన సమరసేనుడు వెంటనే 'మీరన్నట్టుగా, తూర్పుతీరం చేరుకోవటమే మంచిదని నాకూ తోస్తూవుంది. అలానే చేదాం. ఇక, కష్టాలమాటా?—మన చేతి ఖడ్గం, కుండలినీదేవి కటాక్షం—ఈ రెండు రకాలూ వున్నంతకాలం మనకు ఏ కష్టాలు వచ్చినా ప్రమాదం లేదు. రండి! నావెంట రండి!!—' అంటూ, వారిని హెచ్చరించి, తను ముందు నడిచాడు.

నాలుగడుగులు వేశారో లేదో వారు—సమరసేనుడు తక్కున ఆగిపోయి, 'ష్-ఆగండి!' అన్నట్టుగా తన సైనికులకు చేతితో సైగచేశాడు. ఆతడు అనుమానించి నట్టుగానే, ఎదుట ఒక భయంకర దృశ్యం కంటబడింది. ఆదృశ్యం ఎంతటి ధీరుడికైనా పళ్ళు జలదరింపచేసే దృశ్యం!!—ఒక పెద్ద కొండచిలువ చెట్టుకొమ్మలమీదినించి మెల్లమెల్లగా కిందికి జారుతున్నది. దిగువను రెండు చిరుతపులులు, చిలువ దిగుతున్నసంగతి గమనించకుండా, ఆదమరచి నించున్నాయి.

వారు అలా చూస్తూవుండగానే, పులులలో ఒకదానిని కొండచిలువ మెడ పట్టుకొన్నది. ముందుగా చిలువ నోటితో దానిని ఒడిసిపట్టి, వెంటనే పులి శరీమంతటినీ, మోకుతో బిగించినట్టుగా మెలివేసుకొన్నది. ఇదిచూచి, రెండవ చిరుత భయంతో దూరంగా పారిపోయింది.

పారిపోయిన రెండవ చిరుత మళ్లీ యేమనుకొన్నదో కాని, ఒక్కపరుగున వచ్చి చిలువమీదికి దూకింది!

'పదండి. ఇటువంటి అపాయంలో చిక్కుకోకుండా మసలుకోవాలి మనం' అంటూ, సైనికులను హెచ్చరించారు సమరసేనుడు.





ఆ తరువాత సైనికులందరూ ముందుకు సాగి, మరొకదారి పట్టారు. ఈ దారి నడవటానికి అంత అనుకూలంగా లేదు. అనేకములైన సెలయేళ్ళు పక్కనున్న కొండల మీదినించి దిగి, ఆ ప్రదేశాన్నంతటినీ బురదనేలగా మార్చినై. దీనికి ఫలితంగా–ఎక్కడ చూచినా రెల్లుపొదలూ, వెదురు పొదలున్నూ. అక్కడ తుంగ మోకాలు ఎత్తున పెరిగింది. దానిలోనించి నడచి పోవాలి. ఇలాటి దారిలో సైనికులందరూ చుట్టూ పరికించిచూస్తూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని, సాగిపోవలసి వచ్చింది. ఎప్పటిలాగా సమరసేనుడు ముందుండి దారి తీస్తున్నాడు. సైనికులకు ధైర్యం చెబుతూనేవున్నాడు. కొంతదూరం వెళ్ళినతరువాత సమరసేనుడు—

'ఈ ప్రాంతంలో బహుశా నీటివసతులు ఎక్కువగా ఉంటవని తోస్తుంది. అనగా, మడుగులవద్దకు నీటిజంతువులు తరుచు వస్తుంటాయన్నమాట. అయితే—అడవి జంతువులకు భయపడినంతగా మనం నీటిజంతువులకు భయపడ నక్కరలేదు' అని చెప్పాడు.

ఈ మాటలు అనటం పూర్తిఅయిందో, లేనేలేదో—పక్కని వున్న రెల్లుపొదలోనించి ఒక ఖడ్గమృగం ఇవతలికి వచ్చింది. దానిని చూస్తూనే, సైనికులు పారిపోదామని దిక్కు దిక్కులు చూచారు. ఇది గ్రహించిన సమరసేనుడు వాళ్ళతో—

'మనం పారిపోవ యత్నించటం మరీ ప్రమాదం కావచ్చు. ఎందుకైనా మంచిది. ఒకళ్ళవెనుక ఒకళ్లు వరుసగా నిలబడి, కత్తులుమాత్రం సిద్ధంగా ఉంచుకోండి!' అని సలహా చెప్పాడు.

ఖడ్గమృగం తల పైకెత్తి, భయంకరంగా ఒకసారి అరిచి, ముందరి కాలు దువ్వింది. సైనికులు భయకంపితులయ్యారు. అందరూ సమరసేనుడికేసి చూశారు.


రెండవసారి మళ్ళీ ఖడ్గమృగం కాలు దువ్వింది. ఈసారి వేగంగా ఒక్క ఊపుతో వారిమీదికి దూకింది!

అదును చూచి, సమరసేనుడు ఖడ్గంతో దాని వెన్నుమీద బలంగా పొడిచాడు. ఏదైనా మరిఒక జంతువు అయినట్టయితే దెబ్బకు పడిపోవలసిందే. కాని, ఆ పోటు ఖడ్గ మృగానికి ఏమీ ప్రమాదం చేయలేదు. అయితే—సమరసేనుడు చేసిన పనికి అది అరణ్యమంతా అదిరేటట్టు బొబ్బలుపెట్టి, మళ్ళీ ఒకసారి కాలుదువ్వి, సైనికులున్న దిక్కుకు ఒక్క ఉరుకు ఉరికింది.

ఇప్పుడు సైనికులు ఎంతమాత్రం భయ పడలేదు. నాయకుడు కనబరిచిన ధైర్యం వాళ్లసాహసానికి ఊతయిచ్చింది. నలుగురూ నాలుగు పక్కలా, ఇద్దరు దాని పొట్టమీదా ఇష్టంవచ్చినట్టల్లా పొడిచిపొడిచి వదిలారు!

ఖడ్గమృగం ఒక పక్కకు పడిపోయింది. బాధతో తన్నుకొంటూ, అరవసాగింది. సమరసేనుడు తన వాళ్లతో 'ఏదో, ఇప్పటికి గండం గడిచింది. దీని అరుపు విని మరి కొన్ని జంతువులు రాకముందే ఇక్కడి నుంచి తప్పుకొనిపోవటం క్షేమం!' అని చెప్పి, తక్షణమే బయలుదేరాడు.







కొంచెందూరం వెళ్ళేసరికి వారికి ఒక మడుగు కనిపించింది. అది చూడగానే—ఖడ్గమృగంతో పోరాడి అలసిపోయివున్న ఆ సైనికులు, అందులో దిగి దప్పితీర్చుకోందా మనుకొన్నారు. సైనికులలో ఒకడు 'ఎంత చక్కగా వున్నది నీరు! ఈ తేటనీటిలో ఒక్క బుడకవేస్తే బాగుండునే!' అన్నాడు.

ఇందుకు సమరసేనుడు—'ఈ దీవి మంత్రాల దీవి అనే సంగతిమాత్రం మరచి పోకండేం, జాగ్రత్త!" అని హెచ్చరించాడు. బాగా దప్పికొన్న యిద్దరు సైనికులు ముందు మడుగులో దిగారు. అలా వాళ్లు మడుగులో దిగిన క్షణంలోనే—ఆ చుట్టుపట్ల నీరంతా కదిలినట్టయింది. హఠాత్తుగా వాళ్ళమీదకు నాలుగైదు మొసళ్ళు దూకినై. వాళ్ళు భయంతో కేకలుపెట్టారు. ఒడ్డునవున్న సమరసేనుడూ, సైనికులూ బాణాలు ఎక్కుపెట్టి వాటిపైకి వదిలారు. ఏమయితే నేం! ఆ సైనికు లిద్దరినీ, మొసళ్ళు మడుగు మధ్యకు లాక్కుపోయినై.

ఇలా జరగటం అందరినీ కుంగదీసింది. సమరసేనుడూ, మిగిలిన నలుగురు సైనికులూ దీనవదనాలతో అక్కడినుంచి బయలుదేరారు. ఈసారి అందరూ అతి

మెలుకువతో నడవసాగారు. కొంతదూరం వెళ్ళేసరికి వారికి ఎదుట గొప్ప సరస్సు ఒకటి కనబడింది.

'ఇది చాలా పెద్ద సరస్సులాగా వుంది. దీనిని దాటడం ఎలా?' అన్న సందేహం కలిగింది సమరసేనుడికి. అంతలో – సరస్సు ఒడ్డున ఎవరో స్నానం చేస్తున్నట్టుగా నీళ్ళు కదలబారటం కనబడింది. చూతామంటే ఎవళ్ళూ కనబడరు!! సరస్సుపైకంటా ఒక చెట్టుకొమ్మమాత్రం కనబడుతున్నది. ఆ కొమ్మనుండి ఒక పొడవాటి టోపీ వేలాడుతున్నది. ఆ టోపీకి మనిషికన్నులవంటి రెండు చిత్రమైన బొజ్జాలున్నాయి.



ఈ వింత చూచి సైనికులంతా విస్తుపోయారు. వాళ్ళతోపాటు సమరసేనుడూ విస్తుపోవటమేకాని, ఇదంతా యేమిటీ అనే ప్రశ్నకు సమాధానం తెల్పుకోలేకపోతున్నాడు. సరస్సులో నీరు ఇంకా కదలబారుతూనే వుంది. ఆ కదలికబట్టి చూస్తే, ఎవరో కంటికి కనబడని ఒక వ్యక్తి స్నానం చేస్తున్నట్టు స్పష్టంగా తెలుస్తూనే వుంది.

సమరసేనుడూ సైనికులూ ఒక పొద మాటున వుండి, అచేపనిగా ఈ వింత చూస్తున్నారు. 'ఒకవేళ వీడు మాంత్రికుడైన ఆ ఏకాకి కాదుకద కొంపదీసి!' అని అనుమానం కలిగింది సమరసేనుడికి. 'కాదు' అని వెంటనే నిశ్చయించుకొన్నాడు. ఐతే, టోపీమాట? – అది వాడిది కాదని రూఢిగా తేల్చుకొన్నాడు. మరైతే వీడు మరొక మాంత్రికుడా? అని మళ్ళీ సంశయం కలిగింది సమరసేనుడికి.

అంతలోనే సరస్సులోపలినుంచి ఏవో మాటలు వినబడసాగినై. ఆ స్నానం చేస్తున్న వ్యక్తి ఏవో శ్లోకాలవంటివి వల్లిస్తున్నట్టున్నాడు. ఆ కంఠంలో ఒక విధమైన కటుకుదనం, గాంభీర్యం కనిపించింది. వీడెవడో, అసాధ్యుడురా అని అనుమానం కలిగింది సమరసేనుడికి.

ఈ అనుమానాలతో మునిగితేలుతూవున్న సమరసేనుడికీ సైనికులకూ మరింత భయంకొలిపే ఇంకొక దృశ్యం కంటబడింది. మడుగు ఒడ్డున పొదల చాటునుంచి ఒక పాముతల పైకి లేస్తున్నట్టు కనిపించింది.

అది ఒక అపూర్వమైన వింతజంతువు! దాని ఆకృతి చూడగా, మన మామూలు ఏనుగకు నాలుగైదులంత బ్రహ్మాండమైన ప్రమాణంలో ఉన్నది. అంతటి జంతువుకు తలమాత్రం సన్నం!

ఏం జరుగుతుందోనని అందరూ దాని వైపే, రెప్పవాల్చక చూస్తున్నారు. అది మెల్లగా దాని సన్నపాటి తలను సరస్సు లోపలికి సాచింది. కంటికి కనబడని ఆ వ్యక్తిని పట్టడానికి అది యత్నిస్తున్నట్టు చెప్పనక్కరలేకుండానే తెలుస్తూవుంది.

ఆ వింతజంతువు తల నీటిమట్టానికి ఒక్క గజం ఎత్తుకు వచ్చిందో లేదో, వికృతమైన ఒక పెద్ద కేక వినిపించింది. కేక వినబడటం, చెట్టు కొమ్మనుండి వేలాడే పొదవాటి ఆ కన్నులటోపీ కిందకు జారడం ఒకే సారి జరిగింది!

అదే క్షణమందు, మడుగులో ఒక మనిషి ఆ కన్నులటోపీని ధరించి వుండటం కనబడింది. ఆ మనిషి కనిపించీ కనిపించడంతోనే వింతజంతువు పరుగుచ్చుకొని మాయమయింది.

'ఓహో, నీవా మహోదరా!—నన్నే భక్షించ దలిచావా! చతుర్నేత్రుణ్ణి మింగుదామని వుద్దేశించావా!!' అన్న మాటలు ఆ సమయాన సరస్సులోనుండి వినబడినై.

ఈమాటలకు సమరసేనుడూ సైనికులూ కంపించిపోయారు.

ఏకాకీ మాంత్రికుడికి బద్ధవిరోధి ఐన ఈ చతుర్నేత్రుడి కంటపడకుండా ఇప్పుడెలా తప్పించుకుపోవటం? అనే ఆలోచనలో పడ్డాడు సమరసేనుడు.

—(ఇంకా వుంది)







## 5

[కుండలినీ రాజ్య సైన్యాలు, ధనాగారం నింపేటందుకు పరరాజ్యాలమీదికి దాడి బయలుదేరినై. అశుభసూచకంగా తోకచుక్క కనబడింది. తుపానులో చిక్కి ఓడలుకొన్ని సముద్రంపాలయినై. కొందరు సైనికులు ఒక ద్వీపం చేరారు. అక్కడ క్రూరమృగాలూ, మాంత్రికులైన ఏకాకి, చతుర్నేత్రులు తారసపడ్డారు. తరువాత—]

సమరసేనుడూ సైనికులూ అలా పొదల మాటున దాగి తొంగిచూస్తూనే ఉన్నారు. సరస్సులో ఇప్పుడు ఎవరో ఒక మనిషి నిల బడివున్నట్టు స్పష్టంగా తెలుస్తూవుంది. ఆ మనిషిని పరిశీలించి చూస్తే, అతనొక కుచ్చులటోపీ ధరించివున్నాడు. ఆ టోపీకి ముందుభాగమందు రెండు నేత్రాలవంటి గురుతులున్నయి. ఆ గురుతులలోనుంచి ఒకవిధమైన కాంతి పైకి ప్రసరిస్తున్నది.

ఈ మనిషి ఆ ఏకాకిమాంత్రికుని బద్ధ శత్రువైన చతుర్నేత్రుడే అని గ్రహించాడు సమరసేనుడు. ఆ వింతజంతువు—బ్రహ్మాండమైన శరీరమూ, సన్నటి తల కలిగిన ఆ వింతజంతువు వీడిని మింగ జూచినప్పుడు వీడేమన్నాడు?—'ఓసీ!—ఈ చతుర్నేత్రుణ్ణే మింగుదామని వుద్దేశించావా?' అనికదా! ఈ మాటలనుబట్టే, వీడి పేరు 'చతుర్నేత్రు'డని సమరసేనుడికి తెలిసిపోయింది.

'ఐతే, ఇప్పుడు వీడికంట బడకుండా ఎలా తప్పించుకపోవటం?' అని సమరసేనుడు ఆలోచనలో పడ్డాడు. అతను



యీ ఆలోచనలో ఉండగానే ఒక సైనికుడు 'సేనానీ!—మనలాగా రెండు కన్నులు కాకుండా, వీడికి నాలుగు నేత్రాలు ఉన్నట్టున్నయ్యే?' అన్నాడు. వెంటనే మరొక సైనికుడు అందుకొని, 'ఉన్నట్టుండటం ఏమిటి నీ బుర్ర, స్పష్టంగా కనపడుతూ వుంటే? అదిగాక, వాడి పేరే చతుర్నేత్రుడాయె!. ఇంకా సంశయమా?' అన్నాడు ఎంతో కోపంగా.

ఇదంతా ఒకపక్క వింటూనూ ఉన్నాడు సమరసేనుడు, మరొకపక్క ఆలోచన సాగిస్తూనూ వున్నాడు. చప్పున ఆగి, తన సైనికులకేసి తిరిగి ఇలా ప్రశ్నించాడు.

'ఈ చతుర్నేత్రుడూ ఆ ఏకాకిమాంత్రికుడూ బద్ధవైరులే కదా?'—ఇందుకు సైనికులందరూ ఒకే కంఠంతో 'అవునవును!' అని బదులుగా అన్నారు.

అంతలోనే, వారిలో ఒకడికి అనుమానం కలిగింది. 'మహాసేనానీ!—మరొకలాగున తలచకుండావుంటే ఒక్క చిన్న మాట అడగాలనివుంది' అన్నాడు.

'నిరభ్యంతరంగా అడగవోయ్! నువ్వే కాదు, ఎవ్వరైనాసరే అడగవచ్చు. ఇటువంటి ఆపదసమయంలో ఒక్కడి మాట మీద పోవటంకన్న, నలుగురం కలిసి ఆలోచించి నిశ్చయానికి రావటమే శ్రేయస్కరం!' అని ప్రోత్సహించాడు సమరసేనుడు.

అందుకు సైనికుడు 'సేనానీ!—చతుర్నేత్రుడికీ, ఏకాకిమాంత్రికుడికీ మధ్యని గల వైరాన్ని మనకు అనుకూలంగా వినియోగించుకొందామని మీ ఉద్దేశమైనట్టుంది! ఐతే, నాది ఒక్కమాట; సింహానికీ, పెద్దపులికీ శత్రుత్వమే. కాని అవి రెండూ క్రూరమృగాలే అన్న సంగతి మనం మరచిపోకూడదుగదా?' అన్నాడు.

సమరసేనుడు మళ్ళీ యోచనలో పడ్డాడు. 'నీ మాటా నిజమేనోయ్...' అని

నిట్టూర్చి—'వీళ్ళు మహామంత్రవేత్తలు. దుష్టశక్తులన్నిటినీ అదుపాజ్ఞలలో పెట్టుకొని ఉన్నవాళ్ళు...' అని అనేటంతలోనే, సరస్సులోనించి చతుర్నేత్రుడు ఒడ్డుకు వచ్చాడు.


సమరసేనుడూ సైనికులూ కంపించిపోయారు. పారిపోదామని బుద్ధిపుట్టింది. ఒక అడుగు వేసి, రెండో అడుగు పడేటంతలో చతుర్నేత్రుడి కంచుకంఠం మారుమోగింది;

'ఓరి పిచ్చివాళ్ళల్లారా!—నన్నే కనుగప్పుదామని చూస్తున్నారా? ఉహుఁ.మీవల్ల కాదు. ఈ చెట్లూ చేమలూ, కొండలూ గుట్టలూ, ఏవీ నా దృష్టికి అటంకపడలేవు. దేనినైనా ఛేదించుకుపోతుంది నా చూపు. ఈ ద్వీపంలో ఏ మూల ఏం జరుగుతున్నదో, ఏ క్షణంలోనైనా చెప్పగలను—ఉండండి—ఉలూకా! నరవానరా!!' అంటూ కేకవేశాడు.

ఈ కేకకు నల్లగూబా, నరవానరమూ పరుగెత్తుకొంటూ వచ్చి, సమరసేనుడి దారికి అడ్డంగా నిలబడినై. నరవానరం చేతితో ఒక చెట్టుకొమ్మ పట్టుకొని ఝళిపింప సాగింది. నల్లగూబ గాలిలో ఎగురుతూ, కర్ణకఠోరంగా అరవసాగింది.








పరిస్థితి అంతా అవగాహనయింది సమరసేనుడికి. ఇప్పుడు వాళ్ళున్నది కేవలమూ నిస్సహాయస్థితి అని తేలిపోయింది. తమ చేతనున్న కత్తులూ అంబులూ పూచికపుల్లకైనా కొరగావు. అందుచేత, సైనికుల గుండెబెదురు తగ్గటానికని 'మన దేవి ఉండగా మనకేం భయం. అన్నిటికీ ఆ కుండలినీదేవే శరణ్యం!' అన్నాడు.

సైనికులు నివ్వెరపోతూ నిలబడి వున్నారు. చతుర్నేత్రుడు మెల్లగా ఒక్కొక్క అడుగే వేసికొంటూ, వారిని సమీపించాడు. మార్దవమైన కంఠస్వరంతోనే 'ఎవరయ్యా మీరూ? ఈ ద్వీపానికి ఎందుకని వచ్చారు?' అని అడిగాడు. అతని ముఖాన ఈర్ష్యగాని, కాఠిన్యంగాని మచ్చుకైనా కనిపించలేదు. అతను శాంతమూర్తిగా కనిపించాడు.

చతుర్నేత్రుడు అలా ఆప్యాయంగా ప్రశ్నించేసరికి వారికి తిరుగా ధైర్యం కలిగింది. కొంచెం కుదుటపడ్డారు. ఐతే, ఈ ప్రశ్నకు జవాబివ్వటమా మానటమా అని సంకోచం పట్టుకుంది సమరసేనుడికి. ఇవ్వటమే మంచిదనుకొన్నాడు. అదిగాక, అతనినుంచి దాచగలిగింది ఏమీలేదని తెలుస్తూనేవుంది.

"మాది కుండలినీ ద్వీపం. సముద్రయానం చేస్తూ, తుపానులో చిక్కి ఇక్కడకు చేరుకొన్నాము" అన్నాడు సమరసేనుడు. నవ్వాడు చతుర్నేత్రుడు. "అబ్బాయ్!–నువు చెప్పినదానిలో నిజం లేకపోలేదు. కాని, సముద్రయానం ఎందుకు చేయవలసివచ్చిందో, ఆ కారణంమట్టుకు దాచేశావు. అవునా, కాదా?' అని అతనికి ఎదురుప్రశ్న వేశాడు.

అప్పుడు సమరసేనుడు దాపరికం లేకుండా, ప్రయాణానికి గల కారణాలన్నీ విప్పి చెప్పాడు. తమ ప్రభువు ధనాగారం పట్టిపోవడంతో, దానిని మళ్ళీ నింపే ప్రయత్నంలో, సైనికులను తీసికొని బయలు



దేరానని వప్పుకొన్నాడు. చెప్పిందంతా సాంతంగా విని, చతుర్నేత్రుడు—

"హహ్హహ్హా!!—ధనంకోసం బయలుదేరి, దురదృష్టవశాత్తు తుపానులో చిక్కుకొని, ఈ మంత్రాలదీవి చేరావన్నమాట! బాగానే వుంది. ఇక్కడా ఒక మాంత్రికుడున్నాడు. అతనికీ ధనాశ ఎక్కువే. ధనాశ గల మీరిద్దరూ ఏకమయితే ..!" అంటూ వికటంగా నవ్వాడు.


ఏమి చెప్పేటందుకూ సమరసేనుడికి పాలుపోలేదు. అతను అలా తటపటాయించేటంతలో ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించేలా ఒక పెద్ద కంఠస్వరం వినబడింది. అది ఏకాకిమాంత్రికునిదే!!—'హేయ్, కాలభుజంగా! కంకాళా!! రండి-వెతకండి...' అంటున్నాడు.

వణికిపోతున్న సైనికులకు సమరసేనుడు ధైర్యం చెబుతూ—'అదుగో, ఆ కనబడే పొదలలో దాక్కోండి. వాడు ఏకాకి. ఏకాకి...' అని హెచ్చరించాడు. వాళ్ళు ఒక్క పరుగునపోయి దాక్కొన్నారు.

వారు చాటుకావడ మేమిటి, ఏకాకి మాంత్రికుడు అక్కడ సాక్షాత్కరించడ మేమిటి! కాలసర్పమూ, మానవ కపాలమూ వాడి పక్కనే కదుల్లాడుతున్నయి.

చతుర్నేత్రుడు కంటపడగానే, ఏకాకి మాంత్రికుడు ప్రళయ భీకరంగా నవ్వి, 'ఎన్నాళ్లకు కనిపించావ్! ఎంతకాలానికి దొరికావ్!!" అంటూ, చర్రుమని ఒరనుండి కత్తి బయటికి లాగాడు.

ఉన్నచోటునే చతుర్నేత్రుడు నిబ్బరంగా నిలబడ్డాడు. 'ఓహో, ఏకాకులవారా? దయచేయండి! దయచేయండి!!' అని వికటంగా బదులుచెప్పాడు. ఆ వెంటనే 'నరవానరా! ఉలూకా!!' అని కేకపెట్టాడు. కేక వింటూనే, నల్లగూబా నరవానరమూ వచ్చి వాలినై. వాటినిచూచి ఏకాకిమాంత్రికుడు గతుక్కుమన్నాడు.





అదిగ్రహించిన చతుర్నేత్రుడు 'ఉలూకా! కుడికంటి రుచి నీకు తెలియనేతెలుసు. ఆ ఎడమ కంటినీ కూడా ఆరగించవేయి!' అని ఉసుకొలిపాడు. తక్షణమే గూబ ఏకాకి మాంత్రికునికేసి ఎగిరింది. వాడు కంగారు పడుతూ 'కంకాళా! ఓ కంకాళా!!' అని అరవసాగాడు. చిటికలో మనిషికపాలం తన బోసినోటిని కదిలిస్తూ, ముందుకు వచ్చి నల్లగూబతో తలపడింది.

'హహ్హహ్హ!—హహ్హహ్హ!!' అంటూ నవ్వుతున్నాడు యేకాకిమాంత్రికుడు. చతుర్నేత్రుడు ఉగ్రుడయ్యాడు. 'నరవానరా!–' అని అరిచాడు. మరు నిమిషంలోనే నరవానరం ఏకాకిమాంత్రికుని కేసి ఒక్కదూకు దూకింది, మాంత్రికుడు 'కాలభుజంగా!—' అని పెద్దగా కేకపెట్టాడు. వెంటనే ఆ కాలసర్పం మెలికలు తిరుగుకొంటూ ముందుకువచ్చి, నరవానరంతో కలియబడింది.

పొదలచాటున ఉండి ఈ పోరాటాన్ని దీక్షతో తిలకిస్తూనేవున్నారు, సమరసేనుడూ, సైనికులున్నూ.

'సరిసమానమైన ఉజ్జీ!' అన్నాడు ఒక సైనికుడు. 'అందుకే బతికిపోయాం' అన్నాడు సమరసేనుడు. ఏకాకిమాంత్రికుని భృత్యులకూ, చతుర్నేత్రుడి వేగులకూ మధ్యని గొప్ప యుద్ధంసాగింది. నల్లగూబను మానవకపాలం తన బోసినోటితో ఒడిసిపట్టబోయింది. నరవానరాన్ని ఒడిసిపట్టాలని కాలభుజంగం అతి తీవ్రంగా పెనగులాడుతున్నది.

చతుర్నేత్రుడూ, ఏకాకిమాంత్రికుడూ ఒకళ్ళనొకళ్ళు కోపదృష్టులతో చూచుకొన్నారు. ఈ పోరాటం ఇంతలో తేలేది కాదని ఇద్దరికీ తెలుసు.

ఒక్కసారి చతుర్నేత్రుడు నవ్వి, తల మీది టోపీ పైకి ఎత్తి, పెద్దగా 'ఓం-హ్రీం' అన్నాడు. అలా అనీ అనటంతోనే అతడు

అదృశ్యమైపోయాడు. ఆ వెంటనే నల్ల గూబా నరవానరమూ మాయమైనాయి.

ఏకాకిమాంత్రికుడు గంభీరంగా పరిశీలించి—'అదృశ్యమయ్యావూ? కానీ, ఎంతకాలం తప్పించుకు తిరుగుతావో చూస్తాగా...' అంటూ హుంకరించాడు.

తరవాత కోపంతో చుట్టూ పరికించాడు. ఆ ఏకాకికి చెట్లచాటున దాగిన సమరసేనుడూ, సైనికులూ కనిపించలేదు. 'హుఁ' అంటూ పళ్ళుకొరికాడు. చతుర్నేత్రుని వేగులతో పోరాడి అలసిపోయిన కాలభుజంగాన్నీ, కపాలాన్నీ సముదాయించాడు. తళతళ మెరుస్తూవున్న చేతిలోని పెద్ద కత్తి ఝుళిపిస్తూ చెట్లకొమ్మలకేసి చూశాడు. అతడికింకా నల్లగూబ అంటే భయంపోలేదు. అది వెనుక అతడి కంటిని పొడిచింది. దాని అరుపు వింటేనే ఏకాకి మాంత్రికుడికి ముచ్చెమట్లుపోస్తాయి.

తరవాత అతడు మానవ కపాలాన్నీ కాలభుజంగాన్నీ వెంటబెట్టుకొని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. అంతటితో యుద్ధరంగం తెరపి ఇచ్చింది.


'బతికాముర్రా బాబూ!' అనుకొంటూ, సమరసేనుడూ సైనికులూ ఇవతలికి వచ్చారు.

తూర్పుదిశాన వున్న తమ ఓడలవద్దకు చేరుకొందామని మళ్ళీ బయలుదేరి పది అడుగులు వేసేసరికల్లా భూమి పెళపెళమని బద్దలవుతున్నదా అనిపించేటటువంటి అద్భుత శబ్దం వినబడింది.

వినబడటమేమిటి?—ఎదట అగ్ని పర్వతంనుండి లేచి, ఎగసివస్తున్న అగ్ని జ్వాలలు ఆకాశానికి అంటుతున్నాయి! అది చూచి సమరసేనుడికీ, పరివారానికీ గుండెలు అవిసిపోయినై.

వారు అలా నిలబడి నిర్ఘాంతపోయి ఆ జ్వాలలకేసి అమిత ఆశ్చర్యంగా చూస్తూ వున్నారు. —(ఇంకా వుంది)







## 6

[కుండలిని రాజ్య సైన్యాలు, ధనాగారం నింపేటందుకు పరరాజ్యాలమీదికి దాడి బయలుదేరినై. అశుభసూచకంగా తోకచుక్క కనబడింది. తుఫానులో చిక్కి ఓడలు కొన్ని సముద్రంపాలయినై. కొందరు సైనికులు ఒక ద్వీపం చేరారు. అక్కడ క్రూరమృగాలూ, మాంత్రికులైన వికాకి, చతుర్నేత్రులు తారసపడ్డారు. వారినుంచి తప్పుకు పారిపోతూన్న సైనికుల మార్గంలో అగ్నిపర్వతం బద్దలయింది. తరువాత-]

అగ్నిపర్వతంనుండి ఎగసివస్తున్న నిప్పు రవ్వలు ఆకాశానికంటా విరజిమ్ము తున్నాయి. ఇది చూచి సమరసేనుడూ, సైనికులూ పొందిన భయానికీ ఆశ్చర్యానికి మేర లేకపోయింది.

సరిగా వారు పోవలసిన దోవలోనే ఈ అగ్నిపర్వతం బద్దలయింది. కనుక, ఇంకిప్పుడు వేరుదారి చూచుకొని వెనకడుగు వేయుటం తప్పనిసరి అయింది. సమర సేనుడు దారితీశాడు. భయకంపితులైన సైనికులు మారుమాటాడకుండా, తమ సేనానిని అనుసరించారు. ఇప్పుడు అందరూ పడమటి దిక్కుకే నడుస్తున్నారు. చూడగా- వాళ్ళ ఓడలు తూర్పు తీరంలో వున్నవాయె. ఐతేమాత్రం? ఒకవంక మాంత్రికులూ, క్రూరమృగాలే కాక ఇప్పుడు ఈ అగ్ని పర్వతం కూడా వారిని ఎదురుకొంటూ వుండగా ఎలా చేరుకోగలరు తూర్పుతీరానికి?

అగ్నిపర్వతం ధాటికి భూమి ఇంకా అదురుతూనే వుంది. పర్వతంనుంచి వెడలి



వచ్చిన పొగలతో ఆకాశమంతా కమ్ముకుపోయింది. ఇది చాలదన్నట్టుగా గొప్ప భూకంపం కలిగే సూచనలు కూడా కనిపించ సాగినాయి. సమరసేనుడు ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్చి, 'ఇది మంత్రాల దీవే కాదు; అగ్ని పర్వతాల దీవి! భూకంపాల దీవి...!' అంటూ ఒక విధమైన భయాన్ని వెల్లడించాడు.

చెట్లలోనుంచీ, తుప్పలలోనుంచీ దారి చేసుకొని, సమరసేనుడూ, సైనికులూ ముందుకు నడుస్తున్నారు. ఐతే, అగ్ని పర్వతంనుంచి వెలువడిన 'లావా'ద్రవం పొగలు కక్కుతూ పల్లపు చోటు లన్నిటికీ ప్రవహిస్తున్నది. ఇది చూచి నలుమూలల నుండి వన్యమృగాలు పరుగులెత్తుతూ అరుస్తున్నాయి. అవి కంటపడగానే సమరసేనుడికి మరింత హడలుచ్చుకుంది.

సలసల కాగే లావాద్రవంతో దాట శక్యంకాని నది ఏర్పడకముందే ఏదో ఒక గట్టు చేరుకోవటం మేలనుకొన్నాడు. లేకపోతే లావాద్రవంవల్ల కలిగే ఉపద్రవమే కాకుండా, కంగారుతో పరుగులెత్తే క్రూర మృగాల బాధకూడా తప్పించుకోవాలి.

సమరసేనుడు తన సహజధోరణిలో పరివారానికి ధైర్యం చెబుతూ ముందుకు నడుస్తున్నాడు. హఠాత్తుగా అతని దృష్టికి ఒక వింత దృశ్యం గోచరించింది. 'ఇది కలా? నిజమా?' అనే సంశయంలో పడ్డాడు. కాని, మరి నాలుగు అడుగులు వేసేసరికి, తను చూస్తున్నది అక్షరాలా నిజమే అని రూఢి అయిపోయింది.

'జాగర్త' అని సైనికులకు హెచ్చరించాడు సమరసేనుడు. అతను నిశ్చేష్టుడై నిలబడి అదేపనిగా చూస్తున్నాడు. ఎట్ట ఎదట చెట్టుకొమ్మనుండి ఎవరో ఒక మనిషి తలకిందుగా వేలాడుతున్నాడు! వాడు బతికివున్నాడో చచ్చాడో తెలియదు. కాళ్లూ, చేతులూ తీగెలతో బంధింపబడి వున్నాయి.

వాడి ముఖ లక్షణాలూ, ధరించిన జంతు చర్మాలూ చూస్తే, ఒక అడవిజాతివాడని తెలియవస్తున్నది.

సేనానితోపాటు సైనికులూ నిశ్చేష్టులై ఈ వింత చూస్తూవున్నారు. ఈ మంత్రాల దీవిలో మృగాలూ, మాంత్రికులే కాదు—మానవులుకూడా వుంటున్నారని వాళ్ళకు తెలిసింది. సమరసేనుడు కొంచెం స్థిమిత పడి, నిదానంగా ఆలోచించి, 'ఈ అడవి మనిషికి ఇంత కఠినమయిన శిక్ష విధించిన వారు ఎవరైవుంటారు?—' అని తనని తనే ప్రశ్నించుకొన్నాడు.

"అడవిజాతికి చెందినవాడయితే యేం, వాడూ మానవుడే. ఇటువంటి మానవులు ఈ దీవిలో నివసిస్తున్నట్టు రూఢి ఐంది గనక వీళ్ళ నివాసస్థానం ఎక్కడో కనుక్కోవాలి. కనుక్కొంటే, ముందుముందు మనకు ఎంతో ఉపయోగిస్తుంది," అన్నాడు సమరసేనుడు.

సైనికులు మాటాడలేదు. ఎప్పుడు తూర్పుతీరం పోయి తమ రాజ్యం చేరుకోగలమా అనే ఆత్రంతో వున్న సైనికులకు సేనాని మాటలు రుచించలేదు. 'మనదారి మనం చూచుకోక, ఇంకా ఈ అడవి మనుష్యుల నివాసస్థానాలు పరీక్షింపటం





దేనికి? లేనిపోని శ్రమ' అని అనిపించింది వారికి. సైనికులు అలా మౌనం వహించే సరికి, సమరసేనుడుఏమీ అనలేకపోయాడు. వారి మనోభావం గ్రహించాడు. ఆ మాటకు వస్తే, వారికేకాదు, తనకూ ఎంతట బయట పడదామా అనే వుంది. కాని, మార్గం ఏది?


మరి కొంచెం ముందుకు నడిచాడు సమరసేనుడు. ఆగాడు. తలకిందుగా వేలాడే ఆ మనిషిని పరీక్షించాడు. 'చూడగా వీడి శరీరంమీద గాయాలు ఏమీ కనపడవు. బహుశా విరోధులు ఇలా వేలాడదీసివుంటారు. వీడు ఆకలిదప్పులతో అలమటించి, మరణించి వుంటాడు' అనుకున్నాడు.

ఆ నిర్భాగ్యుణ్ణి చూస్తూవుంటే అందరకూ జాలికలిగింది. సమరసేనుడు మాత్రం 'ఇందులో గూఢమైన రహస్యం ఏదో వుండి తీరాలి. ఇది కనిపెట్టడం ఎలా?—ఒకటి మాత్రం నిశ్చయం—ఈ దీవిలో కొంత ప్రదేశం మానవులకు నివాస యోగ్యమై వున్నది. దీనినిబట్టి వీడి మరణానికి కారణం ఏమిటో కనుక్కోవాలి' అని ఈ విధంగా సమరసేనుడికి ఆ రహస్యం తెలుసుకోవాలనే ఆసక్తి ఎక్కువయింది.

అంతలోనే—అల్లంత దూరాన పడివున్న ఒక వస్తువుమీద సమరసేనుడి దృష్టి పడింది. గభీమని అక్కడికి వెళ్ళాడు. ఆ వస్తువు చేతిలోకి తీసుకున్నాడు. అది పగిలి పోయిన ఒక సొరకాయబుర్ర. దాని మూతి సన్నంగా వుంది. ఆ మూతికొక తాడు బిగించివుంది.

అడుగు పగిలిన ఆ సొరకాయబుర్రను ఎవళ్ళో పారవేసి పోయారు. పరీక్షగా చూస్తే, అది ప్రయాణంలో నీళ్ళు మోసుకు పోవటానికి ఉపయోగించిన సాధనంలాగా వుంది.

'ఆహా!—అంతా కుండలినీదేవి కరుణ!—' అన్నాడు సమరసేనుడు. ఆకాశంకేసి చూసి ఒక్కసారి నమస్కరించాడు.




తమ నాయకుడు ఇలా చేయటానికి కారణమేమిటో ఊహించలేకపోయారు సైనికులు. వారి ఆశ్చర్యం గ్రహించిన సమరసేనుడు—


“భయపడకండి. మానవులు నివసించే ప్రదేశానికి మనం దగ్గరలోనే వున్నాం. ఈ నిర్భాగ్యుల్ని మనుషులే ఇలా వేలాడదీశారు. పైగా ఈ సారకాయబుర్ర మానవులు ఉపయోగించేదే. కనుక, మనం కాస్త జాగ్రత్తగా వెతికితే, ఆ మనుషులు ఇక్కడికి ఏ దారిని వచ్చారో, ఏ దారిని తిరిగివెళ్ళారో అనవాళ్లు తెలియకపోవు” అన్నాడు గంభీరంగా.

మరుక్షణంలో సైనికులు, ఆ ప్రాంతంలో మనుషులు తొక్కిన కాలిబాటలు ఏమైన కనబడతవేమోనని వెతకసాగారు. కొద్దిసేపటికే వాళ్ళ శ్రమ ఫలించింది. ఒక పచ్చిక బయలుమీద కనిపించిన గుర్తులు చూస్తే, ఎంతోమంది మనుషులు గుంపులు గుంపులుగా ఆ బయలుమధ్యనుండి నడిచిపోయినట్టుగా అర్థమయింది.

సైనికులందరూ ఉత్సాహంతో ఆ బాట వెంట నడవసాగారు. ఒక్క అరగంట సేపటిలో వారు ఒకానొక ఎత్తయిన ప్రదేశం చేరుకొన్నారు. అక్కడ నిలబడి చుట్టూ కలయజూచారు. అగ్నిపర్వతం ఇంకా మంటలు గుప్పిస్తూనే వుంది. ప్రాణభీతితో అడవిజంతువులు పరుగెత్తుతూనే వున్నాయి. వాటి అరుపులు వినిపిస్తున్నాయి. అక్కడక్కడ దూరాన అడవి తగలబడుతూవున్న మంటలుకూడా కనబడుతూనేవున్నాయి.

తిరుగా వారు గమ్యస్థానం తెలియకుండా తలలు వంచుకొని ముందుకు నడవసాగారు. క్రూరమృగాలూ, మాంత్రికులూ తారసపడతారనే భయం వారిని వదలనే లేదు. అందరూ మనస్సులో కుండలినీదేవిని స్తోత్రం చేస్తూనేవున్నారు. కత్తులూ అంబులూ సిద్ధపరచుకొనికూడా వున్నారు.





కొంతసేపటికి వారు వచ్చి ఒక నదీతీరం చేరుకొన్నారు. ఆ నది ఎత్తుపల్లాలలోనుండి దుముకుతూ ప్రవహిస్తున్నది.

నది మధ్యనంతా బ్రహ్మాండమైన రాళ్ళ మయం. వాటిని చుట్టుకొని కిందకు ధారలు ధారలుగా ప్రవహించే ఆ నది రణగొణధ్వని చేస్తున్నది.

ఈ నది దాటి అవతలకు పోవటమా? మానటమా? అని సంశయం కలిగింది సమరసేనుడికి. చేరుకోవలసిన చోటు ఏదో తెలియనప్పుడు నదికి ఇవతల వుంటే ఏమి, అవతల వుంటే ఏమి?

వారు చేరవలసింది తూర్పుతీరం. కాని అగ్నిపర్వతం బద్దలయిన కారణంగా పడమటి తీరంవేపు వస్తున్నారు. ఇదిమాత్రం నిశ్చయం. అంతలో ఒక సైనికుడు 'సేనానీ!-ఈ నది దాటటం అంత తేలికైన పనికాదు' అన్నాడు.

'ఔనౌను' అని వెంటనే జవాబిచ్చి, సమరసేనుడు మళ్లీ ఆలోచనలో పడ్డాడు. పొడవాటి తాడువంటిది ఏదైనా దొరికితే ఈ నది దాటటం ఏమంత కష్టంకాదు, అనుకొన్నాడు సమరసేనుడు. ఈ ఆలోచన తన సైనికులకు వెల్లడించాడు. ఐతే, ఈ అడవిప్రాంతంలో తాళ్ళు దొరికేది ఎక్కడ?

అందుకని సైనికులు చెట్లవద్దకు పోయి, వాటిని ఆశ్రయించుకొని వుండే కొన్ని తీగెలు తెంపుకొని వచ్చి, వాటితో ఒక బలమైన మోకు తయారుచేశారు. ఆ మోకు కొస ఒకటి నదిఒడ్డున ఉండే ఒక చెట్టుకి కట్టారు. రెండవ కొస పట్టుకొని, ఒక్కొక్కరే దాని ఆసరాతో ఆ ప్రవాహంలోని బండరాళ్ల మీదినుంచి నడవజొచ్చారు.

కాసేపటికల్లా వారు నదికి అవతలి తీరం చేరారు. సమరసేనుడు సైనికులను హెచ్చరించి, ఒక ఎత్తైనదిబ్బ ఎక్కాడు. అవతల దగ్గర్లో అంతగా చెట్లు లేవు. కాని కొంత దూరం నడిచి వెళ్తే-అదంతా చెట్లమయం.

సమరసేనుడు ఆ ఎత్తైన దిబ్బదిగాడు. కాలిబాట గుర్తులు కనిపిస్తున్నై. అందరూ నడిచి చెట్లమధ్యకు చేరారు.

వాళ్ళు చెట్లమధ్యకు రావటమేమిటి, భయంకరమైన ఘీంకారశబ్దాలు వినిపించడమేమిటి—రెండూ ఒక్కసారే జరిగినయి.

భయకంపితులయిన సైనికులు తమ నాయకుడికేసి చూశారు. సమరసేనుడు ఒక్క గంతువేసి చేరువలోవున్న చెట్టుకు ఎగబాకాడు. సైనికులు అతనిని అనుసరించారు. ఒక్క త్రుటిలో ఆ ప్రదేశమంతా కలయదొక్కుకొంటూ ఘీంకరిస్తూ ఒక ఏనుగులమంద వస్తూవున్నది.

అడవిమంటలలో చిక్కుకోకుండా ఏనుగులు పారిపోతున్నయి. వాటి కాళ్ళ తాకిడికి భూమి ప్రతిధ్వనిస్తున్నది. చిన్న చిన్న మొక్కలూ, పొదలూ, తుప్పలూ చెట్లూ నుగ్గు నుగ్గు ఐపోతున్నయి. ఆప్రదేశమంతా భీభత్సంగా తయారయింది.


చెట్లకు ఎగబాకిన సమరసేనుడూ, సైనికులూ ఆ ఏనుగుల మందను చూచి హడలిపోయారు. 'క్షణమాత్రం ఆలస్యం ఐతే వాటి కాళ్ళకింద పడి మనంకూడా పిండి ఐపోయేవాళ్ళం కదా! అదృష్టం బాగుండి, చేరువనే చెట్లుండటంచేత బతికి బయటపడ్డాం' అనుకున్నారు.

కాస్సేపటికల్లా ఏనుగులమంద ఆ ప్రదేశం వదిలిపోయింది. ఐనా, చెట్టుమీది నుంచి దిగటానికి వాళ్లకు భయంగానేవుంది.

ఎలా ఐతేనేం, గుండెలు పీచుపీచుమంటున్నప్పటికీ సమరసేనుడూ, సైనికులూ కిందికిదిగారు. ఏపాటిచడిఐనా హడలిపోతూనేవున్నారు. ఈసారి మళ్ళీ ఆ కాలిబాటకోసం వెతికారు. కాని, దాని ఆనవాలే కనబడలేదు. ఏనుగుల పాదాలకింద నలిగిన ఆ ప్రదేశమంతా ఒక్కటిగానే కనబడుతున్నది. ఇప్పుడు ఏంచేయాలి?

—(ఇంకా వుంది)





## 7

[అగ్నిపర్వతపు మంటల్నించి దూరంగా పారిపోతున్న సమరసేనుడూ, సైనికులూ—తల కిందులుగా చెట్టుకు వేలాడదీయబడిన మనిషిని చూచారుగదా? తరవాత కాలిగుర్తుల్ని అనుసరించి పోతున్నవారికి ఏనుగులమంద ఎదురైంది. వాళ్లు చెట్లెక్కారు. చూస్తే ఆ కాలిబాటలు ఏనుగుల పాదాలకింద నలిగి, గుర్తులేకుండా పోయినై. తరువాత—]

సమరసేనుడూ, సైనికులూ నిశ్చేష్టులై అలా చెట్లకింద నిలబడ్డారు. ఏనుగుల కాళ్లకింద నలిగిన చెట్లకొమ్మలు చుట్టూ చెల్లాచెదురుగా పడివున్నాయి. అగ్నిపర్వతం మాటుమణిగినట్టు అంతా నిశ్శబ్దంగా వుంది.

కాని దూరంగా అక్కడక్కడ అడవి తగలబడుతూ వున్న సూచనగా మంటలు కనబడుతూనే వున్నాయి.

అందరూ నిరుత్సాహపడిపోయారు. తమ ఓడలు ఉంచివచ్చిన తూర్పుతీరం చేరుకునే ఆశలు అడుగంటినై. ఇంతటితో మాంత్రికుల బెడద తీరిందనుకోవటానికి అస్కారంలేదు. ఒక వైపున క్రూరమృగాల బాధ, అగ్నిపర్వతపు భుగభుగలు, దాట శక్యంగాని నదులు. ఈ ద్వీపంలో ఏదో ప్రాంతంలో నివసిస్తూన్న మానవులదగ్గిరకు చేరుదామంటే ఆ యత్నమూ విఫలమైంది.

ఇప్పుడు ఏంచేయాలి? ఏ మార్గం అనుసరించాలి? అందరినీ ఇదే ప్రశ్న ఎంతగానో బాధిస్తోంది. ఇక సమరసేనుడు ఎంత ఆలోచించినా ఒక దారీ తెన్నూ దొరకక వెలవెలపోతున్నాడు.



ఇలాంటి స్థితిలో వాళ్ళందర్నీ ఆశ్చర్యంలో ముంచేటట్టు ఒక ఆర్తనాదం వినిపించింది. ఆ గొంతు ఏకాకిదీ కాదు, చతుర్నేత్రుడిదీ కాదు. ఘోరవిపత్తులో వున్న ఒక మానవప్రాణి చేసే ఆర్తనాదం.

సైనికులు నివ్వెరపోయి తమ నాయకుడికేసి చూశారు. సమరసేనుడు త్రుటిలో ఒరనుంచి కత్తిదూసి "రండి, జాగ్రత్త సుమా!" అంటూ ఆ ఆర్తనాదం వినబడిన వైపు పరిగెత్తసాగాడు. సైనికులు కూడా కత్తులను సిద్ధంగా వుంచుకుని తమ నాయకుణ్ణి అనుసరించారు. వారు అలా ముందుకు పోతూన్నకొద్దీ ఆ మానవ కంఠం మరింత స్పష్టంగా వినబడసాగింది. కొద్దిసేపటికల్లా వాళ్ళందరూ ఆ చోటుకు చేరుకున్నారు. అక్కడ కంటబడిన ఘోర దృశ్యం వాళ్ళను భయకంపితులనుచేసింది. మరుక్షణంలోనే ఏదో ఆశలాంటిది వారికి ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ మంత్రాలదీవిలో మొట్టమొదటిసారిగా వాళ్ళు జీవంతో వున్న మనిషిని చూడగలిగారు! కాని అతడు గొప్ప విపత్తులో చిక్కుకునివున్నాడు.

పాపం, వాణ్ణి ఎవరో పెడరెక్కలు విరిచి చెట్టుకు కట్టివేసిపోయారు. అలాంటి నిస్సహాయస్థితిలో ఉన్న అతడిని భక్షించేందుకు నాలుగైదు తోడేళ్ళు అక్కడికి వచ్చినై. అదే సమయంలో ఆకలిగొన్న ఒక పెద్దపులి కూడా ఆ చాయలకే వచ్చింది. ఇప్పుడు ఆ దురదృష్టవంతుడి మాంసంకోసం తోడేళ్ళ మధ్యా, పెద్దపులి మధ్యా పోరాటం సాగుతోంది. భయకంపితుడైన ఆ మనిషి గగ్గోలుపెడుతున్నాడు.

సమరసేనుడు క్షణంలో పరిస్థితి అవగాహన చేసుకున్నాడు. పులి పంజాదెబ్బలకు ఒక్కొక్క తోడేలే అరుస్తూ కింద పడిపోతోంది. ఆ విధంగా శత్రుసంహారం చేసి, తరవాత తీరికగా మనిషిమాంసం రుచి చూడాలని పులి పోరాడుతోంది. అలసిస్తే

ప్రమాదమనుకొని సమరసేనుడు బాణం ఎక్కుపెట్టి పులిని గురిచూచి కొట్టాడు. ఆ దెబ్బతో పులి బొబ్బరిస్తూ కింద పడింది.


వెంటనే సైనికులు ముందుకు ఉరికారు. ఆకలిగొన్న తోడేళ్ళు అరుస్తూ వాళ్ళమీదకు దూకినై. సైనికులు తొణకకుండా తమ చేతనున్న కత్తులతో వాటిని నరికివేశారు. అంతలో సమరసేనుడు అక్కడికి వచ్చి, చెట్టుకు బంధింపబడివున్న మనిషి కట్లు గబగబ విప్పాడు.

"నన్ను ప్రాణాపాయంనుంచి కాపాడిన మీరు నిజంగా మహానుభావులు. మీ మేలు ఎన్నటికీ మరవలేను!" అంటూ అతడు సమరసేనుడికీ సైనికులకూ నమస్కరించాడు.

ఆ మనిషి రూపురేఖలూ, మాట్లాడిన తీరూ చూడగా సమరసేనుడికి అత్యాశ్చర్యం కలిగింది. ఇతడు ఈ మంత్రాలదీవివాడు కాదని వెంటనే తెలిసిపోయింది. పైగా అతడు కుండలినిద్వీపవాసి అనికూడా సమరసేనుడికి అనుమానం కలిగింది.

"నువ్వు ఏదేశస్థుడివి?" అని అడిగాడు సమరసేనుడు.

"నేను...నేను కుండలినిద్వీప సైనికుణ్ణి. ఆ రాజ్య సేనానాయకులైన సమరసేనుడు






మీరే కదా ?'' అని ఆ వ్యక్తి ఆశ్చర్యపోతూ సమరసేనుడిని అడిగాడు.

సమరసేనుడికీ, సైనికులకూ ఆ ప్రశ్నతో కలిగిన ఆశ్చర్యం అంతా యింతా కాదు. ఈ కొత్త వ్యక్తి తమతోపాటు ఓడలలో బయలుదేరి వచ్చినవాడు కాదని అందరికీ తెలుసు. అయితే ఇతడు ఎప్పుడు ఇక్కడికి చేరుకొన్నట్టు ?

ఆ కొత్త సైనికుడు వీళ్ల మనోభావాలు గుర్తించినవాడిలా యిలా చెప్పసాగాడు:

“మీరు ఆనాడు ఓడలలో బయలుదేరేటప్పుడు తోకచుక్క కనబడిందిగదా ? అయినా మీరు ఆస్థాన దైవజ్ఞుని సలహాను పాటించకుండా బయలుదేరిపోయారు. ఆ తరవాత కొద్దిసేపటికి పెద్ద తుఫాను ప్రారంభమై, సముద్రం అల్లకల్లోలం కాజొచ్చింది. చిత్రసేన మహారాజు చాలా కలవరపడ్డారు. వరసగా నాలుగైదురోజులు మీ క్షేమంకోసం కుండలినీదేవికి పూజలూ, ఉత్సవాలూ చేయించారు.

కాని తుఫాను దాదాపు వారంరోజుల పాటు భయంకరంగా వీచింది. మీరు ఏమైపోయారో అని రాజూ, ప్రజలూకూడా దిగులుపడిపోయారు.

ప్రతిరోజూ వేలాది ప్రజలు రాజభవనానికి వచ్చి, సైనికులుగా ఓడల్లో వెళ్ళిన తమ బంధుమిత్రుల క్షేమ సమాచారాలు అడగసాగారు.

చివరకు చిత్రసేనమహారాజు ఆస్థాన దైవజ్ఞుడిచేత అంజనం వేయించి మీరు ఎక్కడ, ఏ స్థితిలో వున్నారో తెలుసుకొదలిచారు. ఒక శుభముహూర్తాన అంజనం వేసి చూశారు. ఓడలు మునిగిపోగా మిగిలిన కొద్దిమంది ఒకానొక ద్వీపం చేరుకున్నట్టుగా తెలిసింది.

చిత్రసేనమహారాజు మంత్రిసామంతులతో సమాలోచన జరిపారు. ఆ కొద్దిమంది సైనికులతో మీరు ఏదో ఒక కొత్త ద్వీపానికి

చేరటంవల్ల ముప్పు కలిగే అవకాశం వున్నదని నిర్ణయించుకున్నారు. తరవాత వారం రోజుల్లో మరికొందరు సైనికుల్ని పోగుచేసి కుంభాండుని నాయకత్వంకింద మిమ్మల్ని వెతికేందుకు పంపారు."


"ఎవరీ కుంభాండుడు?...ఓహో కుంభాండ సంస్థానాధిపతా?" అన్నాడు సమరసేనుడు ఆశ్చర్యపడుతూ.

"అవును, వాడే! వాడివల్లనే యిప్పుడు నేనీ ప్రాణాపాయస్థితిలో యిరుక్కున్నాను" అన్నాడు సైనికుడు పళ్ళుకొరుకుతూ.

సమరసేనుడు ఆ మాటలతో నివ్వెరపోయాడు. సైనికులకు యిదేమీ అర్థం కాలేదు. తిరుగా ఆ కొత్త సైనికుడు ఇలా చెప్పసాగాడు:

"మేము కొద్దిరోజులకల్లా, యీ ద్వీపం చూశాం. దక్షిణప్రాంతంలో ఓడలు దిగి, తీరం చేరాం. కుంభాండుడు మమ్మలనందరినీ తీరందగ్గిరే వుండమని యిరువురు సైనికులతో ద్వీపంలోపలికి బయలుదేరాడు.

ఆ రోజల్లా మేము అతడికోసం ఎదురు చూస్తూ కాలం గడిపాం. మరునటిరోజు తెల్లవారిన తరవాత కుంభాండుడు ఒంటరిగా తిరిగి వచ్చాడు. వస్తూనే మాదగ్గిర వున్న విల్లంబులూ అవీ తీసుకుని కట్టకట్టించి




సముద్రంలో పారవేయించాడు. ఎంత ఆలోచించినా ఈ విడ్డూరం ఏమిటో మాకు అర్థం కాలేదు. పైగా అతడితో వెళ్ళిన యిద్దరు సైనికులూ ఏమయారో మాకు తెలీదు. అడిగితే వాళ్లను ఏదో అడవిజాతివాళ్లు చంపేశారని చెప్పాడు.

మాకు అనుమానం కలిగింది. విల్లంబుల్ని అలా కట్టకట్టి సముద్రంలో ఎందుకు పారవేయించాడో నిలదీసి అడిగాం.

దానికి కుంభాండుడు తను సేనానాయకుడుగా ఏది చేసినా తనను ఎవరూ ప్రశ్నించకూడదని కఠినంగాజవాబిచ్చాడు."

"అయితే కుంభాండుడుకూడా తన విల్లం


CHITRA

బులను సముద్రంలో పారవేశాడా?" అని అడిగాడు సమరసేనుడు అనుమానంగా.

"అదే చోద్యం! తన విల్లంబులు మాత్రం తను అట్టేపెట్టుకున్నాడు. మేము ప్రశ్నిస్తే తను నాయకుణ్ణనీ, ప్రశ్నించటం తనను ఎదిరించినట్టవుతుందనీ చెప్పాడు.

ఆ తరవాత కొద్దిసేపట్లోనే బరిసెలూ, ఈటెలూ ధరించిన కొంతమంది ఆటవికులు వికృతంగా అరుస్తూ మా దగ్గరకు రాసాగారు. మాదగ్గర బాణాలు లేవు గనక, అక్కడ దొరికిన రాళ్లతోనూ, చెట్ల కొమ్మలతోనూ ఆత్మరక్షణకు తలపడ్డాం.

కాని కుంభాండుడు మమ్మల్నందరినీ, ఆ ఆటవికులకు లొంగిపోవలసిందని ఆజ్ఞాపించాడు. ఈ వింతఘోరం మాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. మాలో అప్పటికే చాలామంది సైనికులు ఆ ఆటవికుల బల్లెపు పోట్లకు ఆహుతి అయిపోయారు. మిగిలినవాళ్లం చేసేదిలేక లొంగిపోయాం."

"అలా పోరాటం జరుగుతూంటే కుంభాండుడు మీకేమీ సాయంచేయలేదా?" అని అడిగాడు సమరసేనుడు ఆగ్రహాన్ని అణచుకుంటూ. దానికి సైనికుడు—

"అలాంటిదేమీ లేదు. మేము లొంగిపోగానే మమ్మల్ని పెడరెక్కలు విరిచి



కట్టారు. కుంభాండుణ్ణి ఒక అందలంమీద ఎక్కించారు. దాన్ని కొందరు ఆటవికులు బుజాలమీద ఎత్తుకుని అరుస్తూ వాళ్ళ పల్లెలకు తీసుకుపోయారు.

మేము ఆ ఆటవికులకు బందీలుగా ఉండవలసి వచ్చింది. ఇక కుంభాండుడు వాళ్ళకు రాజుగా వ్యవహరించాడు.

ఆ ఆటవికజాతులకు అతడు ఎంత చెపితే అంత! వాళ్లమీద యింత అధికారాన్ని ఎలా సంపాదించాడా ఈ కుంభాండుడు అన్నసంశయం మమ్మల్ని బాధిస్తూనేవుంది."

"అదే నాకూ కలిగిన సంశయం!" అన్నాడు సమరసేనుడు నవ్వుతూ.

"మాకు కలిగిన సంశయం రెండు మూడు రోజులకల్లా తీరిపోయింది. ఆ అటవికులకు అసలు బాణాలంటే ఏమిటో తెలీదు. మనిషి కదలకుండా ఒక చోట నుంచుని, ఎక్కడో వున్న పక్షినిగానీ, జంతువునుగాని బాణం విడిచి చంపటం, వాళ్ళకు గొప్ప మహిమలాగా కనబడింది! ఆ మహిమ తనకు ఒక్కడికే ఉందని చెప్పుకొని, వాళ్ల మీద రాజరికం సంపాదించేటందుకే కుంభాండుడు మా విల్లంబుల్నీ వాటినీ కట్ట కట్టి సముద్రంలో పారవేయించాడు.

ఈ రహస్యం అప్పట్లో మాకు తెలీలేదు. ఒకరోజున అడవిప్రాంతమంతా తప్పెట మోతలతో మారుమోగిపోయింది. వందల కొద్దీ అడవిజాతులవాళ్లు మేము వుంటున్న పల్లెకు వచ్చారు. వాళ్లందరిముందూ ఈ కుబుద్ధి కుంభాండుడు తన మహిమను ప్రదర్శించాడు! ఎక్కడో ఆకాశాన ఎగురుతూవున్న ఒక గరుడపక్షిని బాణంతో నేల కూల్చాడు. దూరంగా వున్న ఒక లేడిని మరొక బాణంతో పడకొట్టాడు.

విల్లూ అంబులూ అంటే ఏమిటో తెలియని ఆ అనాగరికులు కుంభాండుడిచుట్టూ చేరి నాట్యంచేశారు. వాళ్ళ సాయంతో ఈ ద్వీపానికి రాజుకావాలని కుంభాండుడి తాపత్రయం."

"ఏముంది ఇక్కడ పాలించేందుకు? అడవిమృగాలూ, అగ్నిపర్వతాలూ, ఒకరిద్దరు మాంత్రికులూ!" అన్నాడు సమరసేనుడు వికటంగా నవ్వుతూ.

"మాంత్రికులా?" అంటూ భయకంపితుడై ప్రశ్నించాడు ఆ సైనికుడు. "వాళ్ళ సంగతి విన్నాం! మమ్మల్ని......"

"వినటమే గాదు, చూడనూవచ్చు కావాలంటే!" అన్న కంఠనాదం ఆ ప్రాంతంలో మారుమోగింది. వెంటనే చతుర్నేత్రుడు తన కుచ్చుటోపీని చేతబట్టి వారిముందు ప్రత్యక్షమయ్యాడు. —(ఇంకా వుంది)






## 8

[అడవిలో దారి వెతుక్కుంటూ పోతూన్న సమరసేనుడికీ, సైనికులకూ, ప్రాణాపాయ స్థితిలోవున్న ఒక కొత్త సైనికుడు కనబడ్డాడుగదా? అతడివల్ల కుండలినీ ద్వీపాన్నించి వచ్చిన కుంభాండుడి రాజద్రోహాన్ని వాళ్ళు తెలుసుకున్నారు. అతణ్ణి హతమార్చటం ఎలాగా అని ఆలోచిస్తున్న సమరసేనుడికి చతుర్నేత్రుడు తారసపడ్డాడు. తరువాత—]

చతుర్నేత్రుడు హఠాత్తుగా తమముందు ప్రత్యక్షమయేసరికి సమరసేనుడికీ, సైనికులకూ గుండెలు అవిసిపోయినై. ఆ కొత్త సైనికుడు మరీ హడలిపోతున్నాడు. చతుర్నేత్రుడి వేగులైన నల్లగూబా, నరవానరమూ ఆ దాపులనే నిలబడి ఈ వింత చూస్తున్నాయి.

"పరులకు హాని గలిగించటం నాపని కాదు. భయపడకండి!" అన్నాడు చతుర్నేత్రుడు నవ్వుతూ. "ఆ ఏకాకి తప్ప ఈ లోకంలో నాకెవరూ శత్రువులు లేరు. అతగాడినైనా, నన్ను హతమార్చాలని పూనుకున్నాడు గనకనే నేను శత్రువుగా భావించవలసి వచ్చింది. ఇంతకీ ఈ కొత్తవాడెవడు?" అన్నాడు చతుర్నేత్రుడు అపాయంనుంచి రక్షింపబడిన సైనికుడికేసి వేలుచూపుతూ.

"నా పేరు ధనపాలుడు. ఆపదలో వున్న నన్ను వీళ్లు రక్షించారు" అన్నాడు ధనపాలుడు భయంభయంగా. ఆమాటలకు చతుర్నేత్రుడు నవ్వి—

"ఇప్పుడు మీరంతా ఆపదలోనే చిక్కుకోబోతున్నారు. లోగడ మీకు హాని తలపెట్టిన




వాడెవడైనావుంటే—వాడు ఆ ఒక్క ఏకాక్షి మాంత్రికుడే. ఇక యిప్పుడు ఈ ద్వీపానికి దక్షిణపుకొండల అవతల్నించి మీలాంటి మనుషులవల్లనే మీకు ప్రాణాపాయం కలగబోతోంది" అన్నాడు.

ఆ సమయంలో పొదలమాటున దాగిన యిద్దరు ఆటవికులు వీళ్లకేసి చూస్తున్నారు. కాని, పాపం ఆ సంగతి సమరసేనుడికి గానీ, సైనికులకిగానీ తెలియదు.

ఇక సమరసేనుడు "చతుర్నేత్రా! మీరు మాంత్రికులైనా మంచివారులా కన బడుతున్నారు. మీరు చెప్పినట్టు నిజంగానే మాకు ప్రాణాపాయం కలగబోతూంటే, దానినుంచి బయటపడే మార్గం తెలియ చేయరా?" అని అడిగాడు దీనంగా.

చతుర్నేత్రుడు వెంటనే ఏ జవాబూ ఇవ్వలేదు. కొంచెంసేపు ఆలోచించి తల పంకిస్తూ ఇలా అన్నాడు—

"ఈ ద్వీపంలో ఇన్ని యిక్కట్లకూ మూలకారణం ఆ పడమటి సముద్ర తీరంలో సగం మునిగివున్న ఒకానొక ఓడ. దాని నిండుగా ధనరాసులున్నాయని అంద రికీ తెలిసిందే. ధనంతో కాని పని అంటూ ఏమీ ఉండదనికూడా చాలామంది నమ్మకం. ఏకాక్షిమాంత్రికుడికి ఆ ధనం కావాలి, నాకు ఆ నావని కాపలాకాస్తున్న నాగకన్య కావాలి. మీకు ఏంకావాలో చెపితే నా చేత నైన సహాయం చేస్తాను."

అంతలో ప్రాణాపాయంనుంచి రక్షింప బడిన ధనపాలుడు వణికిపోతూ పెద్ద కేక పెట్టాడు. సమరసేనుడూ, తక్కిన సైని కులూ అతడికేసి తిరిగి, "ఏమిటి? ఏం జరి గింది?" అంటూ ఆత్రంతో అడిగారు.

ధనపాలుడు దూరంగా వున్న పొదలకేసి వేలు చూపుతూ—"చూడండి, చూడండి! వాళ్ళు మళ్లీ తిరిగివచ్చారు. నన్ను ఆ చెట్టుకు బంధించింది వాళ్లే!" అని కలవర పాటుతో అరవసాగాడు.

సమరసేనుడికీ, సైనికులకూ ఆ పొదల చాటునుండి పొంచిచూస్తున్న ఇద్దరు అడవిమనుషులు కనిపించారు. వెంటనే సమరసేనుడు బాణం ఎక్కుపెట్టాడు. కాని, చతుర్నేత్రుడు అతణ్ణి వారిస్తూ—


"సమరసేనా! నీ బాణం దెబ్బకు వాళ్ళు అందరు. ఆకాశంలో ఎగిరే గరుడ పక్షినీ, పరిగెత్తే చిరుతపులినైనా నీవు హత మార్చవచ్చు; వీళ్ళుమాత్రం నీ బాణవేగాన్ని మించి పరిగెత్తగలరు. వాళ్ళసంగతి నేను చూస్తాను!" అన్నాడు.

అలా అని "నరవానరా, ఉలూకా!" అంటూ చతుర్నేత్రుడు కేకవేశాడు. ఆ దాపులోనే వున్న నల్లగూబా, నరవానరమూ తమ యజమాని కేకవిని ఒక్క దూకున అతడిదగ్గరకు వచ్చి వాలినై.

"నరవానరా! నువ్వు ఆ పొంచిచూసి పారిపోతూన్న అటవికుల్ని హతమార్చు! ఉలూకా! నువ్వు ఈ చుట్టుపక్కల అంతా ఒక్కసారి వేగుచూసిరావాలి!" అని ఆజ్ఞాపించాడు చతుర్నేత్రుడు.

వెంటనే నరవానరం పరుగుచ్చుకుంది. కాసేపటిలోనే ఆ పొంచిచూసి పారిపోతూన్న అటవికుల్లో ఒకణ్ణి తన బలమైన చేతుల మధ్య చిక్కించుకున్నది.





ఆటవికుడు భయంతో అడవిఅంతా మార్మోగేలా అరుస్తున్నాడు. నరవానరం వాణ్ణి గాలిలో రెండు మూడుసార్లు తిప్పి పైకి ఎగరవేసింది. వాడు అరుస్తూ దూరంగా వున్న బండలమీద పడిపోయాడు.

పారిపోతూన్న రెండవ ఆటవికుడిమీదికి ఎగిరింది నల్లగూబ. అది తన కాళ్ళతో ముక్కుతో వాడి తలమీద పొడుస్తూ అరవ సాగింది. చిత్రమైన ఈ పోరాటం చూస్తున్న అందరూ పరమానందం పొందుతున్నారు.

అంతలో ధనపాలుడు తల వంకిస్తూ—"దాహం అవుతోంది. ఇక్కడ ఎక్కడైనా మంచినీళ్లు దొరుకుతాయా?" అని సైనికుణ్ణి అడిగాడు. ఆ మాట విన్న చతుర్నేత్రుడు- "తొందరపడి దాహం తీర్చుకునేందుకు పోతే ప్రాణమే పోవచ్చు. అవీ ఈ ద్వీపం లోని పరిస్థితి. నావెంట రండి. మీకు మంచి నీళ్ళ కొలను చూపిస్తాను" అన్నాడు.

అందరూ నడిచి కొలనుదగ్గరకు పోయారు. ఆ కొలను నిండా ఖడ్గమృగాలు తదితర క్రూరజంతువులూ ఈదులాడు తున్నాయి. ధనపాలుడు జాగ్రత్తగా ఒడ్డునే ఉండి దాహం తీర్చుకున్నాడు.

సమరసేనుడు కుంభాండుణ్ణి గురించి ధనపాలుడు చెప్పిన సంగతి ఆలో చిస్తున్నాడు. ద్వీపానికి దక్షిణాన వున్న కొండల అవతల్నించి బయలుదేరివస్తున్న వాళ్లు ఎవరై ఉంటారా అన్న అనుమానం అతడికి కలిగింది. కాని క్షణంలో వాళ్ళెవ రైందీ అతడు గ్రహించేశాడు. వాడు తప్పక కుంభాండుడై వుంటాడనీ, ఆటవికులను వెంటవేసుకొని ఆ ధనరాసులతో నిండివున్న నావకోసం బయలుదేరివుంటాడనీ అర్థమై పోయింది సమరసేనుడికి.


"చతుర్నేత్రా! అంతకీ ఆ ధనరాసులతోవున్న నావను కాపలా కాస్తూ ఒక నాగ కన్య ఉన్నమాట నిజమా, అబద్ధమా?" అని అడిగాడు సమరసేనుడు.

"ఇందులో అబద్ధం ఏమీలేదు. కావాలంటే నావెంట రండి. కాస్తదూరం నడిస్తే ఆ నావనూ, నాగకన్యనూకూడా చూపించగలను!" అన్నాడు చతుర్నేత్రుడు.

ముందుగా చతుర్నేత్రుడు దారితీశాడు. అతడి వెనక సమరసేనుడూ, సైనికులూ నడిచారు. కొద్దిసేపట్లో వాళ్ళు ఎత్తైన ఒక ప్రదేశం చేరారు. అది ఒకకొండ కొనలాగా ఉంది. అక్కణ్ణించి చూస్తే ప్రశాంతమైన సముద్రం కనబడుతోంది.


"అదిగో, నావ కనబడుతోందా?" అని చతుర్నేత్రుడు తన చూపుడువేలితో సముద్రంకేసి చూపుతూ సమరసేనుడిని అడిగాడు. సమరసేనుడూ, సైనికులూ అటుకేసి చూశారు. వారికి నావ స్పష్టంగా కనబడుతోంది. అది సముద్రంలో సగం మునిగిపోయినట్టుగామాత్రం వుంది. చిరిగిపోయిన తెరచాపలతో ఒకపక్కకు ఒరిగి అలలతోపాటు అదీ తేలియాడుతోంది. కాని కాపలాకాస్తూన్న నాగకన్యమాత్రం వాళ్ల దృష్టికి గోచరించలేదు.


"నాగకన్య కనబడదేం?" అంటూ ఆశ్చర్యంగా సమరసేనుడు చతుర్నేత్రుణ్ణి ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు చతుర్నేత్రుడు చిరునవ్వు నవ్వి—



"సమరసేనా, ఆ నాగకన్యకూడా నీ కళ్ళకు గోచరిస్తే ఇక మా మంత్రతంత్రాలు గడ్డిపోచకు కొరగావు. ఆ నాగకన్యను నేనూ, ఆ ఏకాకీ మాత్రమే చూడగలం. ఏకాకి ధనంమీది ఆశతో ఆమెమీద పగబట్టివున్నాడు, నేనేమో ఆమెను వరించివున్నాను" అన్నాడు.

సమరసేనుడికి తరవాత ఏమి అడిగేందుకూ పాలుపోలేదు. మునుపు తను ఆ ధనరాసుల సంగతి విన్నప్పుడు వాటిని వశపరుచుకుని కుండలినీద్వీపం చేర్చాలనుకున్నాడు. కాని అది తనవల్ల సాధ్యం కావని తెలుస్తూనేవుంది. పైగా యిప్పుడు





రాజద్రోహి కుంభాండుడుకూడా వాటికోసమే ప్రయత్నిస్తున్నాడు..తోడుగా ఏకాకిమాంత్రికుని బెడద వుండనేవుంది. అన్నిటికన్న, ఏ మంత్రశక్తి సహాయంలేకుండా ఆ నాగకన్య కాపలానుండి తప్పించుకుని ఆ నావను చేరటం అసంభవం!

సమరసేనుడు ఇలా ఆలోచిస్తున్నంతలో అది గ్రహించినవాడిలా చతుర్నేత్రుడు బిగ్గరగా నవ్వాడు.

"సమరసేనా! నీ ఊహలు నాకు తెలుస్తూనేవున్నాయి!" అన్నాడు చతుర్నేత్రుడు. "నాకూ ఈ క్షణంలో ఒక ఆలోచన కలిగింది. నీవేమో ఆ నావలోని ధనరాసులమీద ఒకకన్ను వేసేవుంచావని నేనెప్పుడో గ్రహించాను. ఆ ధనం విషయంలో మాత్రం నేను నీకు పోటీవాడిని కాను. నీ పోటీదారు ఆ ఏకాకిగాడే! కనుక మనం యిద్దరం కలిస్తే ఏమైనా సాధించగలమా అని నాఆలోచన!"

చతుర్నేత్రుడీ మాటలు ముగించేసరికి, సమరసేనుడికి ఎక్కడలేని ధైర్యమూ వచ్చింది. ఈ భయంకర ద్వీపంనుంచి ప్రాణాలతో బయటపడాలనుకుంటున్న ఆతడికి ఒక కొత్త ఆశ కలిగింది. రాజద్రోహి అయిన కుంభాండుణ్ణి హతమార్చాలి. వీలయితే ఆ నావలోని ధనరాసుల్నికూడా సంపాయించాలి. కాని ... ఆ ధనరాసులతో నావ సముద్రంలో ఏ కారణంచేత అలా వుండిపోయినట్టు? ..

సమరసేనుడికి ఈ రహస్యం తెలుసుకోవాలని ఉబలాటం కలిగింది.

'చతుర్నేత్రా! మాంత్రికులంటే సహజంగా ఏ మానవ ప్రాణిఅయినా భయపడక తప్పదు. కాని ఈ ద్వీపంలో వున్న మీకూ, ఏకాకిమాంత్రికుడికీ మధ్య ఎంతో వ్యత్యాసం వుంది. మీరు భూతదయ, సాధుపరాయణత్వం కలవాళ్లలా కనబడతారు. నేను చేయగలిగిన సహాయం ఏమైనావుంటే

చేస్తాను. కాని...ఒకటి, ఆ ధనరాసులతో నిండిన నావను గురించిన రహస్యం తెలుసుకోవాలని వుంది!" అని అడిగాడు సమరసేనుడు.

అందుకు చతుర్నేత్రుడు వెంటనే జవాబివ్వక కాసేపు తటపటాయించాడు.

"ఆ నావా, ధనరాసులూ, ఆ నాగకన్య కథ అంతా చెప్పాలంటే చాలావుంది. అంతా వినేందుకు నీకు కుతూహలంకూడా లేకపోవచ్చు. కొద్దిలో చెపుతాను—

"బహుశా నీవు శమనద్వీపం సంగతి వినివుండవు. ఒకవేళ వినివున్నా మీరు పిలిచే పేరు మరొకటి కావొచ్చు. ఇక... ఆ శమనద్వీపాన్ని కార్తేయుడు అన్న రాజు పాలిస్తూండేవాడు. కార్తేయుడంటేనే నీకు తెలిసివుండాలి... ఆయన చండికా భక్తుడు. మంత్ర తంత్ర విద్యల్లో అతడికి అతడే సాటి.

ఒకసారి దేవీ నవరాత్రి వుత్సవాలు జరుగుతున్నాయి. కార్తేయుడే స్వయంగా పూజ చేస్తున్నాడు. ఉన్నట్టుండి జనకోలాహలంమధ్యలో చండి పలికింది.

"భక్తులారా, మీ భక్తికి మెచ్చాను. కాని వట్టిపూజలతో నాకు తృప్తిలేదు. నాకు ఒక చక్కని దేవాలయం కట్టండి!" అంటూ హుంకరించింది చండీదేవి.

"తల్లీ, నీకు గొప్ప దేవాలయం కట్టాను. ఆకాశాన్నంటే గొప్ప గోపురం కట్టిస్తాను!" అన్నాడు కార్తేయుడు మోకరిల్లి. కాని చండీదేవి మళ్లీ ఇలా పలికింది—

"నా గుడీ, గోపురాలు మామూలు రాతితో, మట్టితో కడితే నాకు తృప్తి కలగదు. వెండి, బంగారాలతో కట్టించు, అప్పుడే నాకు తృప్తి!"

కార్తేయుడు వణికిపోయాడు. దేవి ఆజ్ఞను శిరసావహించవలసిందేగదా? పెద్ద గుడి గోపురాలకు సరిపోయే వెండి, బంగారాన్ని సంపాయించటం ఎలా?

—(ఇంకా వుంది)






## 9

[చతుర్నేత్రుడూ, సమరసేనుడూ సంభాషిస్తున్నప్పుడు, చాటునవుండి వింటూన్న ఆటవికులను సరవానరం, నల్లగూబా వెంటాడినై గదా? తరవాత సమరసేనుడు ధనరాసులతో ఉన్న నావా, కాపలాకాస్తున్న నాగకన్య వృత్తాంతం అడిగాడు. శమనద్వీపరాజైన శక్తియుడిని చండీదేవి కోరిన కోర్కె సంగతి చతుర్నేత్రుడు తెలియబరిచాడు. తరువాత—]

చతుర్నేత్రుడు చెప్పుతు పోతూన్న కథ వింటూన్న సమరసేనుడికి చాలా అబ్బురపాటు కలిగింది. చండీదేవి తన దేవాలయాన్ని మట్టితో, రాతితో కాక వెండి బంగారాలతో నిర్మించవలసిందని ఆజ్ఞాపించటం చాలా వింతగా కనబడింది.

దేవాలయాలను వెండి బంగారాలతో నిర్మించటం మానవమాత్రులకు సాధ్యమయే పనికాదుగదా!

"చతుర్నేత్రా! చండీదేవి అటువంటి దుస్సాధ్యమైన పని తన భక్తుణ్ణి సాధించమనటం నాకు చాలా ఆశ్చర్యం కలిగిస్తున్నది!" అన్నాడు సమరసేనుడు.

చతుర్నేత్రుడు తలవూపుతూ బిగ్గరగా నవ్వాడు.

"సమరసేనా! నీకు శక్తి ఉపాసన అంటే ఏమిటో తెలియదు. ఇహలోక సుఖాలనూ, తోటి మానవులమీద అధికారాన్ని కాంకించేవారే, యిలాంటి శక్తి ఉపాసకులవుతారు. దేవి వాళ్ళను కరుణించి ఆ శక్తులు ప్రసాదించేముందు, వాళ్ళ ధైర్యసాహసాలనే కాక, తనమీది భక్తి బలాన్ని




కూడా పరీక్షిస్తుంది. మా రాజయిన శాక్తేయుణ్ణికూడా చండీదేవి యిలాంటి కఠిన పరీక్షకే గురిచేసింది."

"అయితే అంత వెండి బంగారాలను సాధించగలిగాడా?" అని అడిగాడు సమరసేనుడు. అందుకు చతుర్నేత్రుడు—

"అదే నేను చెప్పబోతున్న కథ. ఆ ధనరాసులతో నిండివున్న నావా, దాన్ని కాపలా కాస్తున్న నాగకన్య వృత్తాంతమంతా యిందులోనే ఇమిడివున్నది. నేనూ, ఏకాకి మాంత్రికుడు కూడా యింత బద్ధ శత్రువు లంకావటానికి కారణాలు కూడా వివరిస్తాను. ఇంతకూ మూలం; ఆ శమనద్వీపంలోని చండీదేవి కోరినకోరికా, దానికి శాక్తేయుడు తల వూపటమూనూ.

సరే, శాక్తేయుడు దేవికోర్కెను నెరవేర్చాలని నిశ్చయించుకున్నాడు. ఒక విధంగా చూస్తే, అది కోర్కె అనేకన్న దేవి ఆజ్ఞగానే భావించాలి. శాక్తేయుడు అంత వెండి బంగారం సంపాయించాలంటే, మీ మాదిరిగానే పర రాజ్యాలమీదికి దాడి వెడలటంకన్న మరో మార్గం లేదుకదా?

ఇక శాక్తేయుడు సైనికులకోసం దేశం నలుమూలలా గాలించసాగాడు. మంచి దేహబలం ధైర్యసాహసాలూగల యువకుల్ని వీరి సైన్యంలో చేర్చుకో ప్రారంభించాడు. ఒక్కొ గ్రామం వెళ్ళటం, అక్కడ వున్న యువకులందరినీ పోగుచేసి, మల్లయుద్ధం, కత్తి, కర్రసాముల్లో పోటీలు పెట్టేవాడు. ఇలాంటి పోటీల్లో నెగ్గిన కొద్దిమందిని మాత్రమే సైనికులుగా స్వీకరించేవాడు.

శాక్తేయుడు యీవిధంగా సైనికుల్ని సమాయత్త పరిచేనాటికి నేను యిరవైఏళ్ల ప్రాయంగల యువకుణ్ణి. ఈ ఏకాకికూడా నా వయసువాడే కాక, నేను వుండే పల్లెలోనే వుండేవాడు.


పోతే, యిక్కడ ఏకాకికీ నాకూ వున్న బాల్యవిరోధం సంగతి చెప్పక తప్పదు.


బాల్యంలో కలిగిన ఆ శత్రుభావమే అనేక దుశ్చర్యలకు దారితీసి, చివరకు యీ ద్వీపం మానవవాసయోగ్యం కాకుండా చేసింది. అనాటికి ఏకాకి నిజంగా ఏకాకి కాదు. యీ ద్వీపం చేరినతరవాతే నా బంటు ఉలూకుడివల్ల ఆ ఏకాకితనం ప్రాప్తించింది.

ఏకాకీ నేనూ ఒకే పల్లెవాసులం అని చెప్పానుగదా? ఆ పల్లెలో మా యిద్దరి యిళ్ళూ యిరుగుపొరుగులనే వుండేవి. అందుచేతనే మాలో మొదటినించీ స్నేహ భావంకన్న, శత్రుభావమే ఎక్కువపాలు వుండేది. కాని అది యింత తీవ్రదశకు రావటానికి చాలా కాలం పట్టింది.

నేనూ, ఏకాకీకూడా మా ఆరవ ఏటి నుంచి పశువులకాపరులుగా జీవితం ప్రారంభించాం. మా పల్లెపెద్ద అయిన పతంగుడి మేకలను అడవిలో మేపుకు రావటం మా పని. అప్పటికి మేము చాలా చిన్నవాళ్లం కావటంవల్ల అడవిలో వేటాడటానికి మాకు అర్హతలేదు. వయసువచ్చినవాళ్ళూ, దృఢకాయులూ మాత్రమే వేటకు వెళ్ళేవారు.

ఒకనాడు నేనూ, ఏకాకీ మరికొందరు కుర్రవాళ్లం మేకలను అడవికి తోలుకు పోయాం. ఆ ప్రాంతమంతా చాలా దట్టమైన చెట్లతో క్రిక్కిరిసి వుంటుంది. పైగా అది పెద్దపులులకూ, సింహాలకే కాక, ప్రతి






క్రూరమృగానికీ ఉనికి. అయినా పశువులను మేపేందుకు అంతకన్న మంచి ప్రదేశం మా పల్లెప్రాంతాల్లో లేదు.

మేకలను దూరంగా వదిలి, కాపరుల మందరమూ ఒక చెట్టుకింద కూర్చున్నాం. వున్నట్టుండి ఒక అందమైన లేడిపిల్ల నాకు సంబంధించిన మేకలవద్దకు వచ్చి అరవ సాగింది. బహుశా అది తన తల్లినుంచి వేరుపడి యిలా వచ్చివుంటుంది.

ఆ లేడిపిల్లను చూడగానే దాన్ని పట్టుకుని మచ్చిక చేయాలనిపించింది. లేచి ఒక్క గంతులో అక్కడికి వెళ్ళాను. యీలోపల ఏకాకికూడా ఆ లేడిపిల్లను చూచాడు. "ముందు నేను చూచాను, ఆ లేడిపిల్ల నాదే!" అంటూ నా వెనకనే పరిగెత్తుకుంటూ వచ్చాడు.

నేనుమాత్రం ముందువెళ్ళి ఆ పిల్లను పట్టుకున్నాను. నా దగ్గిరవున్న తాడును దాని మెడకు తగిలించి లాక్కురా ప్రయత్నిస్తున్నాను. యింతలో ఏకాకి నన్ను సమీపించి, లేడిపిల్ల నాది అంటూ నామీద కలియబడ్డాడు. నేను పట్టరాని రోషం వచ్చి అక్కడవున్న ఒక పెద్దరాతిని ఎత్తి అతడి తలమీద కొట్టాను. అరుస్తూ ఏకాకి కింద పడిపోయాడు.

ఈలోపల లేడిపిల్ల మెడకువున్న తాడుతో పారిపోసాగింది. నేను వెంటపడ్డాను. చెట్లల్లో తుప్పల్లో పరిగెత్తి పరిగెత్తి ఆఖరికి ఎలాఅయితేనేం దాన్ని పట్టుకున్నాను. అప్పటికే నేను బాగా అలసిపోయివున్నాను. లేడిపిల్ల నానుంచి పారిపోయేందుకు గుంజుకోసాగింది. నేనూ పట్టువదలకుండా వుండేందుకు పెనగులాడుతున్నాను.

ఆ పరిస్థితుల్లో నా గుండెలు అవిసేలా సింహగర్జన వినబడింది. అదీచాలా సమీపం నుంచే. నేను ఒక్క గంతులో లేడిపిల్లను దాపులనున్న ఒక చెట్టుకు కట్టివేసి, చెట్టు కొమ్మలలోకి ఎగబాకాను.


అక్కడ కాస్త స్థిమితం చిక్కినతరవాత గాని నేను చేసిన పొరపాటు నాకు అర్థం కాలేదు. చెట్టుకు కట్టివేయబడిన లేడిపిల్ల మెడతాడు గుంజుకుంటూ అరవసాగింది. ఒకవేళ సింహం దూరంగా పోతూవున్నా యీ అరుపు విని తప్పక ఆ ప్రదేశానికి వస్తుందని నాకు భయంకలిగింది. ఒకటి రెండు నిమిషాల్లో సింహం అక్కడికి రానేవచ్చింది.

చెట్లకొమ్మల్లో కూర్చున్న నాకు ప్రాణభయంలేదు. కాని కిందవున్న లేడిపిల్లమీదికి సింహం లంఘించింది. ప్రాణభయంతో అరుస్తూన్న లేడిపిల్లనుచూచి నేను వూరుకోలేకపోయాను. చెట్టున ఎండివున్న ఒక కొమ్మ విరిచి సింహంమీదికి విసిరాను. అదీ పెద్ద పొరపాటే-అప్పుడే సింహం తలఎత్తి నన్ను చూచింది.

సింహం ముందు లేడిపిల్లను చంపి తినగలిగినంత తిన్నది. అలా తింటూనే మధ్య మధ్య తల ఎత్తి నావంక చూడసాగింది. చివరకు చెట్టుమీదవున్న నన్ను పట్టాలని పైకి ఎగిరింది. నేను దానికి అందకుండా మరికాస్త పైకి పోయాను.

అయినా సింహం తనప్రయత్నాన్ని మానలేదు. సూర్యాస్తమయం అయేవరకు అది చెట్టుకిందనే కాపలావేసి కూర్చున్నది.





ఆ రాత్రి నాకు కునుకు పట్టలేదు. తెల్లవారికూడా నేను చెట్టుమీదినుంచి దిగటానికి జంకుపుట్టింది. సింహం చెట్టుకింద లేకపోయినా ఆ ప్రాంతాల్లోనే తిరుగుతూ వుంటుందని నాకు తెలుసు. అప్పుడప్పుడూ దాని గర్జన వినపడుతూకూడా వున్నది.

ఆ రోజు మిట్టమధ్యాహ్నం అయేసరికి నా కర్ణపుటాలు బద్దలయేలా తప్పెటల మోత వినబడింది. అది మా పల్లెవాసులు నాకోసం వెతికేందుకు బయలుదేరారన్న దానికి సూచన! నాతోటి పశులకాపరులు నేను అడవిలోనుంచి తిరిగిరాలేదని పల్లెలో తెలియబరచివుంటారు.

తప్పెటల మోత క్రమంగా సమీపించ సాగింది. ఇక చెట్టు దిగి వాళ్లకు ఎదురు వెళ్లామనుకున్నానుగాని నాకు గుండెధైర్యం లేకపోయింది. నిన్నటి సింహం యింకా ఆ ప్రాంతాన కాపలావేసివుంటుందన్న అనుమానం నాకు వదలలేదు.

బరిసెలూ, యీటెలూ ధరించిన ఒక నలభై యాభై మంది మా పల్లెవాసులు అడవి మార్మోగేలా అరుస్తూ వస్తున్నారు. కొందరు తప్పెటలు వాయిస్తున్నారు. అందరూ సరిగా నేను ఉన్న చెట్టుకు ఒక యాభైగజాల దూరంలోకి వచ్చారు.



సింహాన్నిగురించి నేను అనుమానించినది నిజమేఅయింది. పొదలమాటున దాగివున్న సింహం హఠాత్తుగా వాళ్ళమీదకు లంఘించింది. ఇలాంటిది సంభవమే అని తగుజాగ్రత్తతో వస్తున్నారు మా పల్లెవాసులు.

సింహం మీదికి దూకినా వాళ్లు పారిపోలేదు. దృఢకాయుడైన ఒక యువకుడు సింహం పంజాదెబ్బను తన చేతులోవున్న పొడవాటి కొయ్యడాలుతో కాచుకున్నాడు. అదేసమయంలో మరిఒకయువకుడు వెనుకనుంచి దాని తోకను వడిసి పట్టుకొన్నాడు.

సింహం గర్జిస్తూ వెనుకకు తిరుగబోయింది. ఇంతలో మొదటి యువకుడు

తన చేతనున్న బరిసెతో దాని మెడమీద బలంగా పొడిచాడు. దెబ్బతిన్న సింహం అరుస్తూ మళ్ళీ ముందుకు దూకబోయే సరికి, తోక పట్టుకొనివున్న యువకుడు తన దగ్గిరవున్న చిన్నకత్తితో వెనకనుంచి దాని వెన్నుమీద పొడిచాడు.

సింహం బాగా గాయపడిపోయింది. ఆ యువకులిద్దరూ చేరి దాన్ని తమచేతనున్న ఆయుధాలతో ఎడా పెడా పొడిచారు. సింహం నేలకు ఒరిగిపోయింది. చెట్టు కొమ్మల్లో వుండి యిదంతా పరికిస్తున్న నాకు పట్టరాని సంతోషం కలిగింది. గబగబ చెట్టు దిగుతూ పెద్దగా కేకపెట్టాను.

ఆ క్షణంలో జరిగిన వింత కళ్ళారా చూసిన నేనే నమ్మలేకపోయానంటే, లోకంలో ఎవరూ నమ్మరు. నేను అలా కేకపెట్టేసరికి అందరి దృష్టి ఒక్కసారిగా నామీద లగ్నమైంది. మరుక్షణంలోకే తప్పెటవాయిస్తూ ముందువున్న ఏకాకి 'దయ్యాం, దయ్యాం' అంటూ పరిగెత్త సాగాడు. కన్నుమూసి తెరిచేలంతలో అంత మంది జనం 'దయ్యాం, దయ్యాం,' అంటూ పరుగు లంకించుకున్నారు."

"ఇది చాలా చిత్రంగావుంది! మిమ్మల్ని చూసి అంతమంది పెద్దవాళ్ళుకూడా దయ్యాం అని ఎందుకు పరిగెత్తటం సంభవించింది?" అని అడిగాడు సమరసేనుడు.

అందుకు చతుర్నేత్రుడు నొసలు చిట్లించి తల పంకిస్తూ యిలా అన్నాడు.

"ఇదంతా ఏకాకిచేసిన మోసం! అంత చిన్న వయసులోనే అతడెంత కల్మషబుద్ధి కలవాడో యీ ఒక్క సంఘటనా తెలియ జెబుతుంది. మా పల్లెలోని పిన్న పెద్ద లందర్నీ నేను దయ్యాన్నని నమ్మించగలి గాడు. తరవాత పది సంవత్సరాలవరకూ నేను దయ్యంగానే అడవుల్లో తిరుగుతూ బ్రతకవలసి వచ్చింది."

—(ఇంకావుంది)






## 10

[చతుర్నేత్రుడు తననూ ఏకాకికీ వున్న బాల్యవిరోధం, సమరసేనుడికి తెలిపాడుకదా? ఇద్దరం ఒకే ఊరివాళ్లమనీ, ఒకనాడు ఒక లేడిపిల్లకోసం మేము తగూలాడామనీ చెప్పాడు. సింహం ఎదుర్కొనగా, చెట్టుమీద దాక్కున్న తనను, పల్లెవాసులు 'దయ్యం' అనుకుని పారిపోవటం—తెల్లవారేసరికి, కొండకింద కోలాహలం వినబడింది. తరవాత—]

చతుర్నేత్రుడు, తనమీద ఏకాకి ప్రయోగించిన మాయోపాయాన్ని గురించి చెప్పేటంతలో కొండదిగువను పెద్ద కోలాహలం బయలుదేరింది. సమరసేనుడూ, సైనికులూ ఆ ధ్వని వచ్చినవేపు తలలు తిప్పారు.

అప్పటికి సూర్యాస్తమయం అయి కొద్ది సేపే అయింది. ఆ కొండప్రాంతం అంతా నల్లని చీకటి కమ్ముకుంటోంది. సమరసేనుడికి దూరంగా మనుషులు అరవటం తప్ప, వాళ్ళు ఎక్కడ వున్నదీ, ఎటుకేసి నడుస్తున్నదీ దృష్టిగోచరం కాలేదు.

అంతలో ఏకాకి మాంత్రికుడి కంచుకంఠం వినబడింది. 'కాలభుజంగా, కపాలా!' అని అరుస్తున్నాడు ఏకాకి.

చతుర్నేత్రుడు ఒక్క తృటికాలం అటుకేసి దృష్టిసారించి—"సమరసేనా! ఒక వైపునుంచి మీ కుండలినీ మనుషులు, రెండో వైపునుంచి ఏకాకీ వస్తున్నారు. నావా, నాగకన్య కథ తరవాత చెప్తాను. ముందు వాళ్ళ కంటబడకుండా తప్పుకుపోవటం అన్నివిధాలా మనకు క్షేమమైన పని," అన్నాడు.




సమరసేనుడికి ఆ పరిస్థితుల్లో అంత కంటె చేయదగింది ఏమీ లేదనిపించింది. 'కుండలినీ మనుషులు' అనటంలోనే— వాళ్ళు ద్రోహి కుంభాండుడూ, వాడి నాయకత్వంకింద వున్న ఆటవికులూ అని సమరసేనుడికి అర్థమైపోయింది.

"అరుగో, వాళ్ళు యిటే వస్తున్నారు. కొండ ఎక్కుతున్నారు!" అంటూ చతుర్నేత్రుడు తన చూపుడువేలిని కొండదిగువ ప్రాంతానికేసి ఎత్తాడు. సమరసేనుడూ, సైనికులూ అటుకేసి చూశారు. దాదాపు నలభై యాభైమంది మనుషులు దివిటీలు పట్టుకొని అరుస్తూ కొండ ఎక్కుతున్నారు.

"ఇప్పుడు కర్తవ్యం ఏమిటి చతుర్నేత్రా?" అని అడిగాడు సమరసేనుడు. "ఆ ఒక్క కుంభాండుడినే అయితే, నావద్ద వున్న యీ ఐదుగురు సైనికులతోనే ఎదుర్కొగలను. సుశిక్షితులైన నా సైనికుల బాణాలధాటికి ఆ ఆటవికులు నిలబడలేరు. కాని యీ ఏకాకి సంగతి..."

"సరే, ఆ ఏకాకిపని నాకు వదులు," అన్నాడు చతుర్నేత్రుడు. "కాని, ఒక్క విషయం గుర్తుంచుకో. నువ్వు యిప్పుడే— యీ చీకట్లో కుంభాండుడిని ఎదుర్కోవటం అంత మంచిదికాదేమో. పైగా ఏకాకికంట వాటుపడితే, నీవు చేయాలనుకున్న సంహారం అతడే చేస్తాడు."

చతుర్నేత్రుడి అంచనా నిజమని ధృవపడేందుకు ఎంతోకాలం పట్టలేదు. వుత్సాహంతో కేకలువేస్తూవస్తూన్న ఆటవికులనూ, ముందుండి నడుపుతూన్న కుంభాండుణ్ణీ ఏకాకి ఎదురై అటకాయించాడు.

"ఇదీ కథ! యీక్షణం ఎప్పుడొస్తుందా అని నేను చూస్తున్నాను," అంటూ సమరసేనుడు పట్టరాని సంతోషంతో అన్నాడు. కాని చతుర్నేత్రుడు తలపంకిస్తూ—

"సమరసేనా! తొందరపడి లేనిపోని ఆశలకు పోకు. ధనరాసులతో వున్న నావా,

నాగకన్య వృత్తాంతం నీకు సరిగా తెలియదు. వాటిని గురించిన నిగూఢరహస్యం అఖరికి నీకయినా నేను ముందుగా చెప్ప లేను. పైగా ఏకాకి వదరుబోతు అయినా, కేవలం బుద్ధిహీనుడు మాత్రం కాదు. ఆ కనబడే పెద్ద బండరాతివెనక దాక్కుందాం, పదండి," అన్నాడు.

చీకట్లో తడబడుతూ సమరసేనుడూ, సైనికులూ చతుర్నేత్రుడిని అనుసరించి నడిచారు. కొద్దిక్షణాల్లోనే వాళ్ళంతా కుంభాండుడు ఆటవికులతో వున్నచోటుకు దాపులనే ఒక పెద్ద రాతివెనక దాక్కున్నారు.

ఏకాకిని చూడగానే, కుంభాండుడు భయకంపితుడయ్యాడు. అతడి వెంట వస్తూన్న ఆటవికులు పారిపోయేందుకు తయారయేంతలో ఏకాకి పకపకనవ్వుతూ–

"మీరంతా వున్నచోటునుంచి కదిలారో మరణం తప్పదు. నాదృష్టిలో పడినప్రాణి, నా ఆజ్ఞ లేనిదే కదిలేందుకు వీలులేదు. కాలభుజంగా, కపాలా! వీళ్ళని చుట్టుముట్టండి," అంటూ ఆజ్ఞయిచ్చాడు.

వెంటనే కాలభుజంగం ముందుకుదూకి బుసలుకొడుతూ ఆటవికుల చుట్టూ తిరగసాగింది. కపాలం గాలిలో కదుల్తూ వాళ్ళ తలలపై ఆడసాగింది.






"మీరెవరు? ఈ ప్రయాణం ఎక్కడికి?" అని గర్జిస్తూ ప్రశ్నించాడు ఏకాకి.

ఆ ప్రశ్నతో కుంభాండుడు తత్తర పడ్డాడు. అతడికి నిజంచెప్పాలో, లేక అబద్ధంచెప్పి తప్పించుకోవచ్చో తెలిసింది కాదు. ఈ ద్వీపంలోవున్న మాంత్రికులను గురించి ఆటవికులద్వారా వినివున్నా, చూడటం యిదే మొదలు.

"నేను యీ ఆటవికులకు రాజును. నాపేరు కుంభాండుడు" అని మాత్రం చెప్పగలిగాడు కుంభాండుడు.

"మరి యీ ప్రయాణం?" అంటూ కన్నెర్రచేశాడు ఏకాకి.

ఇక నిజం చెప్పక తప్పదనిపించింది కుంభాండుడికి. ఒకవేళ తను నిజందాచినా, భయంతో వణికిపోతూన్న ఆటవికులు నిజం చెప్పక మానరు అనుకున్నాడు.

"ఈ కొండశిఖరం మీదినుంచి చూస్తే, సముద్రంలో ఒక నావ కనబడుతుందని విన్నాను. దానిని చూచేందుకు వెళ్తు న్నాను." అన్నాడు కుంభాండుడు భయాన్ని అణచుకుంటూ.

ఈ మాటలకు ఏకాకి బిగ్గరగా నవ్వాడు. అతడికి యీ ఆటవికులూ, కుంభాండుడూ ఎక్కడికి, ఎందుకు వెళ్తున్నారో తెలుసు.

"ఈ చీకటిలో కేవలం నావను చూచేందుకు యీ కొండశిఖరం ఎక్కు తున్నావన్నమాట? ఆహా-నీ తెలివితేటలు అమోఘం. నీకు యీ అనాగరిక ఆటవికుల మీద రాజరికంకన్న, దేవతలందరిపైనా ఇంద్రపదవిలాంటిది తగినపని. నిజంచెప్పు, నీవు ఆ నావలోని ధనరాసులకోసంకదా బయలుదేరింది?" అని నిలవేసినట్లు అడి గాడు ఏకాకి.


కుంభాండుడు నీళ్లు నములుతూన్నట్టు కాసేపు వూరుకున్నాడు. 'అవునా, కాదా?' అని ఏకాకి మరోసారి గద్దించి అడిగాడు. కుంభాండుడు నివ్వెరపడుతూ 'అవును,'

అన్నాడు. అప్పుడు ఏకాక్షి శాంతధోరణిలో యిలా అన్నాడు.

"ఈ ద్వీపంలో చాలా రోజులకిందట నేను ఐదారుగురు మనుషులను చూచాను. దుస్తుల తీరునుబట్టి వాళ్ళు నీలాగేవున్నారు వాళ్ళూ నీమాదిరిగానే ఆ నావలోని ధనరాసులకోసం బయలుదేరినట్టుంది. నువ్వూ ఆ ముఠాకు చెందిన వాడివేనా?"

ఆసరికి కుంభాండుడికి ఏకాక్షి చూసిన మనుష్యులు ఎవరైందీ అర్థమైపోయింది తనకన్న ముందుగా కుండలినీ రాజ్యం నుంచి బయలుదేరిన సమరసేనుడూ, అతడి సైనికులూ అయివుంటారని గ్రహించాడు. అలాంటి భావం కలగ్గానే అతడికి భయం, క్రోధంకూడా ఒక్కసారిగా కలిగినై. వాళ్ళను హతమార్చితేతప్ప లేకపోతే తనకు ప్రమాదం తప్పదని అనుకున్నాడు.


"వారెవరైందీ నాకు తెలుసు!" అన్నాడు కుంభాండుడు కోపంగా. "వాళ్లు యీ ద్వీపం చేరారని తెలిసే, నేను వాళ్ళను హతమార్చటానికి బయలుదేరాను. ధనాశాపరులైన ఆ ద్రోహులు తప్పక ఆ నావకోసం వెతుకుతూవుంటారనే నేను ఇటువచ్చాను. దారిలో మీరు తారసపడ్డారు!" అన్నాడు కుంభాండుడు నిజాన్ని కప్పిపుచ్చుతూ.



వాళ్ళ సంభాషణ వింటూవున్న చతుర్నేత్రుడు, ఇదే మంచి సమయమనుకొని—

"ఉలూకా, నరవానరా!" అంటూ దాక్కున్న చోటునుంచి బయటికి వురికాడు. సమరసేనుడూ, సైనికులూ బాణాలు ఎక్కుపెట్టి కుంభాండుడి మీదా, ఆటవికులమీదా అంబుల వర్షం కురిపించారు.

'ఉలూకా' అన్నమాట వినబడగానే ఏకాక్షి నివ్వెరపాటుచెంది చుట్టూ కలయ చూచాడు. బాణాలు తాకిన కొందరు ఆటవికులు అరుస్తూ కింద పడిపోయారు. కుంభాండుడు వున్నచోటునుంచి ఒక్క గంతువేసి కొండదిగువకు పరుగెత్తసాగాడు.





అలా ప్రాణభయంతో పారిపోతూన్న అటవికులనూ, కుంభాండుడినీ సమరసేనుడూ, సైనికులూ వెంబడించారు. చీకటివల్ల బాణాలు గురిపెట్టి కొట్టేందుకు సైనికులకు వీలు కలగటంలేదు. 'ఆగండి, ఆగండి,' అంటూ కుంభాండుడు అటవికులను పారిపోకుండా నిలబెట్టాలని కేకలు వేస్తున్నాడు.

అక్కడ ఉలూకుడి పేరువిని అదిరిపడిన ఏకాకి అంతలోనే స్తిమితపడి కత్తితిప్పుతూ ఒకటి రెండు అడుగులు ముందుకువేసి పళ్ళుకొరుకుతూ యిలా హుంకరించాడు:

"ఈసరికి నువ్వు వట్టి వాజమ్మవని తెలిసిపోయింది. మంత్ర తంత్ర విద్యల్లో లోకంలో నిన్నుమించినవాడు లేడని గర్వపడే నువ్వు, యీ మానవమాత్రుల బాణాల సహాయంతో నన్ను జయించాలని చూస్తున్నావు. నీ మిత్రులందరినీ నరికి పోగులు పెట్టేందుకు ఆ అటవికులు చాలు!"

చతుర్నేత్రుడు రెప్పవాల్చకుండా ఒక్కక్షణకాలం ఏకాకివంక చూస్తూ ఊరుకున్నాడు. కొండకింద కుంభాండుడి కేకలూ, అటవికుల అరుపులూ వినబడుతున్నవి. ఒకవేళ సమరసేనుడి కేమయినా ప్రమాదం కలగనున్నదేమో అన్న అనుమానం కలిగింది చతుర్నేత్రుడికి. అతడు వెంటనే అక్కడికి వెళ్ళటం మంచిదనుకొన్నాడు.

"ఏకాకీ, నీ వదరుబోతు మాటలకు జవాబుచెప్పే తీరిక నాకు లేదు. అంతేకాక మన భృత్యులమధ్య పోరాటంవల్ల కలిగే ఫలితంకూడా ఏమీలేదు. నీ కత్తులూ కటారులూ నన్నేమీ చేయలేవని నీకు తెలియందికాదు. ఆరోజు వస్తుంది—నువ్వో నేనో తేలిపోతుంది! అప్పటివరకూ కేవలం మాటలవల్ల లాభంలేదు," అన్నాడు చతుర్నేత్రుడు.

ఆ వెంటనే తన కుచ్చుటోపీని చేతితో తాకాడు. మరుక్షణంలో అతడు సమరసేనుడికీ, కుంభాండుడికీ జరుగుతున్న

భయంకరమైన కత్తియుద్ధం దగ్గరకు వచ్చారు. ఒకవైపున ఆటవికులు బరిశెలూ, ఈటెలూ విసురుతూ ముందుకు వస్తున్నారు. సమరసేనుడి సైనికులు తమ బాణాలతో వారిని గాయపరుస్తూ ముందుకు రాకుండా అటంకపరుస్తున్నారు.

ఇక సమరసేనుడూ, కుంభాండుడూ ఆ యుద్ధరంగం మధ్య కత్తులతో పోరాడుతున్నారు. అప్పటికి చంద్రోదయమై చక్కని వెన్నెల కాస్తోంది. గాయపడిన కొందరు ఆటవికులు ఆహాకారాలు వేస్తున్నారు. ఆ ప్రాంతమంతా అరుపులతో, కేకలతో ప్రతిధ్వనించిపోతోంది.


చతుర్నేత్రుడు యీ పరిస్థితుల్లో ఏమి చేయాలా అని ఆలోచిస్తున్నాడు. కొద్ది సేపట్లో అక్కడికి ఏకాకి వచ్చితీరుతాడని అతడికి తోచింది. కనుక యీ లోపలే కుంభాండుణ్ణీ, ఆటవికుల్ని హతమార్చటం మంచిదనుకున్నాడు.

ఒకవేళ అది సాధ్యంకాకపోతే సమరసేనుణ్ణీ, సైనికులనైనా సురక్షిత ప్రదేశాలకు చేర్చి, తరువాత పరిస్థితి ఆలోచించటం వుత్తమం అనుకున్నాడు.

కాని యింతలో భయంకరమైన తోడేళ్ల అరుపులు వినబడినై. వెన్నెలరాత్రి ఆహారం కోసం బయలుదేరిన తోడేళ్ళగుంపు నెత్తురు వాసన పసికట్టి అటువైపే పరుగెత్తివస్తోంది.

తోడేళ్ళగుంపు అరుస్తూ కొండరాళ్ళ మీంచి, చెట్లపొదల్లోంచి పరుగెత్తిరావటం అందరూ చూచారు. యుద్ధంచేసి శత్రువులను హతమార్చేలోపల ఆ గుంపు తమనే హతమార్చగలదని అందరూ గ్రహించారు. వెంటనే పోరాడుతూన్న ఆటవికులూ, సైనికులూ పోరాటం మాని అక్కడినించి పారిపోసాగారు. కుంభాండుడూ, సమరసేనుడూ కూడా పోరాటం మాని వాళ్ళవాళ్ళ అనుచరులు పారిపోతూన్న దిక్కుకేసి పరుగు ప్రారంభించారు. —(ఇంకా వుంది)






## 11

[చతుర్నేత్రుడూ, సమరసేనుడూ కొండపైన వుండగా, ఆ ప్రాంతానికి వచ్చిన ఏకాక్షిమాంత్రికుడు. కుంభాండుణ్ణి అడ్డగించాడు. సమరసేనుడు, కుంభాండుడి మీదా, అతడి ఆటవికుల మీదా దాడి చేశాడు. ఆటవికులు కొందరు మరణించారు. నెత్తురువాసన పసిగట్టిన తోడేళ్ళ గుంపు ఒకటి ఆటురాగానే, అందరూ చెల్లాచెదురుగా పారిపోసాగారు. తరవాత—]

సమరసేనుడూ, సైనికులూ కొంతదూరం పరిగెత్తి, ఒక చోట ఆగారు. దూరంగా కుంభాండుడి ఆటవికుల కేకలు వినబడుతున్నవి. వాళ్ళు, తమ వెంటపడడం మాని, తోడేళ్ళ నుంచి ప్రాణరక్షణకు, దిగువనున్న అడవికేసి పారిపోతున్నారని, సమరసేనుడు గ్రహించాడు. మాంత్రికుల జాడలేదు. తోడేళ్ళు మాత్రం యింకా భయంకరంగా అరుస్తూనే వున్నవి.

అలిసిపోయిన సైనికులతోపాటు సమరసేనుడు ఒక చెట్టు కింద విశ్రమించాడు. ఆలోచించగా—కుంభాండుడు కూడా ధనరాసులున్న నావను వశపరచుకోవాలని గట్టి ప్రయత్నం ప్రారంభించాడని, సమరసేనుడికి అర్థమైంది. ఇక యిప్పుడు ఆ నావ కోసం ఆరాటపడేవాళ్ళు నలుగురయ్యారన్నమాట: తనూ, కుంభాండుడూ, ఏకాక్షి, చతుర్నేత్రుడూ!



సమరసేనుడు యిలాంటి ఆలోచనలలో వుండగా, సైనికులు మాత్రం తమ ద్వీపానికి ఎంత త్వరగా పోదామా అన్న ఆతృతలో వున్నారు.

"సేనానీ, మనం యీ భయంకర ద్వీపాన్ని త్వరగా వదిలిపోవడం మంచిది. అందుకు తగిన ప్రయత్నాలు చేయండి," అన్నాడొక సైనికుడు.

మేం అందరం కోరేది అదేనన్నట్టుగా మిగతా సైనికులు తలలు వూపారు. ఇది గమనించిన సమరసేనుడు, సైనికులతో, "తొందరపడకండి. ఈ ద్వీపాన్ని వదిలిపోవడం క్షేమం అని ఏనాడో నిర్ణయించుకున్నాం. దాన్ని గురించి పదేపదే అనుకుని ప్రయోజనం లేదు. అసలు ప్రశ్న, యీ ద్వీపాన్ని వదిలిపోయేందుకు మార్గం ఏమిటన్నది," అన్నాడు.

ద్వీపాన్ని వదిలిపోయే మార్గం ఏమిటో సైనికులకూ తెలియదు. తాము సముద్ర తీరంలో వదిలివచ్చిన ఓడలు ఏ స్థితిలో వున్నవో వారెరగరు. ఏకాక్ష మాంత్రికుడి నుంచీ, కుంభాదుడి నుంచీ ప్రమాదం కలగకుండా చూసుకోవాలి. వాళ్ళ కంట బడకుండా తప్పించుకుపోవాలి.

"మనం యిక్కడి నుంచి తప్పించుకుపోయేందుకు చతుర్నేత్రుడు సాయపడ లేడా?" అని ఒక సైనికుడు, సమరసేనుణ్ణి అడిగాడు.

ఆ ప్రశ్నకు ఏమని జవాబివ్వాలో సమరసేనుడికి తెలిసింది కాదు. తమను యీ భయంకర ద్వీపం నుంచి, కుండలినీ ద్వీపం చేర్చమని చతుర్నేత్రుణ్ణి అర్థించడం వివేకం అవుతుందా? అంతే కాక, ఆ పని చతుర్నేత్రుడికైనా సాధ్యమా అన్న అనుమానం కూడా, సమరసేనుడికి కలిగింది.

అందరూ యిలాంటి ఆలోచనల్లో వుండగా, ఎక్కడి నుంచో రివ్వుమంటూ ఒక బాణం వచ్చి, సమరసేనుడి తలకు ఒక అడుగు ఎత్తులో, చెట్టులో దిగబడి గుచ్చుకుపోయింది.

ఆ మరుక్షణం సమరసేనుడు ఎగిరి నిలబడి, "అందరూ చెట్ల వెనకకు తప్పుకోండి. ద్రోహి కుంభాండుడు ఎక్కడో పొంచి వుండి, మనను హతమార్చాలని చూస్తున్నాడు," అంటూ దాపులనున్న చెట్ల గుంపు కేసి పరిగెత్తసాగాడు.

సైనికులు తమ నాయకుణ్ణి అనుసరించి పరిగెత్తారు. ఆ మరుక్షణం, "పట్టుకోండి! ప్రాణాలతో వదలకండి!" అన్న కుంభాండుడి కేకలు వినిపించాయి.

ఈటెలు పట్టిన ఆటవికులు అడవి దద్దరిల్లేలా అరుస్తూ, చెట్లమాటు నుంచి బయటికి రాసాగారు.

సమరసేనుడు తాను చాలా ప్రమాదంలో చిక్కుకున్నానని గ్రహించాడు. తన వెంట వున్న ఐదుగురు సైనికులతో, అన్ని వైపుల నుంచీ చుట్టుముట్టి జొస్తున్న ఆటవికుల్ని ఎదుర్కోవడం క్షేమం కాదు. కుంభాండుడు, ఆటవికుల్ని హెచ్చరిస్తూ వెంట తగులుతున్నాడు.

గుబురుగా పెరిగిన చెట్ల నీడల్లో దాగుతూ, వీలయినప్పుడు పరిగెత్తుతూ, సమరసేనుడూ, సైనికులూ కొంత దూరం వెళ్ళారు. ఆ సరికి చంద్రకాంతి తగ్గిపోయి, క్రమంగా చీకట్లు అవరిస్తూండడం వల్ల, సమరసేనుడికి, కుంభాండుడి కంట బడకుండా తప్పించుకుపోవడం వీలయింది.

చివరకు అందరూ ఒకానొక కొండ గుహ ప్రాంతం చేరారు. కుంభాండుడూ,





ఆటవికులూ యింకా తమను వెంబడిస్తున్నట్టు, వాళ్ళ కేకలనుబట్టి గ్రహించారు. ఇంకా మరి కొంత దూరం పరిగెత్తడం కన్న, దాపులనున్న ఏ చీకటి గుహలోనో ప్రవేశించి, ఆ రాత్రికి అక్కడ కాలం గడపడం మంచిదనిపించింది, సమరసేనుడికి.

ఎదురుగా కనబడుతున్న గుహ కేసి సమరసేనుడు పరీక్షగా చూస్తున్నంతలో, సైనికులు తమ నాయకుడి ఆలోచన గ్రహించి, అటు కేసి నాలుగైదడుగులు వేశారు. వెంటనే సమరసేనుడు వాళ్లను, "తొందరపడకండి, కొంచెం ఆగండి!" అంటూ హెచ్చరించాడు.

"తొందరపడి గుహలో ప్రవేశించడం ప్రమాదకారణం కావచ్చు. ఆ గుహలో సింహం లాంటి ఏ క్రూరమృగమో వుండవచ్చు గదా!" అన్నాడు సమరసేనుడు.

"సేనానీ, మరేం చేయాలి? కుంభాండుడు, ఆటవికులతో మన వెన్నంటి వస్తున్నాడు గదా?" అన్నాడొక సైనికుడు, వెనుదిరిగి చూస్తూ.

"గుహలో సింహం వున్నదీ లేనిదీ తెలుసుకోవడం ఎలా? మరొక గుహ దగ్గిరకుపోయినా, యిదే సమస్య ఎదురౌతుంది గదా?" అన్నాడు మరొక సైనికుడు.

సైనికుల ప్రశ్నలకు సమరసేనుడు చిరునవ్వు నవ్వాడు. తాను ముందుగా హెచ్చరించకపోతే వాళ్ళు గుహలోకి దూరబడడం జరిగి వుండేది. ఒకవేళ ఏ సింహమో, పులో అక్కడ వుంటే, వాళ్ళు దానికి ఎర అయిపోయి వుండేవాళ్ళు.

సమరసేనుడు విల్లంబులు చేతికి తీసుకుని, "మీరందరూ కత్తులతో సిద్ధంగా వుండండి. నేను గుహలోకి బాణం కొడతాను. ఒకవేళ లోపల ఏదైనా క్రూరమృగం వుంటే, అది హఠాత్తుగా మన మీదికి వచ్చిపడుతుంది. జాగ్రత్త!" అన్నాడు.

సైనికులను యిలా హెచ్చరించి సమరసేనుడు గుహలోకి బాణం వదిలాడు.



మరుక్షణం, అతడు ఊహించినది నిజమని రుజువయింది. భయంకరంగా గర్జిస్తూ, సింహం ఒకటి చీకటి గుహ నుంచి బయిటికి దూకింది. కత్తులు దూసి సిద్ధంగా వున్న సైనికులు, అది తమ మీద దూకబోయేంతలో, కత్తులతో దాన్ని ఎదుర్కొన్నారు. రెండు, మూడు కత్తి దెబ్బలు తిని సింహం మరింత పెద్దగా గర్జిస్తూ అడవిలోకి పారిపోయింది.

సమరసేనుడు యీసారి ఒక సైనికుడి నుంచి కత్తి తీసుకుని, గుహకేసి నడిచాడు. మిగతా సైనికులు అతణ్ణి అనుసరించారు. అందరూ గుహలోపల అడుగు పెట్టేసరికి, వాళ్ళకు చిన్న అరుపులాంటిది వినిపించింది.

సమరసేనుడు చప్పున ఒక అడుగు వెనక్కు వేసి, "గుహలో గాయపడిన మరొక సింహం వున్నట్టున్నది. అది ఏ స్థితిలోవున్నదో తెలుసుకోకుండా, లోపలికి వెళ్ళడం ప్రమాదకరం. నిప్పు వెలిగించండి," అన్నాడు సైనికులతో.

వెంటనే యిద్దరు సైనికులు చెకుముకి రాయికొట్టి, గుహద్వారం దగ్గిర మంట చేశారు. దానితో చిన్న కాగడా ముట్టించి సమరసేనుడు ముందుకు వెళ్ళి గుహ లోపలి భాగాన్ని పరీక్షగా చూశాడు. అక్కడ బాణం దెబ్బతిని గిలగిల తన్నుకుంటున్న ఒక సింహంపిల్లా, దాని పక్కనే అరుస్తూ, మరొక సింహంపిల్లా కనిపించినై.

"భయం లేదు, యిక లోపలికి రండి," అన్నాడు సమరసేనుడు.

సింహం పిల్లల్లో గాయపడకుండా వున్నది, మెల్లిగా అరుస్తూ గుహ వెనుక భాగానికి పొసాగింది. సమరసేనుడు చిన్నగా యీలవేసి, గుహలో ఒక పక్కగా కూర్చున్నాడు. సైనికులు కూడా గుహలోకి వచ్చారు.

అప్పటికి బాగా పొద్దుపోయింది. కుంభాండుడూ, ఆటవికులూ యింకా సమరసేనుడి కోసం అడవి గాలిస్తున్నా


CHITRA




రన్న సూచనగా, అప్పుడప్పుడూ వాళ్ళ కేకలు వినబడుతున్నవి. తాము దాగి వున్న చోటు తెలియకుండా వుండేందుకు సమరసేనుడు గుహముందు వెలిగించిన మంట ఆర్పివేయించాడు.

గుహలో చాలా చీకటిగా వున్నది. బాణం దెబ్బతిన్న సింహంపిల్ల చచ్చిపోయింది. గుహ వెనుకకు పోయి కూర్చున్న సింహంపిల్ల మాత్రం, అక్కడే వుండి కవ్విస్తున్నట్టు మధ్య.మధ్య మెల్లిగా గర్జిస్తున్నది. బయిటికి పారిపోయిన సింహం తన పిల్లల కోసం తిరిగి రావచ్చునన్న భయం సమరసేనుడికి కలిగింది. కుంభాండుడూ, ఆటవికులూ తమ కోసం అడవిలో యింకా వెతుకుతూ వుంటారన్న అనుమానం కూడా అతణ్ణి బాధించ సాగింది.

ఈ కారణాల వల్ల సమరసేనుడితో పాటు సైనికులు కూడా ముంచుకు వస్తున్న నిద్రను ఆపుకుంటూ, చీకట్లో అలాగే కూర్చున్నారు. హఠాత్తుగా సమరసేనుడికి ఒక అనుమానం కలిగింది. ఒక వేళ కుంభాండుడు తాను దాగి వున్న గుహ ఎక్కడో తెలుసుకుని, తన ఆటవిక మూకతో గుహద్వారాన్ని అటకాయిస్తే, తమకు పారాడేందుక్కూడా అవకాశం లేకుండా ప్రాణాలు విడవవలసి వస్తుంది! అందువల్ల సైనికులను దాపుల వున్న చెట్లమీద వేగులుగా వుంచడం మంచిదనుకున్నాడు.

''మనం అందరం యీ గుహలో కూర్చోవడం వల్ల, హఠాత్తుగా కుంభాండుడు మనమీద దాడి చేస్తే చిక్కుల్లో పడిపోతాం. కనక, మీరు ఆ చెట్లెక్కి, కుంభాండుడూ, ఆటవికులూ మన కోసం ఏ ప్రాంతాలు వెదుకుతున్నారో కనిపెట్టి చూడండి. ఒక వేళ, వాళ్ళు యీ ప్రాంతాల కేసి వస్తూండడం కంట బడితే, మనం యిక్కడి నుంచి మరొక చోటుకు తప్పుకుందాం.'' అన్నాడు సమరసేనుడు, సైనికులతో.

సైనికులు తమ నాయకుడి ఆజ్ఞ వింటూనే గుహనుంచి బయటికి వచ్చి, అక్కడికి దాపుల గుబురు కొమ్మలతో వున్న చెట్టెక్కి. అడవిలో కుంభాండుడు ఏ ప్రాంతాన వున్నదీ చూడసాగారు.

గుహలో ఒంటరిగా వున్న సమరసేనుడికి దగ్గర్లోనే మాటలు వినబడినై. అవి తన సైనికుల మాటలు కాదని గుర్తించాడు. ఒకవేళ కుంభాండుడి అనుచరులేమో అన్న అనుమానం కలిగిందతడికి. నిశ్శబ్దంగా గుహద్వారం దగ్గిరకు వచ్చి బయటికి తొంగిచూశాడు. ఎవరూ కనిపించలేదు. తృప్తిగా తలాడించి గుహ లోపలికి వెళ్ళగానే, యీ సారి మాటలు స్పష్టంగా వినపడసాగినై.

సమరసేనుడికి చాలా ఆశ్చర్యం కలిగింది. గుహలో ఎక్కడన్నా రహస్య ద్వారం వున్నదేమో అని పరికించి చూశాడు. ఆ మాటల ధ్వని గుహ వెనక వైపు నుంచి వస్తున్నట్టు తెలుసుకుని నిర్విణ్ణుడయిపోయాడు. పెద్ద కొండలో వున్న యీ చిన్న గుహ వెనకకు మానవ మాత్రులు ఎలా వెళ్ళగలిగారా, అన్న సంశయం అతడికి కలిగింది. రహస్య ద్వారం ఏమైనా వున్నదేమో అని, యీసారి గుహ వెనుకభాగాన్ని పరీక్షించి చూడసాగాడు.

హఠాత్తుగా అతడి చేతికి చిన్న మేకు లాంటిది తగిలింది. దాన్ని పట్టుకుని బలంగా గుంజేసరికి, రాతిలో మలచబడిన ఒక చిత్రమైన తలుపు తెరుచుకున్నది. అందులో నుంచి చంద్రకాంతి గుహలో ప్రవేశించింది. అక్కడికి కొద్ది గజాల దూరంలో, యిద్దరు మనుషులు మాట్లాడుకుంటున్నట్టు సమరసేనుడు చూశాడు. వాళ్ళ దుస్తుల తీరును బట్టి, వాళ్ళు ఆటవికులుగా లేరు.

సమరసేనుడు ఏమి చేయుటమా అని ఆలోచిస్తున్నంతలో, వాళ్ళ దృష్టి అతడిపైన బడింది. వాళ్ళు మెరుపు వేగంతో సమరసేనుడిపైకి దూకి, పెడరెక్కలు విరిచి పట్టుకున్నారు. —(ఇంకా వుంది)






**12**

[సమరసేనుడు తన సైనికులతో పారిపోసాగాడుకదా? కొంతసేపటికి కుంభాండుడు తమను వెన్నాడుతున్నట్టు గ్రహించాడు. సైనికులను చెట్లమీద కాపుపెట్టి, ఒంటరిగా ఒక గుహలో కూర్చున్నాడు. గుహవెనుకభాగాన ఒక రహస్యద్వారం వుంది. దానిని సమరసేనుడు తెరవటంతో ఇద్దరు బలిష్ఠులు హఠాత్తుగా లోపలకువచ్చి అతణ్ణి బంధించారు. తరవాత—]

హఠాత్తుగా ఇద్దరు బలిష్ఠులు తనమీదకు దూకేసరికి సమరసేనుడు తబ్బిబ్బయాడు. అతడి నోట మాట రాలేదు. ఇంతలో గుహ ముందునుంచి భయంకరమైన సింహగర్జన వినబడింది. మరుక్షణంలోనే సమరసేనుణ్ణి బంధించిన ఇద్దరూ అతణ్ణి భుజాలమీద వేసుకుని అక్కడినుంచి పారిపోసాగారు.

సమరసేనుడు చేయగలిగిందేమీ లేక ఆ ప్రాంతాన్ని పరీక్షగా చూస్తున్నాడు. అదంతా ఒక కొండ లోయలాగా ఉంది. తనను బంధించిన ఇద్దరు వ్యక్తులూ కొండ మిట్ట మీంచి పల్లానికి దిగుతున్నారు. దూరంగా ఎక్కడో మినుకుమినుకుమని దీపాలు మెరుస్తున్నాయి.

"మీరెవరు? నన్నెందుకు బంధించారు?" అని అడిగాడు సమరసేనుడు.

అందుకు ఆ ఇద్దరూ మొహమొహాలు చూసుకొని మాట్లాడకుండా ఊరుకున్నారు. సమరసేనుడు అదే ప్రశ్నను తిరిగి అడిగాడు. అప్పుడు వాళ్ళల్లో ఒకడు-"అదంతా మా నాయకుణ్ణి అడిగితే చెపుతాడు!". అని మాత్రం జవాబిచ్చాడు.



ఆ జవాబుతో ఇక వాళ్ళను ప్రశ్నించి లాభం లేదనుకున్నాడు సమరసేనుడు. కొండమిట్ట ప్రదేశాన్నుంచి లోయలోకి దిగగానే ఆ ఇద్దరూ సమరసేనుణ్ణి కిందకు దింపి, చేతులకూ కాళ్లకూ కట్టిన కట్లు విప్పేశారు. తరవాత సమరసేనుణ్ణి మధ్యను ఉంచి అటూ ఇటూ వాళ్ళు నడుస్తూ ముందుకు పోసాగారు.

అలా కొంతదూరం వెళ్ళేసరికి దీపాల కాంతి దగ్గరయింది. చెట్టుమీద కావలి కూర్చున్న ఒకడు, "మిత్రులు ఎవర్నో బంధించి తెస్తున్నారు. దారి యివ్వండి!" అంటూ పెద్దగా కేక పెట్టాడు. ఆ కేకకు జవాబుగా మరికొన్ని కేకలు వినబడినై. ఇవంతా ఆశ్చర్యాన్నేగాక, భయాన్నికూడా కలిగించింది సమరసేనుడికి.

చివరకు అతణ్ణి ఆ ఇద్దరూ ఒక ఇంటికి తీసుకుపోయారు. తలుపు తట్టగానే అది తెరవబడింది. సమరసేనుణ్ణి ఒక గదిలోకి తీసుకుపోయి కాళ్ళూ, చేతులూ తాళ్ళతో కట్టి—"ఈ రాత్రికి యిదే నీ పడక గది. తెల్లవారినతర్వాత వుంది ముసళ్ళ పండగ" అంటూ వెళ్ళిపోయారు.

సమరసేనుడికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. తనను ఈ కొత్తవాళ్ళు ఎందుకు బంధించారో ఎంత ఆలోచించినా అతడికి అర్థం కాలేదు. ఈ ద్వీపంలో తనూ, కుంభాండుడే కాక, తనవలె కొంత నాగరికులైన మరొక జాతివాళ్ళుకూడా నివసిస్తున్నారని మాత్రం అతడు ఊహించాడు. తనను బంధించినవాళ్ళ వేషభాషలు చూస్తే, వాళ్లు ఆటవికులు కాదని తెలుస్తూనేవుంది.

దారీ తెన్నూ లేని ఆలోచనలతో సమరసేనుడు ఆ రాత్రంతా ఆ చీకటిగదిలో గడిపాడు. తెల్లవారవచ్చిన సూచనగా కోడి కూతలు వినబడసాగినై. కొద్దిసేపటితర్వాత గుడిగంటలు మోగుతున్న శబ్దంకూడా వినబడింది. ఆవెంటనే అడుగుల చప్పుడూ,

కొద్దిసేపట్లో కిర్రుమంటూ తలుపు తెరుచుకోవటం జరిగింది.

సమరసేనుడు అటుకేసి చూశాడు. ఇద్దరు కొత్తవాళ్లు కత్తులు ధరించి కోర చూపులు చూస్తూ సమరసేనుడిదగ్గిరకు వచ్చారు. సమరసేనుడు నిర్భయంగా వాళ్ళకేసి చూస్తూ—


"ఆ మోగినది గుడిగంటలేనా?" అని వాళ్లను అడిగాడు.

అందుకు ఆ కొత్తవాళ్ళల్లో ఒకడు నవ్వుతూ, "అవి గుడిగంటలు కాదు, చావు బాజాలు. వ్యాఘ్రదత్తుడు అడిగినదానికి సరిఅయిన జవాబు ఇవ్వకపోయావో... నేటితో నీకు నూరేళ్ళజీవితం నిండినట్టే. జాగ్రత," అన్నాడు.

వ్యాఘ్రదత్తుడెవరు? తననుంచి అతడు తెలుసుకోగోరుతున్న రహస్యం ఏమిటి? ఇలాంటి ప్రశ్నలకు సమరసేనుడికి జవాబు దొరకలేదు. కోరచూపులుచూస్తూ, క్రూరాతిక్రూరుల్లా వున్న వ్యాఘ్రదత్తుడి అనుచరులను అడిగినా లాభం లేదని సమరసేనుడు దృఢపరుచుకున్నాడు.

సమరసేనుడి కట్లు విప్పబడినై. వ్యాఘ్రదత్తుడి సేవకులు అతణ్ణి గదినుంచి బయటకు తీసుకువచ్చారు. "నన్ను ఎక్కడికి తీసుకుపోతున్నారు?" అని వుండ





బట్టలేక అడిగాడు సమరసేనుడు. అందుకు వాళ్ళు "నిన్ను మా నాయకుడైన వ్యాఘ్రదత్తుడివద్దకు తీసుకుపోతున్నాం. ఒళ్లు దగ్గరపెట్టుకొనిమాత్రం ప్రవర్తించు. తెలిసిందా?" అని గద్దించారు.

కొంతదూరం నడిచి అందరూ ఒక పెద్ద భవనంలో ప్రవేశించారు. అక్కడ రకరకాల ఆయుధాలు ధరించిన చాలా మంది సైనికులు కనిపించారు.

వాళ్లను చూస్తూనే, 'వీళ్లు సైనికులు కారు. మాటల తీరూ, వేషాలూ చూస్తే వట్టి బందిపోటు గుంపులా వుంది,' అనుకొన్నాడు సమరసేనుడు తనలో.

అంతలో ఒక పెద్ద తలుపు తెరవబడింది. ఎదురుగా ఒక ఎత్తయిన పీఠం మీద వ్యాఘ్రదత్తుడు కనిపించాడు. సమరసేనుణ్ణి చూస్తూనే నవ్వుతూ—

"సమరసేనా, నీకు వ్యాఘ్రమండలం తరఫున అభివందనాలు చెపుతున్నాను. బహుశా నీ పూర్వులూ, నా పూర్వులూ కుండలినీద్వీపంలో ఒకే పట్టణవాసులై ఉండవచ్చు. ఇక్కడ—ఈ మంత్రాలదీవిలో వారి సంతానమైన మనం యిలా కలుసుకోవటం నీకు ఆశ్చర్యంగా లేదా?" అని అడిగాడు.

సమరసేనుడికి తను బంధింపబడిన దగ్గరనుంచి జరుగుతున్న ప్రతి సంఘటనా ఆశ్చర్యంగానే కనబడుతోంది. తనను ఎవరు ఎందుకు బంధించారనేది ఒక ఆశ్చర్యకరమైన సంగతి. కుండలినీద్వీపం పేరుకూడా చెప్పి, తమ పూర్వీకుల నివాసస్థానాల మాట గుర్తుచేస్తున్న ఈ వ్యాఘ్రదత్తుడి ధోరణికూడా ఆశ్చర్యంగానే వుంది.

"నాకు ప్రతిదీ ఆశ్చర్యాన్నే కలిగిస్తోంది," అన్నాడు సమరసేనుడు నిబ్బరంగా. "నన్ను మీ అనుచరులు ఎందుకు బంధించినట్టు? మీవద్దకు ఎందుకు తీసుకు వచ్చినట్టు? అసలు మీరు ఈ ద్వీపానికి

ఎప్పుడు వచ్చారు? నాకన్నీ వింతగానే కనబడుతున్నాయి!" అంటూ ముగించాడు సమరసేనుడు.

"సమరసేనా! ఇందులో నువ్వు ఆశ్చర్యపడవలసిందేమీలేదు. శమనద్వీప రాజైన శాక్తేయుడు దేశాలమీద దండెత్తి మన కుండలినీద్వీపాన్నికూడా దోచుతున్నాడు. మన పూర్వుల్లో దృఢకాయులైన కొందరిని బానిసలుగా కూడా పట్టుకొని, మరికొన్ని ద్వీపాలను దోచుకునేందుకు ఓడల్లో బయలుదేరాడు. ఈ ద్వీపంలో అతడు మృత్యువు పాలయ్యాడని నీకూ తెలుసుననుకుంటాను. బానిసలుగా బంధింపబడిన మనపూర్వులు స్వేచ్ఛ పొంది, ఈ ప్రాంతాల్లో నివాసం ఏర్పరుచుకున్నారు. మనవాళ్లు స్వేచ్ఛ పొందటానికి, శాక్తేయుడి శిష్యులైన ఇద్దరు మాంత్రికులమధ్య చెలరేగిన ద్వేషం కొంత సహాయం చేసింది. వాళ్లను నీవు ఎరుగుదువుకదా?" అని అడిగాడు వ్యాఘ్రదత్తుడు.


"ఎరుగుదును!" అని వెంటనే జవాబు చెప్పాడు సమరసేనుడు. అతడికి వ్యాఘ్రదత్తుడు చెపుతున్నదంతా నిజంగా కనబడుతున్నా, ఆశ్చర్యంకూడా కలిగిస్తోంది.

"ఐతే యిప్పుడు చెప్పు, ఆ శాక్తేయుడి త్రిశూలం ఎక్కడ వుంది? చండీదేవి



ప్రసాదితమైన ఆ త్రిశూలం శక్తి నీవు వినే వుంటావు? మరి దానిసంగతేమిటి?" అని అడిగాడు వ్యాఘ్రదత్తుడు.

ఆ ప్రశ్నతో సమరసేనుడు నివ్వెరపోయాడు. వ్యాఘ్రదత్తుడు, శమనద్వీప రాజయిన శాక్తేయుణ్ణిగురించి చెప్పిన సంగతులేవీ సమరసేనుడికి తెలియవు. చతుర్నేత్రుడు ఒకసారి తమ గురువైన శాక్తేయుడినిగురించి కొంత చెప్పాడు. శాక్తేయుడు కుండలినీద్వీపాన్ని దోచుకున్న సంగతి తను వినలేదు. చండీదేవి, శాక్తేయుడికి ప్రసాదించిన త్రిశూలంసంగతి అతడికి మొదలే తెలీదు.





"వ్యాఘ్రదత్తా! మీరడిగే ప్రశ్నలలో వేటికి నేను జవాబివ్వలేను. మీరు నన్ను పొరపాటుబడి బంధించివుంటారు. శాక్తేయుణ్ణిగురించిగానీ, అతడి దివ్యశక్తిబలం గల త్రిశూలంసంగతిగానీ నాకు తెలియదు," అన్నాడు సమరసేనుడు.

వ్యాఘ్రదత్తుడు, సమరసేనుడి జవాబు విని మండిపడ్డాడు. "నువ్వు అమాయికుడిలా నటించి నన్ను మోసగించలేవు. నీకు రేపు ఉదయం పదిగంటలవరకూ అవకాశం యిస్తున్నాను. ఈలోపల బాగా అలోచించుకుని నిజంచెప్పటం నీకు శ్రేయస్కరం. లేకపోతే నిన్ను చిత్రవధ చేసి భద్రచాముండికి అహారంగా వేస్తాను. నిన్ను రక్షించేవాళ్ళెవరూలేరు," అంటూ భీకరంగా అరిచాడు.

సమరసేనుడు నిశ్చేష్టుడైపోయాడు. తన కేమాత్రం తెలియని సంగతులు చెప్పమని బలవంతపెడుతున్నాననేది వ్యాఘ్రదత్తుడికి తెలియదని సమరసేనుడు గ్రహించాడు. అయినా తన మాటల్లో వ్యాఘ్రదత్తుడికి నమ్మకం కలిగించటం సాధ్యమయ్యే పని కాదు.

వ్యాఘ్రదత్తుడి ఆజ్ఞ విని ఇద్దరు భటులు సమరసేనుణ్ణి అక్కడినుంచి ఒక చీకటి గదికి తీసుకుపోయారు. అక్కడ అతడి కాళ్లూ చేతులూ కట్టి నేలమీద పడవేశారు. ఒకపక్కగా భయంకరరూపి అయిన భద్రచాముండివిగ్రహం వుంది. భటులు సమరసేనుడికి ఆ విగ్రహాన్ని చూపుతూ—

"రేపు పదిగంటలలోగా, మా నాయకుడికి నిజం చెప్పకపోయావంటే, నీవు ఈ దేవికి బలికాక తప్పదు. అలోచించుకో," అంటూ అక్కడినుంచి వెళ్లిపోయారు.

సమరసేనుడు ఆకలిబాధతో, కాళ్ళూ చేతులూ కట్లవల్ల కలిగే నొప్పితో నానా యాతనా పడసాగాడు. తెల్లవారితే తనకు మరణం తప్పదని తోచింది. ఇటువంటి

ఆపత్సమయంలో చతుర్నేత్రుడు తప్ప తనకు సహాయపడగలవాళ్లు ఎవరూ లేరు. కాని చతుర్నేత్రుడికి తను అపాయంలో చిక్కుకున్నట్టు తెలియటం ఎలా?

సమరసేనుడు ఇలాంటి ఆలోచనలతో బాగా రాత్రిపోయేవరకూ కదలామెదలక వుండిపోయాడు. బాగా నడిరేయివేళకు ఎవరో గదితలుపు తెరిచిన శబ్దం అయింది. సమరసేనుడు అటుకేసి చూశాడు. కత్తులు ధరించిన ఇద్దరు దృఢకాయులు లోపలకు వచ్చారు. బహుశా తనను హింసించేందుకు వస్తున్న వ్యాఘ్రదత్తుని భటులైవుంటారని సమరసేనుడు భావించాడు.

ఆ కొత్తవాళ్లిద్దరూ సమరసేనుడివద్దకు వచ్చి కట్లు విప్పారు. ముందు ఏమి జరుగుతుందా అని ఆశ్చర్యపడుతూ చూస్తున్న సమరసేనుణ్ణి తమవెంట రావలసిందిగా సొజ్ఞచేసి, వాళ్ళిద్దరూ వేగంగా ముందు నడవసాగారు.

వాళ్ళు కొంతదూరం వెళ్లేసరికి ఎదురుగా వస్తున్న వ్యాఘ్రదత్తుడి అనుచరులిద్దరు కనిపించారు. వెంటనే సమరసేనుడి వెంటనున్నవాళ్లు అతన్ని చెయ్యిపట్టుకుని పక్కన వున్న చీకటిలోకి లాగుతూ—

"మేము మీ స్నేహితులం. వ్యాఘ్రదత్తుడి సేవకులు గస్తీ తిరుగుతున్నారు. మనం ఈ చీకట్లో నిలబడి వాళ్ళు దగ్గరకు రాగానే హఠాత్తుగా మీదపడి హతమార్చాలి. కనక సిద్ధంగా వుండు," అని చెప్పారు.

కాసేపటికల్లా వ్యాఘ్రదత్తుడి గస్తీవాళ్ళిద్దరూ ఆ సమీపానికి వచ్చారు. చీకటిలో పొంచివున్న సమరసేనుడూ, అతడి మిత్రులిద్దరూ వాళ్ళమీదకు దూకి కిక్కురుమనకముందే గొంతులు నులిమి, ఆ పక్కనవున్న పాడుబావిలో పారేశారు.

ఆ తరవాత వాళ్ళు కొండదారులవెంట నడిచి, సరిగా సూర్యోదయంవేళకు ఒక చిన్న పల్లెచేరారు. —(ఇంకా వుంది)






## 13

[గుహలో దాగివున్న సమరసేనుణ్ణి, వ్యాఘ్రదత్తుడి భటులు బంధించారుకదా? తరవాత అతణ్ణి వ్యాఘ్రదత్తుడు, కాత్తేయుడినిగురించి, అతడి త్రిశూలాన్ని గురించి ప్రశ్నించాడు. వాటి సంగతి తెలియదని చెప్పిన సమరసేనుణ్ణి చంప నిశ్చయించాడు. కాని ఆరాత్రి ఇద్దరు కొత్తవాళ్లు వచ్చి సమరసేనుణ్ణి చెరనుంచి విడిపించి తీసుకుపోయారు. తరవాత—]

సమరసేనుడూ, అతణ్ణి చెరనుంచి విడిపించిన ఇద్దరు సైనికులూ పల్లెచేరేసరికి అక్కడి పరిస్థితి గందరగోళంగా వుంది. విచ్చుకత్తులు ధరించిన వ్యాఘ్రదత్తుడి భటులు పల్లెలోని ఇళ్ళనన్నిటినీ గాలిస్తున్నారు. చాలామంది పల్లెవాసులు భయంతో పక్కనవున్న కొండలకేసీ, అడవులకేసీ పారిపోతున్నారు.

"శివదత్తుడెక్కడ, శివదత్తుడెక్కడ?" అని అరుస్తూ, సైనికులు తమకు దొరికిన వారిని ప్రశ్నిస్తున్నారు. 'మాకు తెలియదు?' అన్న జవాబు వినగానే మండిపడి వారిని నానా హింసా పెడుతున్నారు.

కొంతదూరాన వుండగానే సమరసేనుడికి, అతడి వెంటవున్న వారికి ఈ భయంకర దృశ్యం కంటబడింది. వారు సరాసరి పల్లెకుపోక, అక్కడవున్న చెట్ల చాటున దాక్కొని యీ పరిస్థితి అంతా గమనించసాగారు. 'శివదత్తుడెవరు?' అన్న అనుమానం కలిగింది సమరసేనుడికి.

"ఈ శివదత్తుడెవరు? అతడికోసం పల్లెవాసుల్ని బాధిస్తున్న యీ సైనికులెవరు?"



అని సమరసేనుడు తన వెంటవున్న సైనికులను ప్రశ్నించాడు.

అందుకు సైనికులలో ఒకడు, "ఈ శివదత్తుడు మా నాయకుడు. మిమ్ములను ఆయన ఆజ్ఞవల్లనే ఖైదునుంచి విడిపించి తీసుకువస్తున్నాం. పల్లెనంతా భీభత్స పరుస్తున్న వాళ్ళు వ్యాఘ్రదత్తుడి సైనికులు," అని జవాబుచెప్పాడు.

ఈ జవాబు సమరసేనుడికేమీ సంతృప్తి కలిగించలేదు. శివదత్తుడు తననుంచి ఎలాంటి సహాయం అపేక్షించి; చెరనుంచి విడిపించాడో అన్న అనుమానం అలాగే వుంది. శివదత్తుడికీ, వ్యాఘ్రదత్తుడికీ వున్న వైషమ్యానికి కారణాలేమిటో సమరసేనుడికి అవగాహన కాలేదు.

"అయితే ఇప్పుడు మనం చేయవలసిందేమిటి?" అని అడిగాడు సమరసేనుడు.

అతడి వెంటవున్న యిద్దరు సైనికులూ మొఖమొఖాలు చూచుకొన్నారు. వాళ్ళ ధోరణిచూస్తే, ముందు కర్తవ్యమేమిటో వాళ్లు నిర్ణయించుకోలేక పోతూన్నట్టు తెలుస్తూవుంది.

"శివదత్తుడు మిమ్మల్ని యిక్కడకు తీసుకురమ్మన్నాడు. ఆయన మీతో స్నేహం చేయదలిచే యీపనికి మమ్మల్ని నియమించాడు. కాని, ఆయన వుంటూన్న పల్లె రహస్యం వ్యాఘ్రదత్తుడికి తెలిసిపోయింది. అందుకే అతడి సైనికులు పల్లెనంతా గాలిస్తున్నారు. శివదత్తుడు ముందుగానే ప్రమాదం గ్రహించి ఎక్కైనా పారిపోయి వుంటాడు," అన్నారు సైనికులు.

శివదత్తుడు అలా పారిపోవటం ఎటుకేసి పారిపోయాడో తెలిస్తేతప్ప, లేకపోతే తాము ప్రమాదంలో చిక్కుకోగలమని సైనికులూ, సమరసేనుడుకూడా గ్రహించారు. ఈ పరిస్థితుల్లో తాము ఏమిచేయటమా అని ఆలోచించేటంతలో వారికి వెనుకనుంచి ఒక సన్నని ఈల వినబడింది. వెంటనే వాళ్ళ

ముగ్గురు అటుకేసి చూశారు. దూరంగా చెట్టు కొమ్మమీద నక్కివున్న ఒక వ్యక్తి వాళ్లకేసి చేతులు ఊపుతూ పిలుస్తున్నాడు.

పిలుస్తూన్న ఆ మనిషి మిత్రుడో, శత్రువో అన్న సందేహం సమరసేనుడికి కలిగింది. కాని తను యీ ప్రాంతానికి కొత్త, తన వెంట వున్నవాళ్ళిద్దరూ ఎలా నడుచుకో మంటే అలా నడుచుకోవటంతప్ప తనకు మార్గాంతరం లేదనుకున్నాడు.

సమరసేనుడివెంట వున్న సైనికులలో ఒకడు పెదాలు బిగించి తిరిగి ఈలవేశాడు. అందుకు జవాబుగా చెట్లల్లో దాగివున్న వాడు రెండుమార్లు ఈలవేశాడు.

"అతడు మనకు మిత్రుడే. రహస్య సంకేతం గ్రహించాడు. అది ఒక శివదత్తుడి అనుచరులకు తప్ప మరొకరికి తెలియదు. రండి, పోదాం," అన్నాడు సైనికుడు.

సమరసేనుడూ, సైనికులూ తాము దాక్కున్న ప్రదేశంనుంచి ఆ నూతన వ్యక్తి కూర్చునివున్న చెట్టుదగ్గరకు వెళ్లారు.

వీళ్లు ముగ్గురూ చెట్టుదగ్గరకు రాగానే ఆ కొత్తవాడు చెట్టు దిగి వచ్చాడు. గందరగోళంగావున్న పల్లెకేసి ఒకమారు చూచి,

"మీకోసమే నన్ను శివదత్తుడు యిక్కడ కాపలివుంచాడు. ఇవ్వాళ వేకువజామునే వ్యాఘ్రదత్తుడి సైనికులు గ్రామాన్ని ముట్ట





డించారు. ఆ సంగతి ముందుగానే వేగుల వల్ల శివదత్తుడు గ్రహించి అనుచరులతో పారిపోయాడు. నేను మీకోసం నిరీక్షిస్తున్నాను" అని చెప్పాడు.


అతడి మాటలు విన్నతరవాత అందరికీ ప్రాణం తెప్పరిల్లినట్టయింది. కాని, శివదత్తుడు ఎక్కడికి పోయాడు? అతణ్ణి కలుసుకోవటం ఎలా? అన్నదే ముఖ్య సమస్యగా తోచింది.

"ఈయన సమరసేనుడు. వ్యాఘ్రదత్తుడి ఖైదునుంచి విడిపించుకు వస్తున్నాం. ఈయన సాధ్యమైనంత త్వరలో శివదత్తుణ్ణి కలుసుకోవాలి. అయన ఎక్కడ వున్నదీ నీకు తెలుసా? మాకు మార్గం చూపించగలవా?" అని అడిగాడు ఒక సైనికుడు.

అందుకు ఆ నూతన వ్యక్తి "అయన ఎక్కడ వుండేదీ నాకు తెలియబరచలేదు. కాని ఈ పటంవున్న కాయితం నా చేతికిచ్చాడు. ఇందులో అయన ఎక్కడ వుండేది గుర్తుపెట్టానని చెప్పాడు. మీరే చూడటం మంచిది, ఈ పటం నా కర్థం కావటంలేదు," అంటూ చుట్టగా చుట్టివున్న ఒక కాయితాన్ని దుస్తులలోనుంచి తీసి సమరసేనుడికి యిచ్చాడు.

సమరసేనుడు ఆ కాయితాన్ని విప్పి పరీక్షించిచూశాడు. అందులో కొండల్లో పాడుపడినట్టున్న కొన్ని గృహాలూ, బావులూ, కొలనులూ చిత్రించబడివున్నాయి. ప్రతి చిత్రంకిందా, దాని పేరుకూడా స్పష్టంగా లిఖించబడివుంది. కాని శివదత్తుడు ఎక్కడ దాక్కునివున్నాడో మాత్రం తెలుసుకునేందుకు అందులో ఏ విధమైన గుర్తులూ లేవు.

"శివదత్తుడు కొండల్లో పాడుపడివున్న ఈ గృహాలకేసి పారిపోయాడు. ప్రమాదంలో చిక్కుకున్న అతడు ఇలాంటి చోటుకు పోవటంలో వున్న అర్థమేమిటో నాకు తెలియడంలేదు. కారణం ఏదయినా మనం



కూడా అక్కడికి పోవలసిందేగదా ?" అని అడిగాడు సమరసేనుడు.

అందుకు అందరూ అవునన్నట్టు తలలు వూపారు. పోతే ఆ పటాన్నిబట్టి ఆ చోటుకు దారితీయవలసిన బాధ్యత సమరసేనుడి మీదే పడింది. అతడు ఒకసారి పల్లెకేసి తిరిగిచూశాడు. అప్పటికే పల్లెఅంతా తగలబడిపోతోంది. కసికొండికీ వ్యాఘ్రదత్తుడి సైనికులు పల్లెకు నిప్పుపెట్టి వినోదంచూస్తూ గంతులేస్తున్నారు.


సమరసేనుడు తనదగ్గర వున్న కొద్దిమంది సైనికులతో, వ్యాఘ్రదత్తుడి సైనికులను ఎదుర్కొనటం ప్రమాదమని నిర్ణయించుకున్నాడు. ఇక తను తక్షణం చేయ్యవలసింది; బయలుదేరి శివదత్తుణ్ణి కలుసుకోవటం. అతడిద్వారా వినవలసిన రహస్యం ఏదయినా వుంటే వినటం.

సమరసేనుడు చిత్రపటంకేసి ఓమారు చూసి ముందుకు దారితీశాడు. పటంలో సూచించిన దిక్కులననుసరించి జాగ్రత్తగా వెళ్ళవలసివుంది. అంతేకాక మార్గమధ్యంలో వ్యాఘ్రదత్తుడి సైనికులబారి పడకుండా జాగ్రత్తపడాలి.

కొంతదూరం అడవిలోంచి నడిచి అందరూ ఒక కొండప్రాంతం చేరుకున్నారు. ఆ ప్రదేశమంతా చిన్నా పెద్ద కొండలతో ఎగుడుదిగుడుగావుంది. ఎటుచూసినా కాలిబాటల ఆనవాళ్ళుగాని, జననివాసాలుగాని కనబడటంలేదు.

సమరసేనుడు ఒక మిట్టప్రదేశం ఎక్కి చుట్టూ కలయచూచాడు. కొండదిగువలో చిన్నచిన్న కనుమలు మాత్రం కనిపించాయి. ఒకచోట మాత్రం కొంత సమతల ప్రదేశం కానవచ్చింది.

అక్కడికి చేరితే—అక్కడినుంచి బహుశా ముందు అనుసరించవలసిన మార్గం కనబడవచ్చునని సమరసేనుడు భావించాడు. అంతా అదృష్టం అనిపించింది.



వాళ్ళు కొండమీంచి కిందకు దిగారు. ఆ ప్రదేశమంతా పెద్ద పెద్ద బండరాళ్లతో, చిన్న చిన్న చెట్లపొదలతో భీకరంగా వుంది. పటంలో కనబరచిన పాడుబడిన గృహాలు గాని, అక్కడికి వెళ్ళేందుకు మార్గం సూచించే గుర్తులుగాని ఎక్కడా లేవు.

సమరసేనుడూ, సైనికులూ కొంత ముందుకు వెళ్ళేసరికి వారికి ఆశ్చర్యాన్నీ, భయాన్నీకూడా కలిగించే ఒక దృశ్యం కంటబడింది. ఎత్తయిన ఒక కొండ అంచునుంచి పెద్ద జలధార ఒకానొక రాక్షసుడి నోట్లోనుంచి కిందకు దూకుతోంది. కొండరాతిలో ఆ రాక్షసాకారంలో వున్న తల చక్కగా మలచబడివుంది. చూచేవారికి జలధార ఆ భయంకరమైన శిరస్సులో పుట్టి బయటికి వస్తూన్నట్టు కనబడుతోంది.

"ఇది చాలా వింతగా వుంది. ఈ చుట్టుపక్కల ఎక్కడా మానవ నివాసాలే వున్నట్టు తోచదు. కాని ఈ శిరస్సు మానవులవల్లనే చెక్కబడిందనటం స్పష్టం," అంటూ సమరసేనుడు చాలా ఆశ్చర్యపడ్డాడు. సైనికులకు ఏమనేందుకూ తోచలేదు. నలుగురూ ఆ జలపాతంకేసి చూస్తూ నిలబడ్డారు. జలపాతానికి వెనక సొరంగం



ఒకటి వున్నట్టు కనబడుతోంది. బహుశా శివదత్తుడు దానినుంచే పారిపోయివుండవచ్చునన్న అనుమానం కలిగింది సమరసేనుడికి. అది చాలా సురక్షితమైన ప్రదేశమూ, ఎవరూ అనుమానించేందుకు వీలులేని చోటూ అయివుండవచ్చు.

సమరసేనుడు, శివదత్తుడు పంపిన పటం తీసి చూశాడు. అందులో ఒకచోట జలపాతం గుర్తు కనిపించింది. దానితో అతడికి తన అనుమానం నిజమని ధృవపడింది. సైనికులు వెంటరాగా అతడు మోకాటిబంటి నీటిలో నడిచి జలపాతం వెనక వున్న సొరంగంలోకి దొరబడ్డాడు.

కొంతదూరం వరకూ అంతా చీకటిగా వుంది ధైర్యంచేసి మరికొంత నడిచేసరికి వెలుగు కనిపించింది. చివరకు సొరంగం చివరిభాగం—అవతల సమతలప్రదేశం కనిపించినై. ఆ ప్రదేశం అంతా చాలా పల్లంగా వుంది. చుట్టూ ఎత్తయిన కొండలు.

సమరసేనుడూ, సైనికులూ సొరంగం నుంచి బయటికి వచ్చేసరికి యెక్కడ చూచినా నెమళ్లు గుంపులు గుంపులుగా కనబడినై. నాట్యంచేసేవి కొన్ని, గాలిలో ఎగురుతూ వింతవింత కేకలువేస్తూ కొన్ని.

"అన్ని నెమళ్ళను నేనెక్కడా చూడ లేదు," అన్నాడు సమరసేనుడు ఆశ్చర్యపోతూ. అతడి వెంటవున్న సైనికులలో ఏ ఒక్కరుకూడా ఇలాంటి వింతప్రదేశాన్ని ఎక్కడా చూచిఎరగరు.

కేవలం నెమళ్ల అందచందాలనుచూస్తూ నుంచుంటే పనికాదు. శివదత్తుడు ఎక్కడ వున్నదీ ముందు తెలుసుకోవాలి.

వాళ్ళు మరికొంత దూరం ముందుకు నడిచి, ఎదురుగా వున్న ఒక గుహను సమీపించారు. హఠాత్తుగా వారందరికీ ఏనుగు ఘీంకరించిన శబ్దం వినబడింది. అందరూ విస్తుపోయి చూస్తూన్నంతలో, గుహలో నుంచి ఒక ఏనుగు వేగంగా పరుగెత్తుతూ బయటికి దూకింది.

ఇలాంటి సంఘటనకు సన్నద్ధంగా లేని సమరసేనుడూ, సైనికులూ ఏనుగు ఒక్కసారి ముందుకు వురికేసరికి గుండెలు బేజారెత్తి చెల్లాచెదరుగా పక్కలకు పారిపోయారు.

సమరసేనుడు ఒక పెద్ద రాయివెనక దాక్కున్నాడు. ఏనుగు సొరంగంనుంచి ఘీంకరిస్తూ బయటకు దూకటమంటే — అవతల దానికేదో ప్రమాదం కలిగివుండాలి!

అక్కడ ఎవరు వున్నారో తెలుసుకోవటం ఎలా? శివదత్తుడు పటంలో సూచించిన గుర్తుల్ని తను గ్రహించలేకపోయాడా?

(ఇంకా వుంది)







## 14

[సమరసేనుడు, శివదత్తుడి భటులతో కలిసి అతడున్న పల్లెకు బయలుదేరాడుగదా? అతడు పల్లెను సమీపించేసరికి వ్యాఘ్రదత్తుడి సైనికులు పల్లెను కాల్చివేయటం కనిపించింది. అక్కడ శివదత్తుడి భటుడొకడు తమ నాయకుడు పారిపోయాడని చెప్పాడు. అతడికోసం బయలుదేరిన సమరసేనుడు కొండలమధ్య చిక్కుకుపోయాడు. తరవాత—]

సమరసేనుడు ఒక పెద్ద రాయివెనక దాక్కుని ఏనుగుకేసి చూస్తున్నాడు. అతడి వెంటవున్న సైనికులుకూడా ప్రాణాలు అరచేత పెట్టుకుని వణికిపోతున్నారు. ఒక గొప్ప ఏనుగులమంద ఆ సొరంగంనుంచి వెలువడి తమను నుగ్గునుగ్గుగా తొక్కివేస్తుందేమో అని వాళ్ళ భయం. వాళ్లు చాలా చిన్నజాగాలో చిక్కుకుపోయారు. అక్కడనుంచి పారిపోవాలంటే సులభం కాదు. అన్నివైపులా ఎత్తుగా వున్న కొండ రాళ్ళు మార్గాన్ని ఆటంకపరుస్తున్నవి.

ఇలా భయంతో కంపించిపోతున్న సైనికులకూ, సమరసేనుడికీ ఒకేసారి ఇద్దరు ముగ్గురు అరిచినట్టు ఆర్తనాదం వినిపించింది. ఆ ధ్వని గుహకు అవతల భాగాన్నుంచి వస్తున్నది. కాని తాము వున్న చోటునుంచి బయటకు రావటం ఎలా?

అందరూ ఇలాంటి ఆలోచనలతో తికమక అవుతూంటగా, ఏనుగు అన్నిదిక్కులూ పరికించిచూసి పెద్దగా ఘీంకరిస్తూ—యిదివరకు సమరసేనుడూ, సైనికులూ వచ్చిన గుహలోకి జొరబడింది. కొద్దిసేపట్లోనే అది



జలపాతంలోనుంచి పోతూన్నట్టు నీరు కలిచిబెట్టబడిన శబ్దం వినిపించింది.

ముందుగా సమరసేనుడు తను దాక్కున్న చోటునుంచి బయటికి వచ్చాడు. ఆవెంటనే సైనికులు బయటికివచ్చి అతణ్ణి సమీపించారు. గుహకు అవతలనుంచి వస్తున్న ఆర్తనాదం మధ్యమధ్య వినబడుతూనే వుంది.

"ఎవరో మహా విపత్తులో చిక్కుకున్నట్టుంది?" అన్నాడు ఒక సైనికుడు.

"అందుకు సందేహంలేదు. కాని ఏనుగు అంత హఠాత్తుగా అటునుంచి ఎందుకు పారిపోయి వచ్చివుంటుంది? బహుశా శత్రువులు మనకోసం పన్నిన వల కాదుగదా? అది నిజంగా ఆర్తనాదమా లేక..." సమరసేనుడు యిలా చెపుతూండగానే గుహ అవతలనుంచి పెద్ద కల్లోలం జరుగుతున్నట్టు అరుపులు వినిపించినై.

సమరసేనుడు యిక ఆలోచించి లాభం లేదనుకున్నాడు. గుహకు అవల వున్నవాళ్లు శత్రువులైనా, మిత్రులైనా—ఏదో ప్రమాద పరిస్థితిలో వున్నారు. కనుక ధైర్యంగా ముందుకు పోయి అదేదో తెలుసుకోవటం అవసరమనుకున్నాడు.

సమరసేనుడు సైనికులను హెచ్చరించి ముందు నడిచాడు. సన్నని గుహలోనుంచి కొద్దిదూరం నడిచేసరికి అవల గుహద్వారం, దానిని అనుకునే ఒక నీటిమడుగూ కనిపించినై. ఆ నీటిమడుగులో ఊడలు దించుకున్న కొన్ని చెట్లూ, బాగా ఎత్తుగా పెరిగిన నీటిజమ్మూ వుంది.

సమరసేనుడు మరికొద్ది దూరం వెళ్లేసరికి ముగ్గురు మనుష్యులు మోకాలు బంటి నీటిలో స్తంభాలకు బంధింపబడి వుండటం కంటబడింది. సమరసేనుణ్ణి చూడగానే వాళ్ళు మరింత పెద్దగా అరుస్తూ గోలచేయసాగారు.

పరిస్థితి ఏమిటో సైనికులకుగాని సమరసేనుడికిగాని అవగాహన కాలేదు. స్తంభా

లకు కట్టబడివున్న వ్యక్తులకు తక్షణం దాపురించబోతున్న ప్రమాదం ఏమీవున్నట్టు లేదు. వారి పక్కలగాని, చుట్టుపక్కల గాని ఎవరూ లేరు., తమను చూచికూడా, వాళ్ళెందుకు అంత పెద్దగా అరుస్తున్నారు? అన్న ఆశ్చర్యం సమరసేనుడికి కలిగింది.

బంధింపబడివున్న ముగ్గురనూ చేరాలంటే సమరసేనుడు నీటిమడుగులో దిగి కొంతదూరం వెళ్ళాలి. మడుగు అంతలోతు కాదని అక్కడ పెరిగిన నీటిజమ్మునుబట్టి తెలుస్తూనే వుంది. సమరసేనుడు కత్తీ, అంబులపొదీకూడా సర్దుకుని నీటిలో దిగాడు. సైనికులు అతణ్ణి అనుసరించి నడుస్తున్నారు. వారు మడుగులో కొద్ది దూరం నడిచేసరికి, కర్ణపుటాలు బద్దలయేలా ముగ్గురు బంధితులూ ఒక్కసారి కేకపెట్టారు. మరుక్షణంలోనే నీటి మడుగంతా అల్లకల్లోలం అయిపోయింది.

సమరసేనుడు నివ్వెరపోయి చూస్తున్నాడు. ఎదురుగా పెద్ద మొసలి నోరుతెరచి అతడి వైపుకే వస్తోంది. క్షణంలో అతడు పరిస్థితి గ్రహించాడు. బంధితులు అంత గోలచేయటానికి కారణం యీ భయంకరమైన మొసలే!

కత్తి ఒరలోపెట్టి సమరసేనుడు బాణం ఎక్కుపెట్టాడు. మొసలి పెద్దగా నోరు





తెరిచి కోరలుచాస్తూ ముందుకు రాసాగింది. దానిని కొంచెం దగ్గరకు రానిచ్చి సమర సేనుడు బలంకొద్దీ బాణాలు దాని నోట లోకి గురిగా కొట్టాడు. ఆ దెబ్బతో మొసలి నీటిలో ఒక క్షణకాలం గిలగిల కొట్టుకుని, తిరిగి ముందుకు రాసాగింది. మెరుస్తున్న దాని కళ్ళు భయం కలిగిస్తున్నవి.

ఈసారి సమరసేనుడు తన కత్తితో దాని మీదికి లంఘించి బలంగా దాని వెన్ను మీద రెండు పోట్లు పొడిచాడు. మొసలి చావుదెబ్బలు తిని నీటిలో తన్నుకోసాగింది. భయకంపితులై చూస్తున్న సైనికులకు ప్రాణం తెప్పరిల్లినట్టయింది.

తరవాత స్తంభాలకు కట్టివేయబడిన వాళ్ళను సమీపించాడు సమరసేనుడు. వాళ్ళ ముఖాలు చూడగానే సమరసేనుడికి కలిగిన ఆశ్చర్యం అంతా యింతా కాదు. ఆ ముగ్గురూ—తను గుహలో వ్యాఘ్రదత్తుడి భటులవల్ల బంధింపబడక పూర్వం తనతో వున్నవాళ్లు. కాని నాలుగోవా డేమయినట్టు?

సమరసేనుణ్ణి చూడగానే ఆ ముగ్గురు సైనికులూ అమితాశ్చర్యం చెందారు. వారి ఆనందానికి మేరలేదు. తలవని తలంపుగా ప్రాణరక్షణ జరగటమే కాక, తమ నాయకుడు కూడా కనిపించాడు.


"సేనానీ, మిమ్మల్ని చూడగలమని అనుకోలేదు," అన్నాడు ఒక సైనికుడు.

"ఆ నాలుగో సైనికుడెక్కడ?" అని అడిగాడు సమరసేనుడు.

"సేనానీ, అతణ్ణి మీరు చంపిన మొసలి పొట్టన బెట్టుకున్నది. సమయానికి మీరు రాకున్నట్టయితే మేమూ అతడి దారినే పోయేవాళ్లం," అని జవాబిచ్చారు సైనికులు.

"మీరు ఎవరివల్ల యీవిధంగా బంధింపబడ్డారు?" అని అడిగాడు సమరసేనుడు.

సైనికులు జరిగినదంతా కొద్దిలో చెప్పారు. తమ నాయకుణ్ణి వెతుక్కుంటూ వాళ్ళు కూడా గుహలోని రహస్యద్వారం



గుండా యీ ప్రాంతానికి వచ్చారు. అక్కడ వారిని వ్యాఘ్రదత్తుడి భటులు బంధించి, తమ నాయకుడి ఆజ్ఞప్రకారం, యీ మడుగులో మొసలికి ఆహారంగా విడిచిపుచ్చారు.

"మమ్మల్ని వాళ్ళు యిక్కడ బంధించి వెళ్ళిపోయి ఎంతోకాలం కాలేదు. ఆ చెట్ల చాటునుంచి పరీక్షిస్తే వాళ్ళు వెళ్లేమార్గం కనబడుతుంది," అన్నారు సైనికులు.

అందరూ అక్కడ వున్న చెట్లచాటుకు వెళ్లి చూశారు. వ్యాఘ్రదత్తుడు తన భటులతో బారులుతీరి పోతూవుండటం వాళ్లకు కనిపించింది. సమరసేనుడు వ్యాఘ్రదత్తుడి మూకను చూడగానే పళ్లు కొరికాడు. కాని తనదగ్గరవున్న కొద్దిమంది సైనికులతో తను చేయగలిగిందేమీలేదు. ముందు శివదత్తుడి వునికి ఎక్కడో తెలుసుకోవటం ముఖ్యం.


సమరసేనుడు యిలా ఆలోచించేటంతలో ఒక సైనికుడు చిన్న కేకవేసి చెట్టుకొమ్మలకేసి చేయి చూపాడు. అక్కడ ఒక కొమ్మనుంచి ఒక కాయితం వేల్లాడుతోంది. సమరసేనుడు ఆశ్చర్యపోయి దానిని అందుకొని ఆతృతగా విప్పి చూశాడు. అందులో యిలా రాయబడివుంది:

"ఇది భయంకర ప్రదేశం. త్వరగా ఈ ప్రాంతాన్ని విడిచిపొండి."

అది శివదత్తుడి హెచ్చరికే అని సమరసేనుడు గ్రహించాడు. చాలా హడావిడిలో రాయబడినట్టు, కుదురుగా లేని అక్షరాలను బట్టి తెలుస్తూనే వుంది. వెంటనే అక్కడినుంచి కదలటం క్షేమమని నిర్ణయించుకున్నాడు సమరసేనుడు.

సమరసేనుడు వచ్చినదారినే వెనక్కు పొదలిచాడు. కాని ఒక సైనికుడు ఒక గుహకేసి చూపుతూ, "చూడండి, ఈ గుహ వైపుకు చాలామంది మనుషులు నడిచినట్టు మార్గం కనబడుతోంది," అన్నాడు.

సమరసేనుడు అటుకేసి నాలుగైదడుగులు వేసి పరీక్షించి చూశాడు. సైనికుడు


CHITRA


చెప్పినది నిజమే అనిపించింది. ఒకవేళ శివదత్తుడు యీ మార్గంనుంచే ప్రయాణించాడా అన్న అనుమానంకూడా ఆతడికి కలిగింది.

సమరసేనుడు గుహను సమీపించి లోపలకు తొంగిచూశాడు. అంతా చీకటిమయం. సైనికులలో ఒకడు కాగడా వెలిగించగా, ఆ వెలుగులో ముందుకు నడిచాడు.

కొంచెందూరం వెళ్ళేసరికి వాళ్ళకు కనబడిన దృశ్యం భయాన్నీ, ఆశ్చర్యాన్నీ కూడా కలిగించింది. ఒకచోట రాతితో చెక్కబడిన సింహాసనం! దానిచుట్టూ మానవాకారంలో వున్న విగ్రహాలు! వాళ్ళ పోలికలూ, ధరించిన ఆయుధాలూ చూస్తే ఆటవికులలా కనబడ్డారు.

"ఇది ఎవరో ఆటవిక నాయకుడి సమాధి స్థలం కావొచ్చు! ఏదయినా-యింత భయంకర ప్రదేశాన్ని నే నెక్కడా చూడలేదు. ఆ ఆటవికుల భయంకర విగ్రహాలు చూస్తూంటే—నాకు ఏకాకిమాంత్రికుణ్ణి చూసినప్పటికంటె ఎక్కువ భీతి కలుగుతోంది," అన్నాడు సమరసేనుడు.

తమ నాయకుడే యిలా అనేసరికి యిక సైనికుల భయానికీ, భీతికీ కట్టలు తెగినై. వాళ్ళు ఒకరి ముఖాలు ఒకరు చూచు



కొన్నారు. మరీ భీతిచెందిన ఒక సైనికుడు వెనక్కు పారిపోసాగాడు.

సమరసేనుడు తను అనాలోచితంగా అన్న మాటలకు చాలా నొచ్చుకున్నాడు. నాయకుడు ఎన్నడూ, ఎలాంటి పరిస్థితులలోనూ భయపడుతూన్నట్టు బయటకు తెలియనియకూడదు.

సమరసేనుడు తతిమ్మా సైనికులకు ధైర్యంచెప్పి, గుహద్వారంకేసి బయలుదేరాడు. ఈ ప్రదేశాన్ని ఎంత త్వరగా వదిలిపోతే, తనకూ తన సైనికులకూ అంత క్షేమం అనిపించిం దతడికి. శివదత్తుడు ఎక్కడ వున్నదీ తెలుసుకోవటం చాలా

కష్టసాధ్యంగానే కనిపించింది. శివదత్తుడి సంగతి వదిలేసి–తను తిరిగి బయలుదేరిన చోటుకు వెళ్ళిపోదామా అనుకున్నాడు. కాని అక్కడా పరిస్థితులు తనకేమంత అనుకూలంగా లేవు. ఒకవైపున ఏకాక్షిమాంత్రికుడి బెడద, రెండోవైపున కుంభాండుడు!

ఎన్ని కష్టాలకైనా ఓర్చి శివదత్తుణ్ణి కలుసుకోవటమే ఉత్తమం అనుకున్నాడు సమరసేనుడు. దేవీప్రసాదితమైన త్రిశూలం ఎక్కడవున్నదీ అతడికి తెలుసు. ఏకాక్షి, చతుర్నేత్రుల గుహపైన శాక్తేయుడిది ఆ త్రిశూలం. కనక దాని శక్తికి తిరుగు వుండదు!

కాని శివదత్తుడి ధోరణికూడా సమరసేనుడికి కొంత అనుమానం కలిగించింది. నిజంగా అతడు తనకు మిత్రుడా లేక అలా నటించుతున్నాడా?

నావలోని ధనరాసులూ, దాన్ని కాపాడుతున్న నాగకన్యా—వీళ్ళందరికీ తెలుసునన్నది నిజం. ఏకాక్షిమాంత్రికుడూ, చతుర్నేత్రుడే కాక వాటికోసం వ్యాఘ్రదత్తుడూ, శివదత్తుడూకూడా ప్రయత్నిస్తున్నారు. ఈ అందరి కొట్లాటలమధ్యా చిక్కుకుని తను అనవసరంగా కష్టాలపాలవుతున్నాడు.

ఇలా ఆలోచిస్తూ సమరసేనుడు గుహ బయటికి వచ్చాడు. ఎటు పోవటమా అని అతడు ఆలోచించేటంతలో పెద్ద కేకలు వినబడటం, అవెంటనే బరిశెలూ, బాణాలూ విసురుగా మీదికి రావటం జరిగింది.

"శత్రువులు! రాళ్ళచాటుకు పరుగెత్తండి!" అని అరుస్తూ సమరసేనుడు రాళ్లగుట్టలకేసి పరుగెత్తాడు. భీకరంగా అరుస్తూ కొండలపైనుంచి బాణాలవర్షం కురిపిస్తూ చాలామంది సైనికులు కనిపించారు. వారెవరు? వ్యాఘ్రదత్తుడి సైనికులా, లేక కుంభాండుడి ఆటవికులా?

—(ఇంకా వుంది)






## 15


[శివదత్తుణ్ణి వెతుక్కుంటూ బయలుదేరిన సమరసేనుడు, అదృష్టవశాత్తూ తన సైనికులు మొసలి వాత బడకుండా కాపాడాడుగదా? వాళ్ళద్వారా వ్యాఘ్రదత్తుడు ఎటు వెళ్ళుతున్నదీ గ్రహించాడు. శివదత్తుడు హెచ్చరికగా చెట్టుకు కట్టిపోయిన పత్రంకూడా అతడి కంటబడింది. కాని ఆదేసమయంలో అతణ్ణి వ్యాఘ్రదత్తుడు ఎదిరించాడు. తరవాత—]

సమరసేనుడు తమపై బాణవర్షం కురిపిస్తున్నవా రెవరైందీ తెలుసుకునేందుకు ఆట్టేకాలం పట్టలేదు. "వ్యాఘ్రదత్తుడికి జై! వ్యాఘ్రమండలానికి జై" అన్న వాళ్ళ కేకలూ, అరుపులూ కొండగుహలు ప్రతిధ్వనించేలా వినబడుతున్నయ్.

"వీళ్లు వ్యాఘ్రదత్తుడి భటులు, మనము వున్నచోటు తెలుసుకున్నారు. హఠాత్తుగా దాడిచేసి మనందర్నీ హతమార్చాలని చూస్తున్నారు." అని సమరసేనుడు సైనికులను హెచ్చరించాడు.

వ్యాఘ్రదత్తుడి భటులు కొండరాళ్ళ వెనక పొంచివుండి, సమరసేనుడిపైనా, అతడి సైనికులపైనా బాణాలు ప్రయోగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో బ్రతికి బయటపడాలంటే అతడికి ఒక్కటే మార్గం కనబడింది—రాళ్ళచాటున దాక్కుంటూ ఆ ప్రదేశాన్నుంచి పారిపోవడం!

సమరసేనుడితోపాటు సైనికులుకూడా నిశ్శబ్దంగా రాళ్ల వెనక నక్కుతూ, ఎదురుగా వున్న సొరంగంకేసి పాకసాగారు. ఆ సొరంగం ఎక్కడికి దారితీస్తుందో—అవతల



ఏమున్నదో అన్న సంశయం వాళ్ళను అంతగా బాధించలేదు. ముందు వ్యాఘ్రదత్తుడి వలనుంచి బయటపడటంమీదే వాళ్లు దృష్టిని కేంద్రీకరించారు.

చివరకు అందరూ సురక్షితంగా ఒక చీకటిగుహ చేరారు. వ్యాఘ్రదత్తుడి భటుల అడుగులూ, కేకలూ క్రమంగా తగ్గసాగినై. వాళ్ళు తమను వెతుకుతూ మరోదారిన పోయారని సమరసేనుడు ఊహించాడు.

అప్పటికి బాగా ప్రొద్దెక్కి సరిగా మిట్ట మధ్యాహ్నమయింది. సమరసేనుడు చీకటిగా వున్న గుహలో తడుముకుంటూ కొంచెం ముందుకు సాగాడు. అతడికి ఆ రెండవకొననుంచి సన్నని సూర్యకాంతి కనిపించింది. అతడు మరికొంత ముందుకు నడిచి గుహకు అవలివైపు చేరాడు.

సమరసేనుడు తన కళ్ళను నమ్మలేక పోయాడు. ఇది కలా, నిజమా అనిపించింది. ఎట్టఎదుట పటంలో శివదత్తుడు కనబరిచిన శిథిలాలు కంటబడినై. ఏదో ఒక మహానగరం భూకంపంవల్ల సర్వనాశనం అయినట్టు, పెద్దపెద్ద భవనాలు గోడలు విరిగిపడి, స్తంభాలు పగిలిపోయిన స్థితిలో—అతడికి ప్రత్యక్షమయినై.

ఆది శివదత్తుడు పటంలో సూచించిన శిథిలనగరం అనేందుకు సందేహం లేదు. శివదత్తుడు యిక్కడనే-ఎక్కడో దాక్కుని వుంటాడు. తను ధైర్యంచేసి ముందుకు వెళ్లడమే మంచి దనుకున్నాడు సమరసేనుడు. అతడి సైనికులుకూడా, ఆశ్చర్యంగా ఆ శిథిలనగరంకేసి చూస్తున్నారు.

అప్పుడు ఏంచేయాలి? అనే ఆలోచన కలిగి సమరసేనుడు ఒక నిర్ణయానికి వచ్చేటంతలో-ఆ ప్రదేశమంతా దద్దరిల్లేట్టు శంఖనాదాలూ, కేకలూ వినిపించినై. మరుక్షణం దాదాపు యాభై అరవైమంది భటులతో వ్యాఘ్రదత్తుడు ఆ శిథిల భవనాల మార్గాన వస్తున్నాడు.


సమరసేనుడు సైనికులను హెచ్చరించి, వ్యాఘ్రదత్తుడు ఎటువెళతాడా అని వేయి కళ్ళు చేసుకుని చూడసాగాడు. వ్యాఘ్రదత్తుడి వాలకంచూస్తే-అతడు తమమాటే మరిచిపోయినట్టు కనబడుతోంది.

అతడు తను సాధించ దలుచుకున్న మహాకార్యం సాధించినవాడిలా ముందు ధీమాగా నడుస్తున్నాడు. ఇక భటులు నవ్వుతూ, కేరింతలు కొడుతున్నారు.

శివదత్తుడు ఎక్కడ దాక్కున్నదీ గ్రహించి వ్యాఘ్రదత్తుడు అతన్ని బందీగా పట్టుకున్నాడా? అన్న అనుమానం కలిగింది సమరసేనుడికి. కాని భటులవెంట బందీ చేయబడినవారెవరూ లేరు. 'బహుశా అపూర్వశక్తులు గల కార్తేయుడి త్రిశూలం ఎక్కడవున్నదీ అతడికి తెలిసిపోయి వుండవచ్చు' అనిపించింది సమరసేనుడికి.

వ్యాఘ్రదత్తుడు శిథిలమైపోయిన భవనాలవెంట తన భటులను నడిపించసాగాడు. అతడు వెళ్ళవలసిన చోటు ఏదో ముందే నిర్ణయించుకున్నట్టు సూటిగా భటులకు దారిచూపుతున్నాడు.

ఆలాంటి అదనుకోసమే వేచివున్న సమరసేనుడు రాళ్లచాటున నక్కుతూ తన సైనికులతో ఒక శిథిలమైవున్న పెద్ద భవన ప్రాంగణం చేరుకున్నాడు. అక్కడ సగం





విరిగి, పడిపోయావున్న స్తంభాల చాటున వుండి జాగర్తగా చూడసాగాడు.

వ్యాఘ్రదత్తుడు భటులముందు నడుస్తున్నవాడల్లా ఒకచోట ఠక్కున ఆగి "వ్యాఘ్రయోధులారా! మన శ్రమ ఫలించే రోజు వచ్చింది. మీలో ప్రతిఒక్కర్ని ఒక దేశానికి రాజుగా చేస్తానని వాగ్దానంచేశాను గదా? ఆ వాగ్దానం నిలుపుకుంటాను. కాని మీరు ఈ నిమిషాన ఒక సాహసకార్యం చెయ్యవలసివుంది!" అన్నాడు గంభీరంగా.


"మేము ఎంతటి సాహసకార్యానికైనా సంసిద్ధులమే! అదేమిటో చెప్పండి," అంటూ భటులు కేకలు వేశారు.

వ్యాఘ్రదత్తుడు మందహాసంచేస్తూ "ఈ శిథిలనగరంలో మన కోర్కెలు నెరవేర బోతున్నవి. అదుగో, ఆ కనబడే భవనం చూశారుగదా? దాని సింహద్వారం విరిగి పోయి రాళ్లతో కప్పబడి వుంది. మీరు అక్కడ అడ్డుగా వున్న రాళ్ళనూ, స్తంభాలనూ తొలగించి మార్గం సరిచేయండి. మనం వెతికిపట్టవలసిన అమూల్యవస్తువు ఆ భవనంలోనే వుంది, దానికి మార్గం సింహద్వారాన్నుంచి," అన్నాడు.

వ్యాఘ్రదత్తుడు ఇలా చెప్పేసరికి భటులలో ఎక్కడలేని ఉత్సాహమూ పుట్టుకొచ్చింది. వాళ్ళు నవ్వుతూ, కేకలు వేస్తూ, హెచ్చరికలు చేసుకుంటూ ఆ శిథిలభవనాన్ని సమీపించారు. కొందరు పలుగులు తీసుకుని ద్వారానికి అడ్డుగా వున్న పెద్ద పెద్ద గండశిలలను పక్కకు నెట్టసాగారు.

భటులు వాళ్ళ ఉత్సాహంలో, దురాశలో మునిగి తమకు రానున్న ప్రమాదాన్ని గ్రహించలేదు. శిథిలమైపోయిన ఆ భవనం తాలూకు గోడలూ, స్తంభాలూ పక్కలకు ఒరిగి పడేందుకు సిద్ధంగా వున్నవి.

దూరంగా వుండి ఇదంతా గమనిస్తున్నాడు సమరసేనుడు. వ్యాఘ్రదత్తుని ఆజ్ఞాపాలన చేస్తున్న భటులు ఏ గోడో, స్తంభమో విరిగి





మీదపడటంతో బలవంతపు మరణం చెందుతారని తోస్తూనేవుంది.


వ్యాఘ్రదత్తుడు మాత్రం కొంచెం ఎడంగా నిలబడి రాళ్ళను పక్కలకు లాగుతూన్న భటులకు ఉత్సాహం కలిగిస్తున్నాడు. అతడు పక్కలకూ, భవనంకేసీ చూస్తూన్న ధోరణినిబట్టి—అతడికూడా రానున్న ప్రమాదం తెలుసుననేది సమరసేనుడు గ్రహించగలిగాడు.

వ్యాఘ్రదత్తుడు కావాలనే తన భటులను ఇలాంటి ప్రమాదంలో చిక్కుకునేట్లు చేస్తున్నాడు. ఈ వూహ సమరసేనుడికి కలిగేటంతలో పెళపెళా రావాలతో శిథిల భవనం ఒక్కసారిగా కిందకు కూలింది. విరిగిపడుతున్న స్తంభాలకిందా, గోడల కిందా పడి వ్యాఘ్రదత్తుడి భటులు చాలా మంది హాహాకారాలు చేస్తూ తృటిలో మరణించారు. అదృష్టవశాత్తూ ప్రమాదంనుంచి బయటపడిన కొందరు భటులకు శరీరాలన్నీ గాయాలమయంగా తయారైనై.

ఈ భయంకర సంఘటన కళ్ళు మూసి తెరిచేంతలో జరిగిపోయింది. ప్రాణాలతో బయటపడిన కొద్దిమంది భటులతో వ్యాఘ్రదత్తుడు కొంచెందూరం పారిపోయి నిలబడ్డాడు. తనను నమ్మి అనేకమంది భటులు దుర్మరణంపాలుకావటం అతడికి చీమ కుట్టినంత బాధకూడా కలిగించలేదు

"వ్యాఘ్రేశ్వరికి ఏదో అపచారం జరిగింది! అందువల్లనే అంతమంది భటులూ ఈ సింహద్వారం ముందు బలిఅయిపోయారు. ఇక మనకు వచ్చిన భయం లేదు. ధైర్యంగా వుండండి," అంటూ అతడు మిగిలిన ఇరవైమంది భటులకూ ధైర్యవచనాలు పలికాడు.

భటులు కంపించిపోతూ తమ నాయకుడైన వ్యాఘ్రదత్తుడి మాటలకు తలలు వూపారు. అప్పుడు వ్యాఘ్రదత్తుడు తన చేతులోవున్న ఒక పటాన్ని చూపుతూ,



"అపురూప శక్తులు గల కార్తేయుడి త్రిశూలం వున్నచోటు మీ అందరికీ చెప్పదలిచాను. దాని ప్రభావంవలన మిగిలివున్న మనమే ఈ ప్రపంచానికి రాజాధిరాజులం కావచ్చు. ఆ త్రిశూలం ఉన్న చోటు ఈ పటంలో స్పష్టంగా చూపబడింది. 'ఏనుగుల వనంలోని, విషవృక్షానికి వంద గజాల దూరంలో, మృతవీరుల సమాధి క్రింద, గురుద్రోహి అస్థిపంజరంలో కార్తేయుడి త్రిశూలం దాచబడివుంది," అన్నాడు వ్యాఘ్రదత్తుడు.

చాటున వుండి ఈ మాటలు వింటూన్న సమరసేనుడికి ఆశ్చర్యంతో అంతకన్న భయంతో దేహం వణికిపోయింది. ఏ అపూర్వశక్తులు గల త్రిశూలంకోసం మంత్రాలదీవిలో అన్ని హత్యలూ, యుద్ధాలూ జరుగుతున్నవో, ఆ త్రిశూలం చివరకు వ్యాఘ్రదత్తుడిలాటి పరమదుష్టుడికి లక్ష్యం కాబోతున్నది!

అప్పుడు కర్తవ్యమేమిటి? అన్న ప్రశ్న సమరసేనుణ్ణి బాధించసాగింది.

శివదత్తుడు ఏమయాడు? అతడికి త్రిశూలం ఎక్కడ వున్నదీ తెలుసా? తన దగ్గర వున్న అరుగురు సైనికులతో వ్యాఘ్రదత్తుణ్ణి ఎదుర్కొనటం క్షేమమా, కాదా?

సమరసేనుడు ఎటూ నిర్ణయించుకోలేక పోతున్నాడు. ఒకసారి వ్యాఘ్రదత్తుడిచేతికి ఆ త్రిశూలం చిక్కటంజరిగితే, ఇక అతణ్ణి ఎదిరించటం ఎవరితరమూ కాదు. మంత్ర తంత్ర విద్యల్లో సాటిలేనివారిమని భావించే ఏకాక్షి, చతుర్నేత్రులుకూడా అతడికి దాసోహం అనక తప్పదు. ధనరాసులతో నిండివున్న నావా, దానిని కాపాడుతున్న నాగకన్యాకూడా అతడి వశమైపోక తప్పదు.

ఇలాంటి అపత్సమయంలో తనకు సహాయం చేయగలవాడు ఒక్క చతుర్నేత్రుడుతప్ప ఎవరూలేరు. కాని చతుర్నేత్రుడికి యీ పరిస్థితి తెలియటం ఎట్లా?

నాగకన్యకోసం ప్రయత్నించే అతడికి కాక్తేయుడి శక్తివంతమైన త్రిశూలం సంగతి తెలుసునా, తెలియదా? ఆ త్రిశూలం ఒక్కదాన్ని సంపాయించ గలిగితే— మొత్తం ఈ ద్వీపాన్నే కాక ప్రపంచాన్నే జయించవచ్చు!

సమరసేనుడు ఇలాంటి ఎడతెగని ఆలోచనలలో ఉండగా, వ్యాఘ్రదత్తుడి కంచు కంఠం తిరిగి మార్మోగింది.

"రేపు మహాపర్వదినం. అమావాస్యా ఆదివారం. కనుక ఈ రాత్రికి ఇక్కడే విశ్రాంతి తీసుకుందాం. రేపు రాత్రి సరిగా ఒంటిగంటకు మనం ఏనుగులవనం ప్రవేశించాలి."

వ్యాఘ్రదత్తుడు భటులకు ఈ విధంగా చెప్పి, అక్కడవున్న ఒక రాతిమీద కూర్చున్నాడు. భటులుకూడా తమ తమ ఆయుధాలు కింద పెట్టి అతడి చుట్టూతా వలయాకారంగా కూర్చున్నారు.

సమరసేనుడికి వ్యాఘ్రదత్తుడి మాటలు కొంత ఆశ కలిగించినై. తనకు యింకా యిరవైనాలుగు గంటల వ్యవధి వున్నది. ఈకాలంలో తను ఏదోవిధంగా—ఆఖరికి నిద్రిస్తున్న వ్యాఘ్రదత్తుడిమీద పొంచి దూకి అయినా సరే హతమార్చాలి. ప్రస్తుతానికి తనూ, తన సైనికులుకూడా విశ్రాంతి తీసుకోవచ్చు.

ఇలా ఆలోచించి సమరసేనుడు గిరుక్కున వెనక్కు తిరిగాడు. ఆ తిరగటంలో అతను ఆనుకునివున్న సగం విరిగిన రాతిస్తంభం పెద్ద ధ్వనిచేస్తూ కింద పడింది.

ఆ ధ్వని వింటూనే దెబ్బతిన్న బెబ్బులిలా వ్యాఘ్రదత్తుడు లేచి నిలబడ్డాడు. అతడితో పాటు భటులుకూడా తమతమ ఆయుధాలతో లేచి నుంచున్నారు. వ్యాఘ్రదత్తుడి దృష్టి సూటిగా సమరసేనుడు దాక్కొని వున్న శిథిలభవనం మీదికే ప్రసరించింది.

—(ఇంకా వుంది)






## 16

[వ్యాఘ్రదత్తుడి కంటబడకుండా తప్పించుకు పారిపోయిన సమరసేనుడు శిథిలనగరంలో దాక్కున్నాడు. అక్కడికి వ్యాఘ్రదత్తుడు తన భటులతో వచ్చాడు. కార్తికేయుడి అపూర్వ శక్తులు గల త్రిశూలం ఏనుగులవనంలోని గుహ్యద్వీప అస్థిపంజరంలో వున్నదని తెలిసింది. వ్యాఘ్రదత్తుడు సమరసేనుడు దాక్కున్న చోటును గుర్తించాడు. తరవాత—]

సమరసేనుడూ, సైనికులూ దాగివున్న ప్రదేశాన్ని వ్యాఘ్రదత్తుడు గుర్తించాడు. శిథిలభవనం స్తంభాలవెనక పొంచివున్న వాళ్లు శివదత్తుడూ, అతడి అనుచరులూ అయివుంటారన్న అనుమానం అతడికి కలిగింది. వాళ్లు ఎవరైనా ముందువాళ్ళను పట్టి బంధించాలి. లేకపోతే ప్రమాదం అనుకున్నాడు వ్యాఘ్రదత్తుడు.

సమరసేనుడుకూడా రానున్న ప్రమాదాన్ని గుర్తించాడు. తనదగ్గర వున్న ఆరుగురు సైనికులతో వ్యాఘ్రదత్తుణ్ణి ఎదుర్కొనటం ఆత్మహత్యతో సమానమని అతడు నిర్ణయించుకున్నాడు. అలాంటి స్థితిలో తను చేయవలసింది, సాధ్యమయినంత తొందరగా పారిపోవటం.

వ్యాఘ్రదత్తుడి సైనికులు భయంకరంగా అరుస్తూ ఒక్కుమ్మడిగా సమరసేనుడు దాగివున్న శిథిలభవనంకేసి దూకారు. సమరసేనుడుకూడా సైనికులను హెచ్చరించి అక్కడినించి పారిపోసాగాడు.

ఆరుగురు సైనికులూ, సమరసేనుడూ ఒకవైపు; ఇరవైమంది భటులూ, వారి



నాయకుడైన వ్యాఘ్రదత్తుడూ ఒకవైపు— యిక ఆ ప్రదేశమంతా వాళ్ళ కేకలతో హెచ్చరికలతో మార్మోగిపోసాగింది.

శిథిలభవనాల్లోని గదులలో, గోడల చాటునా దాక్కుంటూ సమరసేనుడూ, సైనికులూ అక్కడినుంచి తప్పించుకో జూస్తున్నారు. కాని వ్యాఘ్రదత్తుడు తన భటులను రెండు ముఠాలుగా చేసి వాళ్లను చుట్టుముట్టేందుకు పురిగొల్పాడు.

విరిగిన స్తంభాలచాటునా, పడిపోయిన గోడలమాటునా పొంచివుండి బాగా దాపులకువచ్చిన వ్యాఘ్రదత్తుడి భటులను, సమరసేనుడూ, సైనికులూ ఎదుర్కొనసాగారు. కొందరినైనా వ్యాఘ్రదత్తుడి భటులను హతమార్చందే తనూ సైనికులూ అక్కడినించి పారిపోగలగటం అసంభవమని సమరసేనుడు నిర్ణయించుకున్నాడు.

వ్యాఘ్రదత్తుడు తన భటులకు ధైర్యం చెబుతూ తనే సమరసేనుణ్ణి ఎదుర్కొదలిచాడు. అప్పటికే వ్యాఘ్రదత్తుడి భటులలో నలుగురైదుగురు, సమరసేనుడి కత్తికి బలి అయిపోయారు.

ఎటుచూచినా కేకలూ, గాయాలు తిన్నవాళ్ళ మూలుగులూ ఆ ప్రదేశమంతా భీకరంగా వుంది. అటువంటి సమయంలో వ్యాఘ్రదత్తుడు ముందుకు దూకి సమరసేనుణ్ణి ఎదుర్కొన్నాడు.

అతి బలశాలురూ, ధైర్యవంతులూ అయిన సమరసేన—వ్యాఘ్రపత్తులమధ్య కత్తియుద్ధం ప్రారంభమైంది. వారి కాళ్ళ అదురుకూ, కత్తివెబ్బలకూ శిథిలమైపోతూ ఒరిగివున్న స్తంభాలూ గోడలూ కిందపడసాగాయి. కిందపడుతూన్న వాటినుంచి పక్కకు తప్పుకుంటూ వాళ్ళిద్దరూ అతి భీకరంగా యుద్ధం చేయసాగారు.

పోరు కొంతసేపు జరిగేసరికి వ్యాఘ్రదత్తుడు క్రమంగా అలసట చెందాడు. ఇది గ్రహించిన సమరసేనుడు తన బలాన్నీ,

చాకచక్యాన్ని కూడగట్టుకుని అతణ్ణి హతమార్చేందుకు ముందుకురికాడు

ఈలోగా సంఖ్యలో రెట్టింపువున్న వ్యాఘ్రదత్తుడి భటులు సమరసేనుడి సైనికులను బంధించగలిగారు. సైనికులలో ఇద్దరు ముగ్గురు బాగా గాయపడిపోయారు. అవిఘంగా సైనికులను బంధించిన వ్యాఘ్రదత్తుడి భటులు తమ నాయకుడికి సహాయపడేందుకు బయలుదేరారు. కోలాహలం అణగిపోవటం, తన సైనికుల కేకలు వినబడకపోవటంవల్ల సమరసేనుడు తనవారందరూ బంధింపబడటమో చంపబడటమో జరిగివుంటుందని గ్రహించాడు.

ఇక యిప్పుడు తను సాధ్యమైనంత శీఘ్రంగా వ్యాఘ్రదత్తుణ్ణి తుదముట్టించి అక్కడినుంచి పారిపోవాలి.

ఇలా ఆలోచించిన సమరసేనుడు రెట్టించిన ఉద్రేకంతో వ్యాఘ్రదత్తుడితో పోరసాగాడు. తనను వ్యాఘ్రదత్తుడి భటులు వెనకనుంచి ఎదుర్కోకుండా వుండేందుకు ఒక గోడనానుకుని సమరసేనుడు యుద్ధం చేస్తున్నాడు. కాని పాపం అతడికి తనానుకునివున్న గోడ శిథిలావస్థలో వున్నదనీ, విరిగి వెనక్కు పడిపోయేందుకు సిద్ధంగా వుందని తెలీదు. ముందుండి పోరాడుతున్న వ్యాఘ్రదత్తుడు ఈసంగతి గ్రహించాడు.





హఠాత్తుగా వ్యాఘ్రదత్తుడి భటుల కఠోర కంఠాలు ఒక్కసారిగా మార్మోగినై. వాళ్లు సమరసేనుడి సైనికులందరనూ బంధించి తమ నాయకుడికి సహాయపడేందుకు మూక ఉమ్మడిగా ముందుకు దూకుతున్నారు. రానున్న ప్రమాదాన్ని గుర్తించిన సమరసేనుడు తన కత్తితో వ్యాఘ్రదత్తుడి మీదికి ఒక్కసారి లంఘించి, గోడమీది నుంచి దూకేందుకు ఎగిరాడు.

సమరసేనుడు అలా గోడమీదికి ఎగిరే సరికి అసలే శిథిలమై కూలిపోయేందుకు సిద్ధంగా వున్న గోడ కాస్తా పెళపెళమంటూ ఒక్కసారి విరిగి వెనక్కు పడిపోయింది. దానితోపాటు సమరసేనుడు అవతలవైపుకు పడి ఆ రాళ్లమధ్య చిక్కుకుపోయాడు.

వ్యాఘ్రదత్తుడికి యిది చక్కని అదను కలిగించింది. అతడు ఒక్కసారి విజయ ధ్వానం చేస్తూ సమరసేనుడి మీదికి ఉరికాడు. అంతలో అతడి భటులుకూడా వచ్చి సమరసేనుడి కాళ్లూ, చేతులు గట్టిగా పట్టుకుని కదలకుండా చేశారు.

వ్యాఘ్రదత్తుడు ఆజ్ఞాపించగానే సమరసేనుడి చేతులు తాళ్లతో బంధించబడినై. అతడి కత్తిని వ్యాఘ్రదత్తుడు స్వాధీన పరుచుకున్నాడు.

తన శత్రువు చేజిక్కి దన్న సంతోషంతో వ్యాఘ్రదత్తుడు పరవశుడైపోయాడు. అతడు క్రూరంగా నవ్వుతూ:

"చివరికి ఎట్లా అయితేం నా చేతిలో చిక్కావు. మొదట నాకు తటస్థపడినప్పుడే నాతో రాజీపడివున్నట్లయితే నీకినాడు యీ దుర్గతి పట్టేదికాదు. శాక్తేయుడి అపూర్వ శక్తులు గల త్రిశూలం ఎక్కడున్నదీ నాకు తెలిసిపోయింది. నీకుమాత్రం దుర్మరణం తప్పదు!" అన్నాడు.

వ్యాఘ్రదత్తుడి మాటలకు సమరసేనుడు చలించలేదు. ఒకవేళ తనకు దుర్మరణమే తప్పనిసరైతే అందుకు అతడు సిద్ధంగానే



వున్నాడు. అతడికి అప్పట్లో తననుగురించి కన్న తన నాయకత్వాన్ని నమ్ముకుని కష్టాలపాలైన సైనికులను గురించే ఎక్కువ బాధ కలిగింది. సేనాని అయిన తను సైనికులకు సరైన నాయకత్వం యివ్వలేక పోయానా, అని అతడు ఆత్మపరీక్ష చేసుకో సాగాడు. ఆ కారణంవల్ల అతడు వ్యాఘ్రదత్తుడి మాటలను విననట్లే వూరుకున్నాడు.

కాని సమరసేనుడి మౌనాన్ని వ్యాఘ్రదత్తుడు మరోవిధంగా భావించాడు. నిబ్బరంగా, నిశ్చింతగా వున్న సమరసేనుడి వాలకం వ్యాఘ్రదత్తుణ్ని కలతపరిచింది. ఎవరి సహాయాన్నో అండగా చూసుకుని అతడు అలా నిర్భయంగా వున్నాడని వ్యాఘ్రదత్తుడు అనుమానించాడు.

"నీకీ కష్టదశలో సహాయపడగలవారెవరూ లేరు. ఆ సంగతి గుర్తుంచుకో," అన్నాడు వ్యాఘ్రదత్తుడు. అలా అంటే సమరసేనుడు తనకు సహాయపడగలవాళ్ల పేరు చెపుతాడని అతడి ఆశ.

వ్యాఘ్రదత్తుడి భయసందేహాలను నిశితబుద్ధి అయిన సమరసేనుడు యిట్టే గ్రహించాడు. ఇదే అదనుగా అతణ్ని కొంత బెదిరించి చూస్తే తనకు మేలు కలగవచ్చునని అతడు వూహించాడు.

"శాక్తేయుడి త్రిశూలం ఎక్కడవున్నదీ తెలిసినది నీవొక్కడికే కాదు, ఆ సంగతి గుర్తుంచుకో. పైగా ఆ త్రిశూలం ఎక్కడ వున్నదీ తెలిసినంతమాత్రాన వుపయోగం ఏమీ లేదు," అన్నాడు సమరసేనుడు.

ఈ జవాబుతో వ్యాఘ్రదత్తుడు నివ్వెరపోయాడు. శాక్తేయుడి త్రిశూలం శిథిలనగరంలోని ఏనుగుల వనంలో వున్నదని శివదత్తుడికి తెలుసు. తను తన భటులకు చెపుతూండగా సమరసేనుడు కూడా చాటున వుండి విన్నాడు.

"త్రిశూలం ఎక్కడ వున్నదీ చాటున వుండి నీవు విన్నావని నాకు తెలుసు. శివ




దత్తుడికికూడా అది వున్న చోటు తెలుసు. అయినా నీవూ అతడూకూడా నన్ను అడ్డగించగలిగిన స్థితిలో లేరు. అలాంటప్పుడు ఆ దివ్యశక్తులు గల త్రిశూలాన్ని నాచేత బడకుండా చేయగలవా రెవరు?" అని వ్యాఘ్రదత్తుడు ప్రశ్నించాడు.

సమరసేనుడు ఆ ప్రశ్నకు జవాబు చెప్పకుండా వూరికే నవ్వి వూరుకున్నాడు. ఆ విధంగా వ్యాఘ్రదత్తుడిలో అనుమానాన్ని మరింత ఎక్కువచేయాలని సమరసేనుడి ప్రయత్నం. ఆ ప్రయత్నం ఫలిస్తుందనేందుకు సూచనగా వ్యాఘ్రదత్తుడి ముఖం వెలవెలపోవటం సమరసేనుడు గ్రహించాడు.

"త్రిశూలం నీచేత బడకుండా ఆటంకపరచగలవారు యిద్దరున్నారు. వారిలో ఒకణ్ణిమాత్రం ప్రస్తుతానికి బంధించగలిగావు. కాని ఆ త్రిశూలం నీకంట బడకముందే హతమార్చగలవాడు మరొకడున్నాడు. అతడు నాకు మిత్రుడు. అతడి అజ్ఞాపాలనకోసమే నేను నీ వ్యాఘ్రమండలానికి బయలుదేరాను. తెలిసిందా?" అన్నాడు సమరసేనుడు.

వ్యాఘ్రపత్తుడు ఆ మాటలతో కలవరపాటు చెందాడు. తన విజయం అనుకొన్నంత తేలిక కాదని అతడికి సంశయం కలిగింది.



"నన్నాటంకపరచగల అత డెవరు?" అని అడిగాడు వ్యాఘ్రపత్తుడు.

"చతుర్నేత్రుడు!" అని బిగ్గరగా జవాబిచ్చాడు సమరసేనుడు.

'చతుర్నేత్రుడు' అన్న వాక్యం వ్యాఘ్రదత్తుడిలోనే కాక అతడి భటుల్లోకూడా సంచలనం కలిగించింది. భటులు భయకంపితులై తమ నాయకునికేసి ఆదుర్దాగా చూడసాగారు. అది గమనించిన వ్యాఘ్రదత్తుడు లేని ఉత్సాహాన్నీ ధైర్యాన్నీ కనబరుస్తూ,

"అతణ్ణి నీ వెతగుదువన్నమాట!" అంటూ నవ్వాడు.

'అతడి ఆజ్ఞాపాలనకే యిక్కడికి వచ్చాను ఆ సంగతి గుర్తుంచుకో!" అన్నాడు సమరసేనుడు.

వ్యాఘ్రదత్తుడు వణికిపోయాడు. చతుర్నేత్రుడినిగురించీ, అతడి శక్తియుక్తులనుగురించి అతడు విన్నాడు.

ఇప్పుడేమి చేయటమా అని వ్యాఘ్రదత్తుడు ఆలోచించేంతలో దూరంగా సైనికుల కోలాహలం వినబడింది. అంతలో ఒక భటుడు పరుగెత్తుకుంటూ వచ్చి "అయ్యా! శివదత్తుడు తన అనుచరులతో శిథిలనగరం ప్రవేశించాడు," అని చెప్పాడు.

వ్యాఘ్రదత్తుడికి నెత్తిన పిడుగుపడినట్లయింది. తనదగ్గిర వున్న కొద్దిమంది భటులతో శివదత్తుణ్ణి ఎదుర్కోవటమో లేక అక్కడినుంచి పలాయనం చేయటమో తప్ప అతడికి మార్గాంతరం లేదు. కాని సమరసేనుణ్ణి ఏమిచేసేట్టు? ఆక్షణంలోనే అతణ్ణి తుదముట్టించటం మంచిదని తోచినా అది ప్రమాదమని అతడికి భయం కలిగింది. తన మిత్రుడి మరణానికి కోపగించిన చతుర్నేత్రుడు మొత్తం వ్యాఘ్రమండలాన్నే నాశనంచేయగలడు.

"సమరసేనా- యిప్పటికీ, యింత జరిగినతరవాతకూడా మనిద్దరం రాజీపడటం నీకూ నాకూకూడా క్షేమమని భావిస్తున్నాను. ఆ రాజీమాట లేమిటో యిద్దరం తీరిగ్గా కూచుని చర్చించాలి. మనం ఇక్కడినుంచి మరో సురక్షితప్రదేశానికివెళదాం" అన్నాడు.

తరవాత నిరాయుధుడైన సమరసేనుణ్ణి వెంటబెట్టుకుని వ్యాఘ్రదత్తుడూ అతడి భటులూ అక్కడినుంచి త్వరగా పారిపోసాగారు. పారిపోతున్నవారికి దూరంగా శివదత్తుడి అనుచరులతో పోరు సల్పుతున్న వ్యాఘ్రదత్తుడి మిగిలిన భటుల అరుపులు వినబడుతున్నాయి. —[ఇంకా వుంది]






# 17

[సమరసేనుడు ఎక్కడ దాక్కున్నదీ తెలుసుకున్న వ్యాఘ్రదత్తుడు ఆతణ్ణి తన భటులతో ఎదిరించాడు గదా? వ్యాఘ్రదత్తుడి భటులు సమరసేనుడి సైనికులను చాలామందిని చంపగలిగారు. సమరసేనుడు బందీ అయాడు. శివదత్తుడు వెనుకనుంచి వ్యాఘ్రదత్తుణ్ణి ఎదుర్కొన్నాడు. సమరసేనుడూ, వ్యాఘ్రదత్తుడూ పారిపోసాగారు. తరవాత—]

శివదత్తుడు తన అనుచరులతో శిథిలనగరం ప్రవేశించాడని తెలియటం సమరసేనుడికి ఎంతో ఉత్సాహాన్ని కలిగించింది. అతడే గనుక మరికొంచెం ముందుగా వచ్చివున్నట్టయితే తను వ్యాఘ్రదత్తుడికి బందీ అయి వుండేవాడు కాడు. వ్యాఘ్రదత్తుణ్ణీ, అతడి భటులనూ సంహరించి శాక్తేయుడి త్రిశూలాన్ని తను పొందగలిగేవాడు.

కాని యిప్పుడు తను వ్యాఘ్రదత్తుడి చేతిలో బందీఅయిపోయాడు. తనకు చతుర్నేత్రుడితో స్నేహం వున్నదనే కారణం తప్ప తనను చంపేందుకు వ్యాఘ్రదత్తుడికి మరే ఆటంకమూ లేదు. ఈ ఆపత్సమయంలో చతుర్నేత్రుడు వస్తే ఎంత బావుండును అనుకున్నాడు సమరసేనుడు.

ఇక—వ్యాఘ్రదత్తుడికి తన పరిస్థితి విషమంగానే వున్నదన్నట్టు తోచసాగింది. శివదత్తుడికి శాక్తేయుడి త్రిశూలం ఎక్కడ వున్నదీ తెలుసునా? అన్నది ఒక సంశయం. సమరసేనుడు తనకు చతుర్నేత్రుడు మిత్రుడని చెప్పినదాంట్లో వున్న నిజం ఎంత అన్న అనుమానం ఒకటి!



ఏది ఏమైనా ప్రస్తుతానికి సమరసేనుణ్ణి చంపటం తనకు క్షేమంకాదని నిర్ణయించుకున్నాడు వ్యాఘ్రదత్తుడు. వీలయితే తను సమరసేనుడితో స్నేహం నటించి బలవంతుడైన శివదత్తుణ్ణి ముందు పరిమార్చటం అన్నివిధాలా చేయదగిన పనిగా ఆసమయంలో అతడికి తోచింది.

అందరూ కొండమార్గాన గల యెత్తు పల్లాల్లోనుంచి పరిగెత్తుతున్నారు. శివదత్తుడి అనుచరులతో, తన భటులు యింకా పోరుసల్పుతున్నారనే సూచనగా వాళ్ల కేకలు వినబడుతూవుండటం వ్యాఘ్రదత్తుడికి కొంత ధైర్యకారణంగా వుంది.

"సమరసేనా! యిక్కడ మనం కొంచెం విశ్రాంతి తీసుకోవచ్చు. శత్రువులనుంచి మనం చాలాదూరం వచ్చేశాం. ఇక భయం లేదు," అన్నాడు వ్యాఘ్రదత్తుడు.

సమరసేనుడికి ఆ మాటలు చాలా ఆశ్చర్యాన్ని కలిగించినై. వ్యాఘ్రదత్తుడు బందీ అయిన తనను మిత్రుడుగా, తనకు మిత్రుడైన శివదత్తుణ్ణి శత్రువుగా చేసి మాట్లాడుతున్నాడు.

"శివదత్తుడు మొదటినుంచీ నాకు స్నేహితుడు. అతణ్ణిగురించి భయపడవలసింది నువ్వుకాని నేను కాదు," అన్నాడు సమరసేనుడు.

పరిగెత్తటంవల్ల బాగా అలిసిపోయిన వ్యాఘ్రదత్తుడు ఒక చెట్టుకు అనుకుని కూర్చుంటూ, సమరసేనుడన్న మాటలకు నిర్విణ్ణుడయాడు. అతడు వెంటనే జవాబిచ్చేందుకు సంశయించాడు. సమరసేనుణ్ణి ఏ విధంగాఅయినా సరే తన పక్షం చేసుకోవటమే మేలని భావించాడు.

"సమరసేనా! నీకు శివదత్తుణ్ణిగురించి అంతగా తెలిసినట్టులేదు. అది అట్లావుంచు. పోతే మనయిద్దరం విరోధులుగా ఉన్నందువల్ల యిద్దరమూ నష్టపడవలసివస్తుంది. ఇదుగో, నిన్ను బంధవిముక్తుణ్ణి చేస్తున్నాను.


తరవాత మనం అన్ని సంగతులూ మాట్లాడుకోవచ్చు," అన్నాడు.

వ్యాఘ్రదత్తుడి ఆజ్ఞ కాగానే యిద్దరు భటులు సమరసేనుడి చేతులకు కట్టివున్న తాళ్ళను విప్పేశారు. సమరసేనుడుకూడా తనున్న సంకటస్థితిలో వ్యాఘ్రదత్తుణ్ని ఏదో విధంగా మంచిమాటలతో సంతృప్తిపరచటమే తనకు క్షేమమని నిశ్చయించుకున్నాడు. శివదత్తుడు తనకు సహాయపడేందుకు రావచ్చని ఆశకలిగింది.

"శాక్తేయుడి అపూర్వ శక్తులు గల త్రిశూలాన్నిగురించి మనిద్దరికీ తెలుసు. అది ఎక్కడున్నదీ, దానిని పొందగలిగిన వాళ్ళకు వశమయ్యే భోగభాగ్యాల సంగతి కూడా మనిద్దరికీ తెలుసు. కాని తక్షణం దానివల్ల నువ్వు పొందగోరే లాభమేమిటో నాకు చెప్పగలవా?" అని అడిగాడు సమరసేనుడు.

వ్యాఘ్రదత్తుడు ఆ ప్రశ్న వింటూనే వెలవెలపోయాడు. ఒకవేళ ధనరాసులతో వున్న నావ సంగతి సమరసేనుడికి తెలియదా అనిపించింది. కాని మరుక్షణంలోనే అతడికి సంశయనివృత్తి కలిగింది. ఆ నావలోని ధనరాసులకోసమేగదా సమరసేనుడు యిన్ని అవస్థలు పడుతున్నది అనుకున్నాడు. అందువల్ల దానినిగురించి





తను చెప్పినందువల్ల కలగబోయే నష్టం ఏమీ లేదనుకున్నాడు.

"మనిద్దరికీ సముద్రంలో ధనరాసులతో నిండివున్న నావను గురించి తెలుసు. అందులో మనం ఒకళ్లనొకళ్లం మోసగించుకోగలిగిందేమీ లేదు. పోతే, యీ పట్టున నేనొక సంగతి చెప్పదలిచాను. ఆలోచించి మాత్రం జవాబుచెప్పు. ఆ ధనరాసులతో ఉన్న నావను చెరిసగంగా పంచుకుందాం. ఇష్టమేనా ?" అన్నాడు వ్యాఘ్రదత్తుడు.

"మన యిష్టాయిష్టాల మాట అటుంచి, ముందు ఆ మాంత్రికుల సంగతేమిటి ?" అని నవ్వుతూ ప్రశ్నించాడు సమరసేనుడు.

"ఒకసారి ఆ శాక్తేయుడి త్రిశూలం చేజిక్కించుకున్న తరవాత మనను ఈ లోకంలో ఏ శక్తీ ఎదిరించలేదుగదా ?" అన్నాడు వ్యాఘ్రదత్తుడు.

ఈ జవాబుకు సమరసేనుడు బిగ్గరగా నవ్వాడు. వ్యాఘ్రదత్తుడు దానికి కారణం అర్థంకాక ఆశ్చర్యపడుతూ అతడికేసి అనుమానంగా చూశాడు.

"ఆ శాక్తేయుడి త్రిశూలం యీ నిమిషాన మనకంటె, శివదత్తుడి చేతుల్లోకి పోయే అవకాశం ఎక్కువుంది. ఆ సంగతి గ్రహించావా ?" అన్నాడు సమరసేనుడు.

"శివదత్తుడికి శాక్తేయుడి త్రిశూలం దాచివున్న ఆ ప్రత్యేక స్థలం సంగతి తెలీదు. పైగా నా భటుల్నందర్నీ హతమార్చిందే అతడు చేయగలిగిందికూడా ఏమీలేదు. త్రిశూలం దాచివున్న చోటు గుర్తింపబడిన పటం నాదగ్గిర ఉంది. 'ఏనుగుల వనంలోని విషవృక్షం' అన్నంతమాత్రాన, పటంలోని గుర్తుల సాయం లేకుండా ఎవరూ దానిని వెతికి పట్టుకోలేరు," అన్నాడు వ్యాఘ్రదత్తుడు నిబ్బరంగా.

వ్యాఘ్రదత్తుడు తన మాటలు ముగించీ ముగించకముందే ఆ ప్రదేశమంతా మార్మోగేటట్టు ఏకాకి మాంత్రికుడి వేగు కపాలుడి


కఠోరస్వరం వినబడింది. ఆ శబ్దం వింటూనే సమరసేనుడు లేచి నిలబడ్డాడు. వ్యాఘ్రదత్తుడూ అతడి వెంటవున్న భటులుకూడా భయకంపితులై దిక్కులు చూడసాగారు.

"ఇది చతుర్నేత్రుడి వేగు కంకాళుడు! మీరు వెంటనే పారిపోయి దూరంగా వున్న ఏ గుహలోఅయినా దాక్కొనటం మంచిది," అన్నాడు సమరసేనుడు.

వ్యాఘ్రదత్తుడు అనుమానంగా అతడికేసి చూస్తూ, "చతుర్నేత్రుడు నీ స్నేహితుడని చెప్పావుకదా? అలాంటప్పుడు మనకు వచ్చిన భయమేమిటి?" అని అడిగాడు.

సమరసేనుడు ఇక ఆలసిస్తే తనకు ప్రమాదమని గ్రహించాడు. కంకాళుడు ఏకాకిమాంత్రికుడి వేగు! మంత్రవేత్త అయిన చతుర్నేత్రుడికి, అంత బలవంతుడైన మరోశత్రువు ఏకాకి అనేవాడు వున్నాడని వ్యాఘ్రదత్తుడికి తెలియటం ప్రమాదమనే, సమరసేనుడు ఆ విధంగా వ్యాఘ్రదత్తుడితో అబద్ధం చెప్పాడు.


"చతుర్నేత్రుడి కంట మీరు పడటం అంత క్షేమంకాదు. ముందుగా నేనతడితో మాట్లాడి తరవాత మీకు పరిచయం కలిగిస్తాను. మీ మంచికే చెపుతున్నాను. మీరు వెంటనే ఏ గుహలో అయినా తలదాచు




కోవటం ఉత్తమం," అన్నాడు సమరసేనుడు ఆదుర్దాగా.

సమరసేనుడు యిలా చెపుతూండగానే 'కపాలా, కాలభుజంగా!' అంటూ ఏకాకి కంఠం భయంకరంగా ధ్వనించింది. ఆ ధ్వనికి నివ్వెరపోయిన వ్యాఘ్రదత్తుడూ అతడి భటులూ అక్కడినుంచి పరిగెత్తసాగారు. అదే అదనుగా భావించిన సమరసేనుడుకూడా అక్కడినుంచి లేచి మరో వైపుకు పరుగెత్తసాగాడు.

కొంతదూరం పరిగెత్తి వెనక్కు తిరిగి చూసిన వ్యాఘ్రదత్తుడికి, సమరసేనుడు కూడా పారిపోతూవుండటం వెంటనే అను





మానం కలిగించింది. తన స్నేహితుడని చెప్పిన చతుర్నేత్రుడినుంచి అతడెందుకు పారిపోవాలి అన్న సంశయం కలిగింది. ఇందులో ఏదో మోసం వున్నదనుకున్నాడు.

వ్యాఘ్రదత్తుడు యీ విధంగా ఆలోచించే టంతలో ఏకాక్షి మాంత్రికుడు అక్కడికి రానేవచ్చాడు. అతడి దృష్టి వ్యాఘ్రదత్తుడి మీద ప్రసరించింది. అతడు మండిపోతూ "కపాలా, కాలభుజంగా! చతుర్నేత్రుడి భృత్యుల్ని చుట్టుముట్టండి, వీళ్లను హతమారుస్తాను!" అని భీకరంగా అరిచాడు.

వ్యాఘ్రదత్తుడికి అసరికి పరిస్థితి అర్థమై పోయింది. ఆ వచ్చిన మాంత్రికుడు సమరసేనుడి స్నేహితుడైన చతుర్నేత్రుడు కాదు. తనను మోసగించి సమరసేనుడు పారిపోయాడు. ఇప్పుడు తను చేయవలసిందేమిటి? ఏదో విధంగా యీ మాంత్రికుడికి తను చతుర్నేత్రుడి అనుచరుణ్ణి కాదనీ, అతడికి శత్రుపక్షంలోని వాడిననీ వెంటనే తెలియచెప్పాలి.

ఏకాక్షి ఆజ్ఞకాగానే అతడి వేగులైన కపాలమూ, కాలభుజంగమూ వ్యాఘ్రదత్తుణ్ణీ, అతడి భటుల్నీ చుట్టుముట్టినై. కాలభుజంగం కోరలు చాచి బుసలుకొడుతూ వాళ్ళచుట్టూ తిరగసాగింది. కపాలం వాళ్ళ తలలమీద ఎగురుతూ గుండెలదిరేట్టు వికృతంగా అరవసాగింది.

ఏకాక్షి హహ్హహ్హ అని నవ్వుతూ వాళ్ళను సమీపించాడు. అంతలోనే అతడి వికృతమైన నవ్వు ఆగిపోయింది. అతడు భావించినట్టు తనచేత చిక్కినవాళ్లు సమరసేనుడూ, అతడి సైనికులూ కారని గ్రహించాడు.

"మీరెవరు? కుంభాండుడి అనుచరులా?" అని అడిగాడు ఏకాక్షి. వ్యాఘ్రదత్తుడు వెలవెలపోయాడు. అతడికి కుంభాండు డెవరో తెలియదు.

"నాపేరు వ్యాఘ్రదత్తుడు. నేనీ వ్యాఘ్రమండలానికి రాజును. తమరుచెప్పే

కుంభాండు డెవరో నాకు తెలియదు!" అన్నాడు వ్యాఘ్రదత్తుడు వణికిపోతూ.

"అయితే నీవీ మృత్యులోయకు అద్దరి నుంచి వచ్చినవాడివి కాదన్నమాట?" అన్నాడు ఏకాకి అనుమానంగా చూస్తూ.

"మీరు చెపుతున్న ఆ మృత్యులోయ ఎక్కడ వున్నదోకూడా నాకు తెలీదు. బహుశా ఆ లోయను మేము మరో పేరుతో పిలుస్తూండవచ్చు," అన్నాడు వ్యాఘ్రదత్తుడు భయపడుతూ.

"అయితే సమరసేనుడు అన్న పేరు గలవాడెవణ్ణయినా నీవెరుగుదువా?" అని ప్రశ్నించాడు ఏకాకి.

ఏకాకి అలా ప్రశ్నించేసరికి వ్యాఘ్రదత్తుడికి పరిస్థితి అంతా అవగాహన అయిపోయింది. ఏకాకి మాంత్రికుడు, సమరసేనుడికి ప్రబల విరోధి అని అతడు గ్రహించాడు, ఇప్పుడు తనకు మంచి అవకాశం చిక్కిందని భావించాడు.

"మాంత్రిక మహాశయా! ఆ సమరసేనుడు రెండుమూడు ఘడియలకుముందు నానుంచి తప్పించుకుని పారిపోయాడు. అతడు నాకు ప్రబల శత్రువు. అతణ్ణి బందీగా పట్టుకున్నానుకూడా," అన్నాడు.


వ్యాఘ్రదత్తు డిలా చెప్పేసరికి ఏకాకికి కూడా పరిస్థితి అర్థమైంది. సమరసేనుణ్ణి వెతికిపట్టాలంటే వ్యాఘ్రదత్తుడు తనకు సాయంగా ఉండగలడని అతడు భావించాడు. కాని సమరసేనుడితో యితడికి విరోధం రావటానికి గల కారణాలను ముందు తెలుసుకోవాలనుకున్నాడు.

"మీ యిద్దరికీ విరోధం ఎందుకు వచ్చింది? అతడు ఖైదీగా చిక్కి ఎలా పారిపోగలిగాడు?" అని అడిగాడు ఏకాకి.

"తమరు సర్వజ్ఞులు. నేను చెప్పవలిసిందేముంది?" అంటూ తల వాల్చాడు వ్యాఘ్రదత్తుడు.

(జూన్ సంచికలో ముగింపు)






## 18

[శిథిలనగరంనుంచి పారిపోతున్న వ్యాఘ్రదత్త, సమరసేనులకు ఏకాకిమాంత్రికుడు ఎదురైయ్యాడుగదా? అప్పుడు సమరసేనుడు మాంత్రికుడి కంట బడకుండా తప్పించుకున్నాడు. తనకు విరోధివర్గంలోనివాడైన సమరసేనుణ్ణి హతమార్చాలంటే, వ్యాఘ్రదత్తుడు తనకు అన్నివిధాలా సహాయపడగలడని ఏకాకికి నమ్మకం కలిగింది. తరువాత—]

ఏకాకిమాంత్రికుడికి, వ్యాఘ్రదత్తుడి జవాబుతో పరిస్థితి అర్థమైపోయింది. తనలాగే అతడూ ధనరాసులతో వున్న నావకోసమే ప్రయత్నిస్తున్నాడని అతడు గ్రహించాడు.

"ధనరాసులతో వున్న నావను వశపరుచుకోవటం మానవమాత్రులకు సాధ్యమయే పని కాదని నీకు తెలియదా?" అని ప్రశ్నించాడు ఏకాకి.

అందుకు వ్యాఘ్రదత్తుడు తల వంకిస్తూ, "కార్తేయుడి త్రిశూలం వున్నదిగదా?" అని జవాబిచ్చాడు.

కార్తేయుడి త్రిశూలం పేరు వింటూనే ఏకాకి నిశ్చేష్టుడయాడు. తనకూ, చతుర్నేత్రుడికి మాత్రమే ఆ త్రిశూలం సంగతి తెలుసునని అతడి నమ్మకం!

ఇక వ్యాఘ్రదత్తుడు ప్రాణభీతితో, ఆ త్రిశూలం శిథిలనగరంలోని ఏనుగుల వనంలో, గురుద్రోహి అస్థిపంజరంకింద ఉందని చెప్పేశాడు. శివదత్తుడు దానికోసం ప్రయత్నిస్తున్నాడనీ, సమరసేనుడుకూడా అక్కడికే పోయివుంటాడని వ్యాఘ్రదత్తుడు చెప్పగానే ఏకాకి క్రోధంతో వణికిపోయాడు.



"వ్యాఘ్రదత్తా! ఈ కార్యం సాధించటానికి మన యిద్దరం ఒకళ్ళకొకళ్ళు సహాయం చేసుకోక తప్పదు. సమరసేనుడికి, చతుర్నేత్రుడనే ఒక తుచ్ఛ మాంత్రికుడు ఈ కార్యంలో సహాయపడవచ్చు. కనుక ముందుగా మనం ఆ శిథిలనగరం చేరి శాక్తేయుడి త్రిశూలం చేజిక్కించుకోవటం ఉత్తమం. ముందుండి దారి చూపు." అన్నాడు ఏకాకి.

ముందు వ్యాఘ్రదత్తుడూ, అతడి భటులూ బయలుదేరారు. వెనక ఏకాకి తన వేగులతో నడవసాగారు. కొంతదూరం వెళ్ళగానే ఏకాకి తన వేగులకేసి చూసి:

"కపాలా, కాలభుజంగా! మీరు ముందు వెళ్ళి ఆ సమరసేనుణ్ణి వెతకండి," అని ఆజ్ఞాపించాడు.

వేగులు వెళ్ళిన కొద్దిసేపట్లోనే ఏకాకీ, వ్యాఘ్రదత్తుడూ అదిరిపడేలా నల్లగూబ కంఠస్వరం వినబడింది. అది ఏకాకి తలమీదుగా ఎగురుతూ, "చతుర్నేత్రా, ఏకాకి, ఏకాకి!" అని అరవసాగింది.

ఏకాకి భయంతో కంపించిపోతూ ఎడమచేతితో కన్ను మూసుకుని, కుడిచేతితో కత్తిని గాలిలోకి తిప్పుతూ "కపాలా, కాలభుజంగా!" అని కంపిస్తున్న కంఠంతో కేకలుపెట్టాడు. కాని అతడు ఎంత అరిచినా అతడి వేగులు అక్కడికి రాలేదు. ఇప్పుడు ఏమి చేయటమా అని అతడు ఆలోచించేంతలో నల్లగూబ అక్కడినించి ఎగిరిపోయింది.

వ్యాఘ్రదత్తుడూ, ఏకాకీ ఏనుగులవనం ప్రవేశించారు. అప్పుడు వ్యాఘ్రదత్తుడు "ఏకాకి మహాశయా! అదే ఏనుగులవనం! పడగ విప్పి బుసకొడుతున్న పాములవంటి ఆకులతో వున్నదే విషవృక్షం. ఆ కనబడే సమాధికిందే త్రిశూలం వున్నది" అన్నాడు.

ఆ మాటలతో ఏకాకి పరమానంద భరితుడయ్యాడు. "సరే వ్యాఘ్రదత్తా! నీ

భటులతో శివదత్తుణ్ణి ఎదుర్కో. ఈలోపల నేను త్రిశూలంసంగతి తేల్చుకుంటాను," అంటూ వ్యాఘ్రదత్తుణ్ణి ప్రోత్సహించాడు.

వ్యాఘ్రదత్తుడు ముందు వెనుకలు ఆలోచించకుండా వున్న కొద్దిమంది భటులతో శివదత్తుడి అనుచరులమీదికి దూకాడు.

శివదత్తుడి అనుచరులు వ్యాఘ్రదత్తుడి భటులకన్న మూడింతలు ఉన్నారు. ఆ కారణంచేత క్రమక్రమంగా వ్యాఘ్రదత్తుడి భటులు చావుదెబ్బలు తిని కిందపడసాగారు.

ఈ పరిస్థితిలో రానున్న ప్రమాదాన్ని గుర్తించాడు ఏకాకి. అతడు ఎలుగెత్తి, "కపాలా, కాలభుజంగా!" అంటూ అరవసాగాడు. చూస్తూవుండగానే కపాలం, కాలభుజంగం అక్కడికి వచ్చినై.

శివదత్తుడి అనుచరులు వాటిని చూస్తూనే గుండెలదరి పారిపోసాగారు.

"వ్యాఘ్రదత్తా! ఇదే మనకు మంచి అదను. కార్తేయుడి త్రిశూలం ఉన్న ఆ సమాధిప్రాంతాన్ని, నీభటులతో వెంటనే తవ్వించు," అన్నాడు ఏకాకి.

వ్యాఘ్రదత్తుడికూడా తన విజయం నిస్సందేహం అనిపించింది. సమరసేనుడూ, చతుర్నేత్రుడూ అక్కడికి వచ్చేలోపుగా తను ఆ దివ్యశక్తులు గల త్రిశూలం వశపరుచుకోవచ్చుననుకున్నాడు. అతడు తన





భటులను హెచ్చరిస్తూ ముందుకు దూకి మృతవీరుల సమాధిని స్వయంగా తవ్వసాగాడు. అంతలో అక్కడికి వందగజాల దూరంలో వున్న విషవృక్షాన్నుంచి మూలుగులు వినిపించసాగినై. పడగ విప్పిన పాములవలె వున్న ఆ చెట్టు ఆకులు బుసలుకొట్ట ప్రారంభించినై.

ఏకాకి చెట్టును సమీపించాడు. తన చేతనున్న కత్తిని పైకెత్తి ఏదో మంత్రం పఠించనున్నంతలో, వ్యాఘ్రదత్తుడి కంఠంనుంచి జాలి కొలిపే ఆర్తనాదం వినిపించింది. ఏకాకి వెనక్కు తిరిగిచూశాడు. చతుర్నేత్రుడి వేగు నరవానరం వ్యాఘ్రదత్తుణ్ణి చేతులతో బంధించి గిరగిర తిప్పుతున్నది. నల్లగూబ 'ఏకాకీ, ఏకాకీ!' అని అరుస్తూ విషవృక్షంకేసి వస్తున్నది.

ఏకాకి కంగారుపడ్డాడు. తను శాక్తేయుడి త్రిశూలాన్ని వెతికి పట్టుకోకముందే, చతుర్నేత్రుడూ, సైనికులతో సమరసేనుడూ ఆ ప్రదేశానికి రావచ్చని అతడికి భయం కలిగింది. అతడు కాలభుజంగాన్ని పిలిచి నరవానరంమీదికి ఉసికొలిపాడు. దూరంగా వున్న రాళ్లగుట్టలమీదికి వ్యాఘ్రదత్తుణ్ణి విసిరేసి, నరవానరం కాలభుజంగంతో కలియబడింది. పైన కపాలం, నల్లగూబ భయంకరంగా పోరాడసాగినై.

ఏకాకి భయపడినదంతా నిజమైంది. చతుర్నేత్రుడు 'ఉలూకా, నరవానరా!' అంటూ అక్కడికి రానేవచ్చాడు. సమరసేనుడి వెంట కొందరు సైనికులున్నారు. పారిపోతున్న శివదత్తుడూ, అతడి అనుచరులు కూడా కొంత తెప్పరిల్లి ఆ ప్రదేశానికి వస్తున్నారు. చావగా మిగిలిన వ్యాఘ్రదత్తుడి భటులు వాళ్లను ఎదుర్కొన్నారు.

కాలభుజంగం విషపుకోరలనుంచి తప్పుకుంటూ, నరవానరం దానిని ఒక పెద్ద రాతి సుత్తెతో కొట్టసాగింది. నల్లగూబకూడా, కపాలపు బోసినోటికి అందకుండా దానిని



కాళ్ళతో తన్నుతూ ముక్కుతో పొడవసాగింది. తన పరిస్థితి చాలా ప్రమాదకరంగా పరిణమిస్తున్నదని గ్రహించిన ఏకాకి కత్తి దూసి చతుర్నేత్రుడిమీదికి వచ్చాడు. చతుర్నేత్రుడుకూడా ఏమాత్రం జంకక అతణ్ణి ఎదుర్కొన్నాడు. ఈలోపల చతుర్నేత్రుడి సలహాప్రకారం సైనికులను వెంటతీసుకుని సమరసేనుడు సమాధి తవ్వసాగాడు.

మృతవీరుల సమాధిని తవ్వుతున్న సమరసేనుడికి, లోనుండి వింత అరుపులూ వికృతమైన నవ్వులూ వినిపించసాగినై.


సమరసేనుడు భయపడలేదు. తమ నాయకుడి గుండెనిబ్బరం గ్రహించిన సైనికులు ఎట్లా అయితేం, మృతవీరుల సమాధిని అట్టడుగువరకూ తవ్వేశారు.

సమాధి అడుగున ఒకేఒక అస్థిపంజరం కనబడింది. అది గురుద్రోహి అస్థిపంజరం అని సమరసేనుడు గ్రహించాడు. ఆ అస్థిపంజరం గుండెల్లో నిలువునా గుచ్చుకుని శాక్తేయుడి త్రిశూలం కనబడింది. వణుకుతున్న చేతుల్తో సమరసేనుడు అస్థిపంజరం నుంచి త్రిశూలం బయటికి గుంజాడు. మరుక్షణం అస్థిపంజరం గాలిలోకి లేచి — "గురూ, శాక్తేయా! ఈనాటితో నాకు శాపవిముక్తి కలిగింది. నేను తిరుగా శమన ద్వీపానికి పోతున్నాను!" అంటూ రివ్వున గగనమార్గాన బయలుదేరింది.

అస్థిపంజరం ఆవిధంగా పలుకుతూ ఆకాశమార్గాన ఎగిరిపోవటం చూసేసరికి ఏనుగులవనంలో వున్న ప్రతి ఒక్కడికీ గుండెలు అవిసిపోయినై. ఏకాకి ఎత్తిన కత్తి అలాగేవుంచి, ఎగిరిపోతున్న గురుద్రోహి అస్థిపంజరానికేసి చూడసాగాడు. తడబడుతున్న అడుగులతో సమరసేనుడు చతుర్నేత్రుణ్ణి సమీపించి అపూర్వ శక్తులు గల శాక్తేయుడి త్రిశూలాన్ని అతడి చేతికి అందించాడు.

ఏకాకి తన దృష్టిని అస్థిపంజరంమీద నుంచి చతుర్నేత్రుడికేసి తిప్పేసరికి అతడి


CHITRA



కంటికి, మెరుస్తున్న త్రిశూలం కనబడింది. వెంటనే ఒక చావుకేక పెట్టి, 'కాలభుజంగా! కపాలా!' అని అరుస్తూ పారిపోసాగాడు.

"చతుర్నేత్రా! ఆ పాపిని ప్రాణాలతో పోనీకండి. వెంటనే హతమార్చండి!" అన్నాడు సమరసేనుడు. అందుకు చతుర్నేత్రుడు నవ్వుతూ "సమరసేనా! ఆ ఏకాకి ఎక్కడికీ పారిపోలేడు. మనం ఏ క్షణాన కావాలంటే, ఆ క్షణాన, యీ త్రిశూలం వాడెక్కడ దాగివున్నా సరే హత మార్చగలదు," అంటూ త్రిశూలాన్ని ఏకాకి కేసి విసురుతూ, "ఆ గురుద్రోహి తమ్ముడైన ఏకాకిని హతమార్చి రా!" అన్నాడు.

త్రిశూలం మెరుపులా గాలిలోకి ఎగిరింది. చూస్తున్నంతలో అది పారిపోతున్న ఏకాకిని సమీపించి బలంగా గుండెల్లో పొడిచింది. 'అబ్బా...!' అని అరుస్తూ ఏకాకి కింద పడిపోయాడు. త్రిశూలం తిరిగి వచ్చి చతుర్నేత్రుడి పాదాలముందు పడింది.

"చతుర్నేత్రా! ఫనిలో పని, ఆ కపాలుణ్ణీ కాలభుజంగాన్నికూడా తుదముట్టించు!" అన్నాడు సమరసేనుడు అమితోత్సాహంతో.

"ఏకాకి చావు తరవాత కపాలం, కాలభుజంగం ఎవరికీ ప్రమాదం కలిగించలేవు," అన్నాడు చతుర్నేత్రుడు.

తరవాత చతుర్నేత్రుడు ఒక క్షణం ఆగి "సమరసేనా! మనం కాలయాపన కాకుండా తూర్పుతీరం చేరి ఆ ధనరాసులతో వున్న నావను వశపరుచుకుందాం" అన్నాడు

వారు అడవిదారులవెంటా, కొండలోయలగుండా నడిచి తూర్పుతీరం చేరారు. ధనరాసులతో నిండివున్న నావా, దానిని కాపలా కాస్తున్న నాగకన్యా ఎప్పటిలాగే సముద్రంలో తేలిఆడుతూ కనబడ్డారు.

చతుర్నేత్రుడు తన చేతనున్న శక్తియుడి అపూర్వ శక్తులు గల త్రిశూలాన్ని మంత్రించి నావవైపుకు విసిరాడు. త్రిశూలం మెరుపులా పోయి నావను తాకింది.

మరుక్షణంలోనే నాగకన్య, నావచుక్కాని చేతబట్టి దానిని తీరానికి చేర్చింది.

"నేను శమనద్వీపపు రాజైన శాక్తేయుడి శిష్యుణ్ణి. నాపేరు చతుర్నేత్రుడు! ఇది మంత్రశక్తి గల అతడి త్రిశూలం. గురు వాజ్ఞ తెలుసుగదా! నువ్వు నా భార్యవు!" అన్నాడు చతుర్నేత్రుడు నాగకన్యతో.

నాగకన్య ఆ మాటలు వింటూనే చుక్కాని వదిలి, ముందుకు వచ్చి, చతుర్నేత్రుడికి ప్రణమిల్లింది. సమరసేనుడూ, సైనికులూ ఉత్సాహంతో జేజేలు కొట్టారు. అప్పుడు చతుర్నేత్రుడు, సమరసేనుడికేసి తిరిగి—

"సమరసేనా! ఈనాటినుంచి మేము భార్యా భర్తలం. ఈ మంత్రాలదీవిలో శాంతంగా కాలం గడపదలిచాం. నువ్వు వచ్చిన పని అయింది. ధనరాసులతో మీ కుండలినీద్వీపం చేరవచ్చు," అన్నాడు.

అప్పటికప్పుడే సమరసేనుడు ప్రయాణ సన్నాహం చేశాడు. అతడు చతుర్నేత్రుడికి కృతజ్ఞత తెలియపరిచాడు. చతుర్నేత్రుడు అతణ్ణి దీవించి, తన భార్య అయిన నాగకన్యతో అడవికేసి వెళ్ళిపోయాడు.

భూకంపాలతో భయంకర మృగాలతో, నిండివున్న మంత్రాలదీవి తమకు వాసయోగ్యం కాదని నిశ్చయించుకున్న శివదత్తుడూ, అతడి అనుచరులుకూడా, సమరసేనుడితో కుండలినీద్వీపానికి బయలుదేరారు. నిర్మలంగా ప్రశాంతంగా వున్న సముద్రంలో ఒక మాసం రోజులు ప్రయాణం చేసి, ఒకనాటి ఉదయకాలంలో అందరూ కుండలినీద్వీపం చేరారు.

అనేక సంవత్సరాల తరవాత తిరిగి వచ్చిన సమరసేనుడికి, సైనికులకూ ద్వీప ప్రజలూ, రాజైన చిత్రసేనుడూ ఘనమైన స్వాగతం యిచ్చారు. ఎన్నో ధనరాసులు గల ఓడనుకూడా వెంట తెచ్చినందుకు ప్రతి ఒక్కరూ పరమానందం పొందారు.

—('తోకచుక్క' కథ ముగిసింది)

